
గురువారం 23-3-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 361

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'



సిరీస్ సమర్పయామి...
మూడో వన్డేలో భారత్ ఓటమి. 2-1తో సిరీస్ గెల్చుకున్న ఆస్ట్రేలియా. - 12లో



కుబేరుల్లో ఒకే ఒక్కడు..
'హురున్' సంపన్నుల జాబితాలో భారత్ నుంచి ముకేశ్ అంబానీకి చోటు. - 13లో



అప్రమత్తత ముఖ్యం: మోదీ
కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో తాజా పరిస్థితిపై ప్రధాని మోదీ అత్యున్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.
- వివరాలు 6లో



పాక్‌లో భూకంపం..12 మంది బలి
రిక్టర్ స్కేల్‌పై 6.8గా నమోదైన భారీ భూకంపం పాకిస్తాన్‌ను వణికించింది. ఈ ధాటికి 12 మంది మరణించారు.
- వివరాలు 6లో



విదేశీ నిధులపై పోలీసుల ఆరా
అమృత్‌పాల్ సింగ్‌కు అందుతున్న విదేశీ నిధులపై అతడి భార్య, తల్లిదండ్రులను బుధవారం పోలీసులు విచారించారు.
- వివరాలు 6లో



ఇద్దరు మిత్రులు సాధించిందేమిటి!?
ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం ఇకపై చెల్లదని చెప్పడమే జిన్‌పింగ్, పుతిన్ భేటీ అసలు ఉద్దేశమని నిపుణులు చెబుతున్నారు.
- వివరాలు 6లో

అక్షరాలా కష్టాలే

ప్రాథమిక విద్యకూ పక్క ఊరు వెళ్లాల్సిందే..

రాష్ట్రంలో ప్రభుత్వ బడి లేని ఊళ్లు 3,688

రాష్ట్ర ప్రభుత్వ 'యూ డైస్' నివేదిక స్పష్టీకరణ

- ప్రాథమిక పాఠశాలలకు దూరంగా 546 గ్రామాలు
- చదువుకు కిలోమీటర్ల కొద్దీ వెళుతున్న చిన్నారులు 30 వేలకుపైనే
- వానొస్తే బురద..ఆటోల్లో కిక్కిరిసి..!
- దూరం వెళ్లలేక చదువుకు మధ్యలోనే స్వస్తి
- గిరిజన గ్రామాల్లో కొనసాగుతున్న బాల్య వివాహాలు
- సర్కారు స్కూళ్లు శివారు తండాలకూ చేరాలంటున్న నిపుణులు


- హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న సిద్దిపేట జిల్లాలోనే అత్యధికంగా 314 శివారు గ్రామాల్లో స్కూళ్లు లేని పరిస్థితి ఉంది. 284 శివారు గ్రామాల్లో పాఠశాలలు లేని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆ తర్వాతి స్థానంలో ఉంది.
- ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం జైత్రం తండా గ్రామ విద్యార్థులు ఉన్నత పాఠశాల కోసం 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి ఆటోలో వెళ్తున్నారు. కిక్కిరిసిన ఆటో ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవుతుందోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు.

సాక్షి, హైదరాబాద్: దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లవుతోంది. అందరికీ విద్య ప్రాథమిక హక్కు అని మన రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. కానీ ఇప్పటికీ, ఇన్నేళ్లు గడిచినా.. ఎన్నో గ్రామాలకు విద్య దూరంగానే ఉంది. ప్రాథమిక విద్యకు సైతం వ్యయప్రయాసలకోర్చి పక్క ఊరికో, ఆ పక్క ఊరికో వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇక మాధ్యమిక, ఉన్నత పాఠశాల కోసం మరింత దూరం ప్రయాణించక తప్పని పరిస్థితి ఉంది. మన రాష్ట్రాన్నే చూసుకుంటే.. 3,688 శివారు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలే లేదు. 546 శివారు గ్రామాల్లో అక్షరాలు దిద్దించే ప్రాథమిక పాఠశాల లేదు. 2,018 గ్రామాలు మాధ్యమిక విద్యకు మిగతా 3వ పేజీలో ▶



చదవాలంటే నడవాల్సిందే..
ఈ బడి పిల్లల కష్టాల గురించి 'యూ డైస్'.. తమ నివేదికలో ప్రస్తావించింది. గిరిజన గ్రామమైన కొండతోగు.. ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలంలో ఉంది. ఇక్కడ దాదాపు 21 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా చదువుకోవడం కోసం 3 కిలోమీటర్ల దూరంలోని పండువారిగూడేనికి నడిచి వెళ్తున్నారు. ఇలా రోజూ రానూపోనూ ఆరు కిలోమీటర్లు నడవాల్సిందే.. మామూలు రోజుల్లోనే ఈ మార్గంలో నడవడం కష్టం.. ఇక, వానొస్తే అంతే..

ఇక అన్నీ సీబీ పరీక్షలే!



కంప్యూటర్ బేస్డ్ టెస్టుల నిర్వహణపై టీఎస్‌పీఎస్సీ కసరత్తు

- ఓఎంఆర్ ఆధారిత పరీక్షలకు క్రమంగా స్వస్తి
- లీక్‌లను అరికట్టేందుకు ఉత్తమ మార్గమనే భావన
- అవసరమైతే రెండు కంటే ఎక్కువ సెషన్లు నిర్వహించే యోచన

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన ప్రశ్న పత్రాల లీకేజీతో తీవ్ర అపవాదును మూటగట్టుకున్న తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే ఆయా పరీక్షలు రద్దు చేసిన కమిషన్.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ నిర్వహించే అర్హత పరీక్షల్లో 50 వేల లోపు అభ్యర్థులున్న పరీక్షలను మాత్రమే సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పద్ధతిలో నిర్వహిస్తోంది. అంతకంటే ఎక్కువున్నప్పుడు ఓఎంఆర్ (ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్) ఆధారిత పరీక్షలను నిర్వహిస్తోంది. ఓఎంఆర్ ఆధారిత పరీక్షల నిర్వహణకు సుదీర్ఘ కసరత్తు అవసరం. ప్రశ్నపత్రాలను మూడు నెలలకు ముందుగానే ఖరారు చేసి మిగతా 2వ పేజీలో ▶

మా నౌకరీలు మాగ్గావాలే
- ఈ నినాదంతో 25న ఇందిరా పార్కు వద్ద నిరుద్యోగ మహా ధర్నా
- లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్
- బీజేపీ సమావేశంలో నిర్ణయాలు

2లో

ఆ ముగ్గురినీ ప్రాసిక్యూట్ చేయాలి
- కేటీఆర్, జనార్దన్‌రెడ్డి, అనితా రామచంద్రన్‌ను విచారించాలి
- కోట్లాది రూపాయలకు పరీక్షల పేపర్లు అమ్ముకున్నారు
- గవర్నర్‌కు రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ బృందం ఫిర్యాదు

న్యూస్‌రీల్

ఘనంగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం




పద్మ అవార్డుల ప్రదానోత్సవం రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 106 మందికి జనవరి 25న కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులు ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం తొలివిడతలో భాగంగా పలువురికి రాష్ట్రపతి అవార్డులు అందజేశారు.
- వివరాలు 14లో

'ట్రూ అప్'పై తేలేది నేడే..!



విద్యుత్ వినియోగదారుల నుంచి మొత్తం రూ.16,107 కోట్ల ట్రూఅప్ చార్జీల వసూళ్లకు అనుమతి కోరుతూ డిస్కంలు సమర్పించిన ప్రతిపాదనలపై టీఎస్ఈఆర్సీ గురువారం తన నిర్ణయాన్ని ప్రకటించనుంది.
- వివరాలు 14లో

రూ.6 కోట్లు ఉంటే.. అంతరిక్షంలోకి!



అంతరిక్షంలో పర్యటించాలనుకునే భారతీయుల కల సాకారానికి ఇస్రో ప్రయత్నాలు ప్రారంభించింది. 2030 నాటికి స్పేస్ టూరిజం ప్రాజెక్టును పట్టాలెక్కిస్తామని.. దీనికి సంబంధించిన పని జరుగుతోందని ఇస్రో చైర్మన్ ఇటీవల ప్రకటించారు. టికెట్ ధర రూ.6 కోట్లు ఉండవచ్చని అంచనా.
- వివరాలు 3లో



రవీంద్రభారతిలో ఉగాది వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి తలసాని. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, వేద పండితుడు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి తదితరులు

సంవత్సరాంతంలో రాజకీయ ఒడిదుడుకులు
- 3లో

పంట నష్టం జిల్లాలకు నేడు సీఎం కేసీఆర్
రైతులకు భరోసా కల్పించనున్న ముఖ్యమంత్రి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన వడగళ్ల వర్షానికి పంట నష్టం అధికంగా వాటిల్లిన 4 జిల్లాల్లో సీఎం కేసీఆర్ గురువారం పర్యటించి, రైతులతో మాట్లాడి భరోసా కల్పించనున్నారు. అకాల వర్షాలకు ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో వరి, మిర్చి, మామిడి, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రైతులు భారీగా నష్టపోయారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, అధికారులు ఇప్పటికే విస్తృతంగా పర్యటించారు. వారి నివేదికల ఆధారంగా సీఎం కేసీఆర్ గురువారం ఆ నాలుగు జిల్లాల్లో పర్యటించనున్నారు.
సీఎం పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి..
ముఖ్యమంత్రి ఉదయం 10:15కు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మిగతా 2వ పేజీలో ▶

గట్టిగా ఎదుర్కొందాం!
ఈడీ విచారణపై కవితతో సీఎం కేసీఆర్



- భవిష్యత్తులో అనుసరించాల్సిన వైఖరిపై సూచనలు
- ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రితో భేటీ అయిన కవిత
- మంత్రులు కేటీఆర్, హరీశ్ హాజరు!
- సుప్రీంలో పకడ్బందీ వాదనలకు కవిత న్యాయవాదుల కసరత్తు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో వరుసగా రెండురోజులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరైన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో భేటీ అయ్యారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కూడా ఈ సమావేశంలో మిగతా 2వ పేజీలో ▶

హైకమిషన్ వద్ద మళ్లీ ఉద్రిక్తత
- ఖలిస్తాన్ అనుకూల, భారత వ్యతిరేక నినాదాలు చేసిన వేర్పాటువాదులు
- దాడి యత్నాన్ని అడ్డుకున్న లండన్ పోలీసులు

పోలీసులే బారికేడ్లు తొలగించారు
- వివరాలు 6లో



లండన్‌లోని భారత్ హైకమిషన్ వద్ద వేర్పాటువాదుల ఆందోళన

ఇదండీ సంగతి



.. ఈ పని మనం ఎప్పుడో చేయాల్సిందనుకుంటా సార్!

క్లుప్తంగా...

'రెచ్చగొట్టేందుకే ఓయూకు రేవంత్‌రెడ్డి'

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ప్రశాంత వాతావరణంలో చదువుకుంటున్న విద్యార్థులను రెచ్చగొట్టేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఓయూకు ఆహ్వానిస్తున్నారని బీఆర్ఎస్ విద్యార్థి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు, ప్రధాన కార్యదర్శులు చటారి దశరథ్, హరిబాబు పేర్కొన్నారు. బుధవారం వారు ఓయూలో మాట్లాడుతూ వక్రబుద్ధితో కొందరు పేపర్ లీక్ చేస్తే దాన్ని అడ్డంపెట్టుకొని ప్రభుత్వంపై బురదజల్లుతూ రాజకీయం చేస్తున్న ఓటుకు కోట్లు దొంగ విద్యార్థులకు చెప్పే నీతి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికే నిందితులపై చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో పాదయాత్ర పేరుతో రాజకీయలబ్ధి కోసం ప్రజల మధ్య గొడవలు సృష్టిస్తున్న రేవంత్‌రెడ్డి పేపర్ లీకేజీ నెపంతో ఓయూలోనూ అలజడి సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. నాడు తెలంగాణ రాష్ట్ర ప్రకటన జాప్యంతో 1,200 మంది ఆత్మబలిదానాలకు కారణమైన రేవంత్‌రెడ్డి.. ఉద్యమ సమయంలో టీడీపీ నేత చంద్రబాబుకు తొత్తుగా వ్యవహరించి ఇప్పుడు ఓయూకు వచ్చే నైతిక హక్కులేదన్నారు.

ఓటు వేయండి.. నోటు కూడా ఇవ్వండి

టీఆర్‌నగర్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



జగిత్యాలరూరల్: 'వచ్చే ఎన్నికల్లో నాకు ఓటు వేయండి. దాంతో పాటు నోటు కూడా ఇవ్వండి'అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఓటర్లకు విన్నవించారు. జగిత్యాల జిల్లా టీఆర్‌నగర్ గ్రామంలో బుధవారం ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తాను జగిత్యాల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తానని చెప్పారు. అయితే ఎన్నికల వ్యయం భరించే స్థితిలో తాను లేనని, ఓటర్లు తనకు ఓటు వేయడంతోపాటు రూ.100 నోటు కూడా తనకు ఇవ్వాలని జీవన్‌రెడ్డి విన్నవించారు. ఇందుకోసం ఓటర్లు ఒకరోజు వ్యయం తగ్గించుకోవాలని కోరారు. తనవద్ద డబ్బులేకున్నా.. ఓటర్ల అండదండలున్నాయని వివరించారు. వారి దీవెనలతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నిరుద్యోగ నిరసన దీక్షకు రండి

రేవంత్‌కు ఓయూ విద్యార్థి సంఘాల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల ముందు ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన మహా దీక్షకు రావాలని విద్యార్థి సంఘాల నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం గాంధీభవన్‌లో రేవంత్‌ను కలిసిన ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు దీక్షలో పాల్గొనాలని కోరారు. దీక్షకు హాజరవుతానని రేవంత్ ఓయూ విద్యార్థి నేతలకు హామీ ఇచ్చారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును బర్తరఫ్ చేయాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



నాగర్‌కర్నూల్ రూరల్: ఇటీవల గ్రూప్–1 పేపర్ లీకేజీలో అసలు దోషి టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, బోర్డు సభ్యులేనని వెంటనే వారిని పదవి నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్‌లోని బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...పేపర్ లీకేజ్ చేసి 30లక్షల తెలంగాణ నిరుద్యోగ బిడ్డల ఆశలపై నీళ్లు చల్లారని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ దగ్గర ఉండాల్సిన పెన్‌డ్రైవ్, కంప్యూటర్లు, పాస్‌వర్డ్, హ్యాకింగ్ అయిందని చెప్పడం కేసును తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. పేపర్ లీకేజీ విషయంలో పాలకులు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. చైర్మన్, బోర్డు సభ్యులను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అక్షరంముక్క రాని ప్రవీణ్, దామెర్ల రమేశ్, మద్ది వెంకటేశ్ లాంటి అభ్యర్థులకు 100కు పైగా మార్కులు వచ్చాయని, అనంతరం వారి ఓఎంఆర్ షీట్ డబుల్ బబ్లింగ్ చేసినట్లు చూపించి వారిని అనర్హులుగా ప్రకటించారని, ఇది ఒక కట్టుకథగా తాము భావిస్తున్నామని ప్రవీణ్ పేర్కొన్నారు.

పంట నష్టం జిల్లాలకు నేడు సీఎం కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని రామపురానికి వెళతారు. అక్కడ పంట నష్టం వివరాలు పరిశీలించి, రైతులతో సమావేశమవుతారు.

- రామపురం నుంచి మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రెడ్డికుంట తండా చేరుకుని అక్కడ పరిస్థితిని పరిశీలిస్తారు. రైతులకు భరోసా కల్పిస్తారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు ఇస్తారు.
- రెడ్డికుంట నుంచి వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం అడవి రంగాపురానికి, అక్కడి నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపురం వెళ్లి పంటల నష్టం వివరాలు తెలుసుకుంటారు. రైతులతో మాట్లాడతారు. ఈ పర్యటనలో మంత్రులు, శాసనసభ్యులు, అధికారులు పాల్గొంటారు.

ఇడ్లీ.. దోశ.. రీసైక్లింగ్!

రేషన్ బియ్యం తినేందుకు లబ్ధిదారుల అయిష్టత

ఇడ్లీ, దోశల కోసం ఐదారు కిలోలు ఉంచుకుని మిగతావి డీలర్లకే అప్పగింత



బియ్యం సరిగా ఉడకట్లేదు..

ఈ చిత్రంలో ముద్దగా మారిన అన్నాన్ని చూపిస్తున్న మహిళ పేరు సమ్మెట లక్ష్మి. ఆమెది అదిలాబాద్ జిల్లా తాంసి గ్రామం. గత నెలలో రేషన్ షాపు ద్వారా తీసుకున్న దొడ్డు బియ్యం సరిగ్గా ఉడకట్లేదని ఆమె తెలిపింది. ఇలాంటి అన్నాన్ని ఎలా తినాలి? అని ప్రశ్నిస్తోంది.

- పురుగుపట్టడం, అన్నం ముద్ద అవుతుండటమే కారణం
- కిలోకు రూ.8 చొప్పున విక్రయం.. చిరు వ్యాపారులదీ ఇదే దందా
- రూ.12 లెక్కన సేకరించి రూ.16కు మిల్లర్లకు చేరవేస్తున్న ముఠాలు
- రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద సర్కారుకు అంటగడుతున్న మిల్లర్లు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉచిత బియ్యం పంపిణీ లక్ష్యం నెరవేరడం లేదు. చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న 'ఉచిత బియ్యం'తినేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపించక పోవడమే ఇందుకు కారణం. తమకు ప్రతినెలా కోటా కింద వస్తున్న బియ్యంలో ఐదారు కిలోలు ఇంట్లో ఇడ్లీ, దోశల పిండి కోసం ఉపయోగిస్తూ మిగతావి రేషన్ డీలర్లకో, చిరువ్యాపారులకో లబ్ధిదారులు అమ్మేస్తున్నారు. డీలర్లు, వ్యాపారులు తాము కొంత లాభం చూసుకుని సేకరించిన బియ్యాన్ని మిల్లర్లకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు వాటిని రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద తిరిగి ప్రభుత్వానికే అంటగడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. కిలో బియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.32.94 ఖర్చు చేస్తోంటే, లబ్ధిదారులు ఆ బియ్యాన్ని అత్యంత చౌకగా రూ.8కి విక్రయిస్తుండటం విస్మయం కలిగిస్తుండగా.. రేషన్ బియ్యం నాసిరకంగా ఉంటూ వండితే అన్నం ముద్దగా మారుతుండటమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది

రైస్ బదులు క్యాష్

ప్రస్తుతం రేషన్ షాపుల్లో ఉచిత బియ్యానికి నగదు (డ్రా అండ్ క్యాష్) తంతు యథేచ్ఛగా సాగుతోంది. ఈ–పాస్ (బయోమెట్రిక్) ద్వారా కోటా బియ్యం పొందేందుకు లబ్ధిదారుల బయోమెట్రిక్/ఐరిస్ తప్పనిసరి కావడంతో ఈ–పాస్ ద్వారా ఆమోదం లభించగానే లబ్ధిదారుల అంగీకారంతో కొందరు డీలర్లు బియ్యం బదులు నగదు ముట్టజెబుతున్నారు. కరోనా కన్నా ముందు ఈ తరహా దందా 10 శాతం వరకు ఉండగా ఇప్పుడది 40 శాతానికి పైగా చేరినట్లు తెలుస్తోంది. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో రేషన్ షాపుల సమీపంలో చిరు వ్యాపారులు నిరీక్షిస్తూ లబ్ధిదారులు కోటా బియ్యం తెచ్చుకోగానే వారి నుంచి చౌకగా కొనేస్తున్నారు. కొన్నిచోట్ల చిరు వ్యాపారులు ఇళ్ల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు.

కార్డు రద్దు కాకుండా ఉండేందుకే..

వాస్తవానికి పీడీఎస్ బియ్యం అవసరం లేకున్నా చాలామంది లబ్ధిదారులు కేవలం రేషన్‌కార్డు రద్దు కాకుండా ఉండేందుకే నెలసరి కోటా ను డ్రా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే.. ఈ–పాస్ ద్వారా వరుసగా 3 నెలలు సరుకులు డ్రా చేయకుంటే కార్డు రద్దవుతోంది. రేషన్‌కా ర్డు బహుళ ప్రయోజనకారి కావడంతో ప్రజలు దానిని వదులుకునేందుకు ఇష్టపడటం లేదు.

అన్నం ముద్దగా అవుతోందని..

ఖమ్మంకు చెందిన ఆటోడ్రైవర్ వెంకటస్వామి కుటుంబానికి ఆహార భద్రత (రేషన్) కార్డు ఉంది. అతనితో పాటు భార్య, నలుగురు పిల్లలు కార్డులో సభ్యులుగా ఉన్నారు. కుటుంబంలోని ఆరుగురు సభ్యులకు ప్రస్తుతం ఐదు కిలోల చొప్పున 30 కిలోల బియ్యం అందుతున్నాయి. అయితే అవి వండితే అన్నం ముద్దగా అవుతోందని దోశలు, ఇడ్లీల కోసం ఓ ఐదు కిలోల బియ్యం ఉంచుకుని మిగతావి కిలోకు రూ.8 చొప్పున డీలర్‌కే ఇచ్చేస్తున్నారు.



డబ్బులిస్తే బాగుంటుంది..

ఉచిత బియ్యం తినేందుకు పనికిరాకుండా ఉన్నాయి. నాసిరకం బియ్యం ఇచ్చే బదులు సరిపడా డబ్బులిస్తే బాగుంటుంది. మంచి బియ్యం కొనుక్కొని తింటాం.



కావేరి, హస్తినాపురం, రంగారెడ్డి జిల్లా

ఇడ్లీలు, దోశలకే వాడతాం

రేషన్ బియ్యాన్ని ఇడ్లీలు, దోశలు, పిండి వంటలకే వాడతాం. మిగిలిన బియ్యం నిల్వ ఉంచితే పురుగులు పడతాయి. అందువల్లే ఇంటి వద్దకు వచ్చే చిరు వ్యాపారులకు అమ్మేస్తున్నాం.



శైలజ, మిర్యాలగూడ

రేషన్ బియ్యం తినలేక..

పీడీఎస్ బియ్యం చాలావరకు ముక్కిపోయి, పురుగులు పట్టి ఉంటుండడం, వండితే అన్నం ముద్దగా కావడం, ఒకవేళ తింటే జీర్ణం కాకపోవడం వంటి కారణాలతోనే లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని తినేందుకు ఇష్టపడటం లేదని తెలుస్తోంది. కొందరు కేవలం ఇడ్లీలు, దోశలు, పిండివంటలకు మాత్రం కొంత బియ్యాన్ని వినియోగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు పశువులకు కుడితి కింద ఉపయోగిస్తున్నారు. మిగతా బియ్యాన్ని అయినకాడికి అమ్మేసుకుంటున్నారు. ఇలా లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరిస్తున్న డీలర్లు, చిరు వ్యాపారులు వాటిని బియ్యం ముఠాలకు లేదా మిల్లరకు చేరవేస్తున్నారు. లబ్ధిదారుల వద్ద కిలో రూ.8 చొప్పున కొంటున్నవారు.. ముఠాలకు రూ.10–రూ.12 చొప్పున విక్రయిస్తున్నారు. ఆయా ముఠాలు పెద్దమొత్తంలో బియ్యం సేకరించాక వాటిని వాహనాల్లో రైస్‌మిల్లులకు తరలించి కిలోకు రూ.14–16 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటుండగా మిల్లర్లు వాటిని కస్టమ్ మిల్లింగ్ పేరుతో తిరిగి సర్కారుకే అంటగడుతున్నారు. తద్వారా మిల్లర్లు కిలోకు రూ.10 నుంచి రూ.12 వరకు దండుకుంటున్నట్టు తెలుస్తోంది.

ఆర్థిక భారం నెలకు రూ.506 కోట్లు

రాష్ట్రంలో ఉచిత బియ్యం పంపిణీ వల్ల ప్రస్తుతం ప్రతినెలా ప్రభుత్వంపై రూ.506.05 కోట్లపైనే ఆర్థికభారం పడుతోంది. ప్రభుత్వం పీడీఎస్ కింద కిలో బియ్యం పంపిణీకి రూ.32.94 ఖర్చుచేస్తోంది. వాస్తవంగా కిలో బియ్యానికి రూ.31 చొప్పున ధర వర్తింపజేస్తున్నప్పటికీ రవాణా, నిర్వహణ కలిపి కిలోపై అదనంగా రూ.1.94 ఖర్చవుతోంది.

రేషన్ కార్డులు, ఫిబ్రవరి కోటా బియ్యం గణాంకాలు ఇలా..

కార్డు రకం	సంఖ్య	కుటుంబసభ్యులు	కోటా కేటాయింపు	మొత్తం కిలోలు
ఆహార భద్రత కార్డులు	84,41,207	2,67,76,277	యూనిట్‌కు 5 కిలోలు	13,38,81,385
అంత్యోదయ అన్న యోజన	5,62,705	15,13,300	కార్డుకు 35 కిలోలు	1,96,94,675
అన్నపూర్ణ కార్డులు	5,491	5,722	కార్డుకు 10 కిలోలు	54,910

ఆ ముగ్గురినీ ప్రాసిక్యూట్ చేయాలి

కేటీఆర్, జనార్దన్‌రెడ్డి, అనితా రామచంద్రన్‌లను విచారించాలి

- పేపర్ లీకేజీలో పెద్దల పాత్ర
- కోట్లాది రూపాయలకు ఉద్యోగ పరీక్షల పేపర్లు అమ్ముకున్నారు
- గవర్నర్‌కు రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ బృందం ఫిర్యాదు
- న్యాయనిపుణుల అభిప్రాయం తీసుకుంటానని గవర్నర్ చెప్పారు: టీపీసీసీ చీఫ్ రేవంత్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వెనుక పెద్దల పాత్ర ఉందని, కోట్లాది రూపాయలకు ఉద్యోగ నియామకాల పేపర్లను అమ్ముకున్నారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసులో టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు, ఇతర వ్యక్తులనే కాకుండా రాష్ట్ర మంత్రి కేటీఆర్, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దనరెడ్డి, కార్యదర్శి అనితా రామచంద్రన్‌లను కూడా ప్రాసిక్యూట్ చేసే విధంగా విచక్షణాధికారాలు ఉపయోగించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఆయన కోరారు. ఈ మేరకు బుధవారం ఉదయం రాజ్‌భవన్‌లో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 17మందితో కూడిన కాంగ్రెస్ బృందం గవర్నర్ తమిళిసైని కలిసి ఫిర్యాదుతో కూడిన వినతిపత్రం అందజేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నేతలతో 40 నిమిషాల చర్చ

కాంగ్రెస్ నేతల వాదనలను విన్న గవర్నర్ తమిళిసై ఈ విషయమై దాదాపు 40 నిమిషాల పాటు వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన అంశాలన్నింటినీ గమనిస్తున్నానని, ఈ విషయాన్ని తాను రాజ్యాంగ పరమైన కోణంలోనే చూడాల్సి ఉంటుందని చెప్పినట్టు సమాచారం. తాను రాజ్యాంగానికి లోబడి పనిచేయాల్సి ఉంటుందని, ఈ మేరకు అవసరమైన సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించానని, న్యాయనిపుణుల అభిప్రాయం తీసుకుంటున్నానని కాంగ్రెస్ నేతలతో గవర్నర్ వ్యాఖ్యానించినట్టు తెలిసింది. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై మనస్తాపంతో సిరిసిల్లకు చెందిన నిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కూడా గవర్నర్, కాంగ్రెస్ బృందం మధ్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ సిరిసిల్లలో నిరుద్యోగి ఆత్మహత్య ఘటన దురదృష్టకరమని వ్యాఖ్యానించినట్టు సమాచారం. గవర్నర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మధుయాష్కీగౌడ్, సంపత్‌కుమార్, షబ్బీర్‌అలీ, అంజన్‌కుమార్‌యాదవ్, మల్లురవి, మహేశ్‌కుమార్‌గౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, రాములు నాయక్, గడ్డం ప్రసాద్‌కుమార్, రాములు నాయక్, రోహిణ్‌రెడ్డి, వల్లె నారాయణరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లున్నారు.



గవర్నర్ తమిళిసైని కలిసిన కాంగ్రెస్ నేతలు

కేటీఆర్‌దే బాధ్యత: రేవంత్

గవర్నర్‌ను కలిసిన అనంతరం రాజ్‌భవన్ ఎదుట రేవంత్ మీడియాతో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీని పూర్తిగా రద్దు చేసి ఈ కేసును విచారించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తోన్న శాఖకు చెందిన ఉద్యోగులే పేపర్‌లీకేజీలో కీలకంగా ఉన్నారని, ఈ నేపథ్యంలో ఘటనకు కేటీఆరే బాధ్యత వహించాలన్నారు. ఆర్టికల్ 317 ప్రకారం రాష్ట్ర గవర్నర్ కుండే విచక్షణాధికారం ప్రకారం వ్యవహరించి ప్రస్తుత టీఎస్‌పీఎస్సీ బోర్డు సభ్యులందరినీ సస్పెండ్ చేయాలని కోరామని చెప్పారు.

ఇక అన్నీ సీబీటీ పరీక్షలే!

▶ మొదటి పేజీ తరువాయి

రూపొందించడం, ఆ తర్వాత వాటిని అత్యంత గోప్యంగా ముద్రించడం, వాటిని పరీక్షా కేంద్రాలకు తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రశ్నపత్రాలను కంటికి రెప్పలా కాపాడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఓఎంఆర్ పరీక్షల విధానాన్ని క్రమంగా వదిలించుకోవాలని టీఎస్‌పీఎస్సీ భావిస్తోంది. డిపార్ట్‌మెంటల్ పరీక్షలతో సహా అన్ని రకాల నియామక పరీక్షలను కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంలోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ దిశగా చర్యలు మొదలు పెట్టింది.

సాధ్యాసాధ్యాల పరిశీలన

సీబీటీ పరీక్షల నిర్వహణలో మరో కీలక అంశం మౌలిక వసతులు. సీబీటీ పరీక్షలను నిర్వహించాలంటే తగినన్ని కంప్యూటర్లతో ల్యాబ్‌లు అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం అయాన్ డిజిటల్ లాంటి సంస్థలతో పలు సంస్థలు అవగాహన కుదుర్చుకుని సీబీటీ పరీక్షలను నిర్వహిస్తున్నాయి. అయితే భారీ సంఖ్యలో అభ్యర్థులున్నప్పుడు సీబీటీ పరీక్షలు నిర్వహించడం సాధ్యమేనా? అనే కోణంలో కమిషన్ పరిశీలన చేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్, పీజీ నీట్ తదితర పరీక్షలన్నీ సీబీటీ పద్ధతిలోనే జరుగుతున్నాయి. ఈ పరీక్షలకు సగటున లక్ష నుంచి రెండు లక్షల వరకు అభ్యర్థులుంటున్నారు. అందువల్ల వీటిని ఒకేరోజు కాకుండా విడతల వారీగా నిర్వహిస్తుండడంతో రాష్ట్రంలో అందుబాటులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌లు ఆ మేరకు సర్దుబాటు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించే పరీక్షలను కూడా పూర్తిగా సీబీటీ పద్ధతిలో నిర్వహిస్తే అవసరమైన వ్యవస్థపై అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారు. అభ్యర్థుల సంఖ్య లక్షల్లో ఉంటే ఏయే వ్యవస్థలను వినియోగించుకోవాలి? పరీక్షలను ఒకేరోజు కాకుండా విడతల వారీగా నిర్వహిస్తే ఏం చేయాలి? మౌలిక వసతుల కల్పన ఎలా? తదితర అంశాలపై దృష్టి సారించారు. ప్రత్యేక ప్రణాళికను రూపొందించిన తర్వాత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు సమాచారం.

లీకేజీకి చెక్..!

సీబీటీ విధానంలో కఠినం, మధ్యస్థం, సులభతరం అనే మూడు కేటగిరీల్లో ప్రశ్న బ్యాంకులను తయారు చేసి సర్వర్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎంతోముందుగా ప్రశ్నపత్రం ఖరారు చేయడం ఉండదు. పరీక్ష సమయంలో నిర్దేశించిన నిష్పత్తుల్లో అప్పటికప్పుడు ప్రశ్నలు అభ్యర్థులకు కంప్యూటర్‌లో ప్రత్యక్షమవుతాయి. అభ్యర్థులకు ప్రత్యేకంగా ప్రశ్నపత్రం ఏదీ ఇవ్వరు. కంప్యూటర్ స్క్రీన్‌లో ప్రత్యక్షమైన ప్రశ్నలకు మాత్రమే జవాబులు రాయాల్సి ఉంటుంది. ఈ విధానంతో లీకేజీకి దాదాపు చెక్ పడుతుందని భావిస్తున్నారు. అయితే సర్వర్ సిస్టంను హ్యాక్ చేయ డం లాంటి ఇబ్బందులు ఉంటాయి. వీటిని ఎదుర్కొనేందుకు ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని అంటున్నారు.

గుడ్ మార్నింగ్..

ఇదొక్క అందమైన మార్నింగ్!

ఈ శుభోదయపు పలకరింపుతోనే సరిగ్గా పదిహేనేళ్ల క్రితం.. రంగుల హరివిల్లులా.. 'సాక్షి' దిన పత్రిక ఆవిర్భవించింది. 'సత్యమేవ జయతే..' అంటూ నిఖార్సైన జర్నలిజానికి శంఖం పూరించింది. నాటి నుంచీ అంచెలంచెలుగా ఎదుగుతూ విలువలకు కట్టుబడిన పాత్రికేయ ధర్మాన్ని నిబద్ధతతో కొనసాగిస్తూ వస్తోంది. ఈ మహాయజ్ఞం ఇప్పుడు పదహారవ యేటలోకి ప్రవేశిస్తున్న సందర్భంలో 'సాక్షి' తన పాఠకులకు చిన్న క్విజ్ పెట్టి, కానుకలను ఇవ్వదలచింది. వివరాల కోసం ఇప్పుడే sakshi.com ఓపెన్ చేయండి, జవాబు చెప్పండి.. బహుమతి గెలుచుకోండి అన్న లింకును క్లిక్ చేయండి.

ఈరోజు ప్రశ్న: సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళి సండే కాలమ్ పేరు?

ఎ) ఘనతంత్రం బి) జనతంత్రం సి) పంచతంత్రం డి) ప్రజాతంత్రం

సిట్ విచారణకే మేము వ్యతిరేకం

- అయినా నాకు నోటీసులు అందలేదు
- అసలు ముందు కేటీఆర్‌కు నోటీసులివ్వాలి...
- మిలియన్ మార్చ్ తరహాలో త్వరలో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తాం: బండి సంజయ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న బండి సంజయ్

సాక్షి, హైదరాబాద్: సిట్ నోటీసులు తనకు జారీచేసిన విషయం తెలియదని, అవి ఇంకా అందలేదని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం ముగిశాక మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సంజయ్ సమాధానమిచ్చారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై చేసిన ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలంటూ సిట్ నోటీసులు ఇచ్చిందా అన్న ప్రశ్నకు ఆయన తీవ్రంగా స్పందించారు. అసలు సిట్ విచారణపైనే తమకు నమ్మకం లేదన్నారు. తాము సిట్ విచారణ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని పునరుద్ఘాటించారు. ఈ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. సిట్ విచారణ సీఎం కేసీఆర్ సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్ అనే పద్ధతుల్లోనే సాగుతుందని సంజయ్ వ్యాఖ్యానించారు. "అసలు నోటీసులు అనేవి ఇవ్వాల్సి వస్తే ముందుగా కేటీఆర్‌కు ఇవ్వాలి. ఆయనకు ఎందుకు ఇవ్వడం లేదు? విపక్షాలుగా తమకు ప్రజల నుంచే వచ్చే సమాచారాన్ని దృష్టిలో పెట్టుకుని మాట్లాడతాం. నోటీసుల పేరుతో బెదిరిస్తే భయపడే ప్రసక్తే లేదు'అని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీకి బాధ్యుడిగా పేర్కొంటూ మంత్రిగా కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని, నిరుద్యోగులకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు.

అడ్వొకేట్ జనరల్‌పై ఫిర్యాదు చేస్తాం

'ప్రభుత్వ పక్షాన పనిచేయాల్సిన అదనపు అడ్వొకేట్ జనరల్ ఒకాయన కవితను కాపాడేందుకు ఢిల్లీకి వెళ్లి ఈడీని ఎట్లా కలుస్తారు? ఆయన కేసీఆర్ కుటుంబం కోసం పనిచేస్తున్నారా? దీనిపై బార్ కౌన్సిల్‌లో ఫిర్యాదు వేస్తాం. న్యాయపరంగా పోరాడతాం'అని తెలిపారు. 'కేసీఆర్ బిడ్డ కవిత అన్ని ఫోన్లు వాడుతుందా? అవి ఫోన్లా? మెడల్సా? ఫోన్ల ధ్వంసంపై ఈడీయే సమాధానమివ్వాలి. ఈ అంశంతో తమకు ఎలాంటి సంబంధం లేదు' అని ఒక ప్రశ్నకు సంజయ్ బదులిచ్చారు.

కోర్టులను ఆశ్రయిస్తాం...

వివిధ యూట్యూబ్ చానళ్ల యజమానులు, స్వతంత్ర జర్నలిస్టులు తీన్మార్ మల్లన్న, తెలంగాణ విఠల్, సతీష్ కమాల్, సుదర్శన్ గౌడ్లను ఎందుకు అరెస్ట్ చేశారో చెప్పాలని సంజయ్ ప్రశ్నించారు. 'కేసీఆర్ పాలనలో నిర్బంధాలు, అరాచకాలు పెచ్చుమీరినయ్. మీడియా సంస్థలపైనా దాడులు చేసే ప్రమాదముంది ఈ అంశాన్ని ఇంతటితో వదలబోము.. కోర్టును ఆశ్రయిస్తాం... న్యాయపరంగా, చట్టపరంగా పోరాడతాం'అని తెలిపారు. 'తెలంగాణ ఉద్యమకారులారా.... పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో అందరినీ వేధిస్తున్నరు. మీరంతా బయటకు రండి.. బీజేపీ అండగా ఉంటుంది'అని పిలుపునిచ్చారు.

ఆ నివేదికలు ఏమయ్యాయి..?

నయీం డైరీ, మియాపూర్ భూములు, డ్రగ్స్, ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్య సహా పలు కేసులపై విచారణ చేపట్టాక సిట్ ఇచ్చిన నివేదికలు ఏమయ్యాయని బండి సంజయ్ ప్రశ్నించారు. త్వరలోనే నిరుద్యోగ యువత కోసం మిలియన్ మార్చ్ తరహాలో పెద్ద ఎత్తున నిరుద్యోగ మార్చ్ చేపట్టడతామని వెల్లడించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాల భర్తీ చేపడతామన్నారు.

మా నౌకరీలు మాగ్గావాలే

- ఈ నినాదంతో 25న ఇందిరాపార్కు వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహా ధర్నా
- టీఎస్‌పీఎస్సీ లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- బీజేపీ రాష్ట్ర నేతల సమావేశంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 25న 'మా నౌకరీలు మాగ్గావాలే'నినాదంతో బీజేపీ ఆధ్వర్యంలో 'నిరుద్యోగ మహా ధర్నా'నిర్వహించనున్నారు. ఇందిరా పార్కు వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరుద్యోగ యువతతో కలసి ఈ ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆధ్వర్యంలో నాయకులు సమావేశమయ్యారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీల కారణంగా ఇదివరకే రాసిన వివిధ పరీక్షలు రద్దయి దాదాపు 30 లక్షల మంది నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నందున, వారికి మద్దతుగా వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు రూపొందించాలని నిర్ణయించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా నిర్వహించిన సాగరహారం, మిలియన్ మార్చ్ వంటి అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. ఇందులో భాగంగా తొలుత 25న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని, పరీక్షల రద్దుతో నష్టపోయిన నిరుద్యోగులకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలని, ఖాళీ ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలనే డిమాండ్లతో ఈ ధర్నా నిర్వహించనున్నారు.

ప్రశ్నించే గొంతుకలకు అండగా..

రాష్ట్రంలో ప్రజా సమస్యలపై గళం విప్పుతూ.. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నిస్తున్న వివిధ సంస్థలు, జర్నలిస్టులకు అండగా నిలవాలని, వారి పక్షాన పోరాడాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. వివిధ సంస్థలు, స్వతంత్ర జర్నలిస్టులకు మద్దతుగా నిలిచేందుకు పార్టీనేతలు వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులతో బండి సంజయ్ ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎం.రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి, పార్టీ లీగల్ సెల్ నాయకులు ఆంటోనీరెడ్డి, పార్టీ కార్యదర్శి జయశ్రీ, అధికార ప్రతినిధి జె.సంగప్ప పాల్గొన్నారు.

గట్టిగా ఎదుర్కొందాం!

▶ మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నట్లు సమాచారం. కవిత కుటుంబసభ్యులతో కలిసి బుధవారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. తన నివాసంలో ఉగాది పూజలు నిర్వహించిన అనంతరం ప్రగతి భవన్‌కు చేరుకున్నారు. సుదీర్ఘంగా జరిగిన ఈ భేటీలో.. ఈడీ విచారణ తీరుతెన్నులు, వివిధ అంశాలతో పాటు ఫోన్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలు, కవిత ఇచ్చిన సమాధానాలు, తదితరాలపై చర్చించినట్లు తెలిసింది. ఈ కేసును గట్టిగా ఎదుర్కొందామని చెప్పిన కేసీఆర్.. భవిష్యత్తులో న్యాయపరంగా, రాజకీయ పరంగా అనుసరించాల్సిన వైఖరిపై పలు సూచనలు చేసినట్లు సమాచారం. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరిని ఎండగట్టే విధంగా మున్ముందు చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించి కూడా భేటీలో చర్చించారు.

ఈడీ దృష్టికి బీజేపీ ప్రకటనలు?

విచారణను ప్రభావితం చేసేలా బీజేపీ నేతలు చేస్తున్న ప్రకటనలు, ఇతర రాజకీయ విమర్శలను ఈడీ దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. బాధ్యతారహితంగా ప్రకటనలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని కోరేందుకు కవిత తరపు న్యాయవాదుల బృందం ఒక లేఖను సైతం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

రేపు సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ విచారణ

ఈడీ విచారణ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కవిత సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ ఈ నెల 24న విచారణకు రానుంది. సర్వోన్నత న్యాయస్థానం ఆరోజు ఏం చెబుతుందనే దాని ఆధారంగానే కవిత విచారణకు సంబంధించి ఈడీ తదుపరి చర్యలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా తమ వాదనలు పకడ్బందీగా వినిపించేందుకు న్యాయవాదుల బృందం ఇప్పటికే కసరత్తు చేస్తోందని కవిత సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. ఈ కేసును న్యాయపరంగా దీటుగా ఎదుర్కోవాలని భావిస్తున్న కవిత.. ఈడీ విచారణ సందర్భంగా ఎదురవుతున్న ప్రశ్నలు, చోటు చేసుకుంటున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు న్యాయ నిపుణుల బృందంతో చర్చిస్తున్నట్లు సమాచారం. న్యాయ నిపుణులు, న్యాయవాదులతో సంప్రదింపులు, సమన్వయం కోసమే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఢిల్లీలో మకాం వేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

రాజకీయంగా ఎదుర్కోవడంపై బీఆర్ఎస్ దృష్టి

ఈడీ నిష్పాక్షిక విచారణ జరపడం లేదంటూ ఆరోపిస్తున్న బీఆర్ఎస్.. కవిత ఎపిసోడ్‌ను రాజకీయంగానూ ఎదుర్కోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే పలువురు రాష్ట్ర మంత్రులు, అన్ని స్థాయిల నేతలు..కవితకు సంఘీభావం తెలుపుతూ ప్రకటనలు చేస్తున్నారు. విచారణకు హాజరయ్యేందుకు కవిత ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారీ నేతలు కూడా వెళుతూ మద్దతుగా నిలుస్తున్నారు. కవితను ఈడీ విచారించడంపై అధికార బీఆర్ఎస్, విపక్ష పార్టీల మధ్య విమర్శలు, ఆరోపణల యుద్ధం కొనసాగుతోన్న సంగతి తెలిసిందే.

క్లుప్తంగా...

ట్విట్టర్ వేదికగా కేటీఆర్, బండి విమర్శల పంచాంగం

సాక్షి, హైదరాబాద్: బద్ధ విరోధులుగా మారిన భారత్ రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల ముఖ్య నేతలు ఏ చిన్న అవకాశం లభించినా ఒకరిపై మరొకరు విమర్శలు, ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. తెలుగు కొత్త సంవత్సరమైన 'శోభకృత్'నామ సంవత్సర వేళ కూడా.. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి కేటీఆర్ బీజేపీని విమర్శిస్తూ.. పంచాంగకర్తలు వివరించే ఆదాయ, వ్యయ, రాజపూజ్యం, అవమానాలను తనదైన శైలిలో వివరించారు. ట్విట్టర్ వేదికగా కేటీఆర్ చేసిన ట్వీట్ ఇలా ఉంది..

ఆదాయం: అదానీకి!
వ్యయం: జనానికి, బ్యాంకులకు!
అవమానం: నెహ్రూకి!
రాజపూజ్యం: గుజరాతీ గుంపునకి!!
బస్, బ్రాజీమానం భజగోవిందం!
దేశీయ ఉగాది పంచాంగం సమాప్తం!
అంటూ పేర్కొన్నారు.

- **దీనికి కౌంటర్‌గా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సైతం ఓ ట్వీట్ చేశారు.**

తుస్.., పిట్టల దొర, తుపాకి చంద్రుల గడీల పంచాయతీ...లెక్క తేలుడే తరువాయి... పతనం ఇగ షురువాయే'అంటూ కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్‌గా ట్వీట్ చేశారు.

ఆదాయం: కల్వకుంట్ల కుటుంబానికి
వ్యయం: తెలంగాణ రాష్ట్రానికి
అవమానం: ఉద్యమ వీరులకు, అమరుల త్యాగాలకు
రాజపూజ్యం: ఉద్యమ ద్రోహులకు, దొంగలకు!! అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

అవమానిస్తున్నా సహిస్తున్నాం

భావ ప్రకటన స్వేచ్ఛ అంటే దూషించే హక్కు కాదు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఓ ట్వీట్ విషయంలో మంత్రి కేటీఆర్ కన్నడ నటుడు చేతన్ అరెస్టు విషయాన్ని ప్రస్తావిస్తూ 'బీజేపీ పాలిత రాష్ట్రం కర్ణాటకలో "ప్రమాదకర"ట్వీట్‌కు 14 రోజుల జైలు శిక్ష. తెలంగాణలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను నేరుగా, భయంకరంగా అవమానిస్తున్నా సహిస్తున్నాం. ఇక్కడ కూడా అలానే చేస్తే ఎలా ఉంటుంది ప్రజలారా? భావ ప్రకటన స్వేచ్ఛ హక్కు అంటే దూషించే హక్కు కాదు'అంటూ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఢిల్లీ బడ్జెట్ విషయంలో కపిల్ సిబల్ చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ 'కోఆపరేటివ్ ఫెడరలిజం, టీమ్ ఇండియా'అనే మరో రెండు జుమ్లాలను కూడా మనం గుర్తు చేసుకోవాలి. రాష్ట్రాల్లో నేరుగా ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేనప్పుడు ప్రభుత్వాలను కూల్చివేయడం, పార్టీలను చీల్చడం వంటివి చేస్తారు..వాహ్..'అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

ఉగాది శుభాకాంక్షలు ..

'కాలం పరుగులో మరో మైలురాయి ఈ కొత్త ఏడాది. గతించిన కాలాన్ని మరిచిపోయి కొత్త ఏడాదికి ఘన స్వాగతం పలుకుతూ.. ఈ ఏడాది పొడవునా విజయం, అదృష్టం మీ వెంటే ఉండాలని ఆకాంక్షిస్తూ ఉగాది శుభాకాంక్షలు'అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

జల సంరక్షణ పాటించాలి: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అందరూ నీటి సంరక్షణ, నీటి వనరుల నిర్వహణ పద్ధతులను అవలంభించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన ట్విట్టర్ ద్వారా ఈ మేరకు సందేశం ఇచ్చారు. సీఎం కేసీఆర్ ఆలోచనలతో ప్రారంభించిన కాళేశ్వరం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు రాష్ట్ర జీవన గమనాన్ని మార్చేశాయని పేర్కొన్నారు.

వన్ రేషన్-వన్ నేషన్ అమలు చేయాలి

జంతర్‌మంతర్‌లో ఆల్ ఇండియా రేషన్ డీలర్స్ ఫెడరేషన్ ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: వన్ రేషన్-వన్ నేషన్ విధానాన్ని అమలు చేయాలని ఆల్ ఇండియా రేషన్ డీలర్స్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు కోరారు. రేషన్ డీలర్లకు అన్ని రాష్ట్రాల్లో ఒకే రకమైన కమీషన్ లేదా గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా నాయకోటి రాజు మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు చాలీచాలని కమీషన్లతో చాలా ఇబ్బందులు పడుతున్నారని.. బియ్యం దిగుమతి హమాలీ ఖర్చులను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు.

24 నుంచి రంజాన్ మాసం షురూ

రుహియతే హిలాల్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖుబ్బుల్‌పాషా ఖుత్తారీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంతో పాటు దేశ వ్యాప్తంగా నెలవంక కనబడలేదని, దీంతో ఈ నెల 24 నుంచి రంజాన్ నెల ప్రారంభమవుతుందని రుహియతే హిలాల్ కమిటీ (నెలవంక నిర్ధారణ కమిటీ) అధ్యక్షుడు మౌలానా ఖుబ్బుల్‌పాషా ఖుత్తారీ తెలిపారు. మోజంజాహీ మార్కెట్‌లోని కమిటీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ...నెలవంక బుధవారం కనిపించకపోవడంతో గురువారం హిజ్రి నెల షాబాన్ 30వ తేదీగా పరిగణించాలని పేర్కొన్నారు. శుక్రవారం రంజాన్ 2వ తేదీగా భావించి రంజాన్ ఉపవాసదీక్ష ప్రారంభించాలని సూచించారు. కమిటీ నిర్ణయం ప్రకారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు అంతా ఈ నెల 24 నుంచి రంజాన్ మాసం ప్రారంభించాలని కోరారు.



అంతరిక్షంలో పర్యటించాలనుకునే భారతీయుల కల నెరవేరనుంది. ఈ కల సాకారానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయత్నాలు ప్రారంభించింది. 2030 నాటికి స్పేస్ టూరిజం ప్రాజెక్టును పట్టాలెక్కిస్తామని.. దీనికి సంబంధించిన పని జరుగుతోందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఇటీవల ప్రకటించారు. ఇందుకోసం సొంతంగా ఒక మాడ్యూల్ తయారు చేస్తున్నట్టు తెలిపారు. టికెట్ ధర రూ.6 కోట్లు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

- స్పేస్ టూరిజానికి ఇస్రో రూపకల్పన
- 2030 నాటికి ఈ ప్రాజెక్టు పట్టాలెక్కుతుందంటున్న ఇస్రో చైర్మన్
- టికెట్ ధర రూ.6 కోట్లు ఉండే అవకాశం

రూ 6 కోట్లు ఉంటే అంతరిక్షంలోకి!

అంతరిక్ష పర్యటన ఆర్బిటల్‌గా ఉంటుందా లేక సబ్ ఆర్బిటల్‌గా ఉంటుందా అనే దానిపై స్పష్టత లేదు. టికెట్ ధర రూ.6 కోట్లు అంటున్నారు కాబట్టి.. ఇది సబ్ ఆర్బిటల్ పర్యటనే అయి ఉండవచ్చని భావిస్తున్నారు. స్పేస్ క్రాఫ్ట్ ప్రయాణించే వేగాన్ని బట్టి ఆర్బిటల్ పర్యటనా.. సబ్ ఆర్బిటల్ పర్యటనా అనేది ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. ఆర్బిటల్ స్పేస్ క్రాఫ్ట్.. ఆర్బిటల్ వెలాసిటీ (కక్ష్య వేగం)తో ప్రయాణిస్తుంది. సబ్ ఆర్బిటల్ రాకెట్ దాని కంటే తక్కువ వేగంతో

సబ్ ఆర్బిటలా.. ఆర్బిటలా...




ప్రయాణిస్తుంది. సబ్ ఆర్బిటల్ ట్రిప్ అయితే స్పేస్ క్రాఫ్ట్‌లో తిరిగి భూమ్మీదకు వచ్చేప్పుడు అంతరిక్షం అంచుల్లో కొద్ది నిమిషాలు తక్కువ గ్రావిటీ వాతావరణంలో (గాల్లో తేలియాడేలా) ఉన్న అనుభవాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే బ్లూ ఆరిజిన్ కంపెనీ సబ్ ఆర్బిటల్ రాకెట్ టూర్‌ను విజయవంతంగా నిర్వహించింది. 2021లో బ్లూ ఆరిజిన్ అధినేత (అమెజాన్ వ్యవస్థాపకుడు) జెఫ్ బెజోస్ మరో ముగ్గురితో కలిసి అంతరిక్షంలో పర్యటించి వచ్చారు. సబ్ ఆర్బిటల్ రాకెట్లు ఆర్థికంగా అందుబాటులో ఉండటంతోపాటు వాటిని రెండోసారి కూడా వినియోగించే అవకాశం ఉంటుంది.

పర్యాటక మాడ్యూల్ కోసం ప్రయత్నాలు

సబ్ ఆర్బిటల్ స్పేస్ టూరిజం మిషన్ సాధ్యాసాధ్యాలపై ఇస్రో అధ్యయనం చేస్తోందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆటామిక్ ఎనర్జీ అండ్ స్పేస్ మంత్రి జితేంద్రప్రసాద్ రాజ్యసభలో ఇటీవల వెల్లడించారు. అంతరిక్ష పర్యాటక మాడ్యూల్‌ను తయారు చేసేందుకు నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఐఎన్-స్పేస్) ద్వారా ఇస్రో ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఆ ఘనత టిటోదే



అంతరిక్ష పర్యాటకం చాలాకాలం క్రితమే మొదలైంది. ఆర్బిటల్ స్పేస్ టూరిజాన్ని రష్యన్ స్పేస్ ఏజెన్సీ గతంలోనే ప్రారంభించింది. 2001లో అమెరికన్ మిలియనీర్ డెన్నిస్ టిటో రష్యన్ స్పేస్ ఏజెన్సీకి రూ.165 కోట్లు చెల్లించి స్పేస్ టూరిస్ట్‌గా అంతరిక్షంలో 8 రోజులు గడిపి తిరిగి వచ్చారు. ప్రపంచంలో మొట్టమొదటి స్పేస్ టూరిస్ట్ ఆయనే. కానీ.. 2010లో రష్యన్ స్పేస్ ఏజెన్సీ స్పేస్ టూరిజం కార్యకలాపాలను నిలిపివేయడంతో అంతరిక్ష పర్యాటకం అక్కడితోనే ఆగిపోయింది.

అంతరిక్ష పర్యాటకానికి ఎంతో క్రేజ్

అంతరిక్ష పర్యాటకానికి ఎంతో క్రేజ్ ఉంది. అందుకే అంతర్జాతీయంగా వర్జిన్ గెలాక్టిక్, స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజిన్, ఆరిజిన్ స్పాన్, బోయింగ్, స్పేస్ అడ్వెంచర్స్, జీరో టు ఇన్ఫినిటీ వంటి ప్రైవేట్ స్పేస్ టూరిజం కంపెనీలు వాణిజ్యపరంగా స్పేస్ ఫ్లైట్స్‌ను నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నాయి. రష్యన్ స్పేస్ ఏజెన్సీ నిలిపివేసిన స్పేస్ టూ రిజం కాన్సెప్ట్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్ని స్తున్నాయి. ఆ ప్రయత్నంలో జెఫ్ బెజోస్ విజయం సాధించారు కూడా. వర్జిన్ గెలాక్టిక్ తన స్పేస్ ఫ్లైట్ వీఎస్ఎస్ యూనిటీని 2018లో పరీక్షించడం మొదలుపెట్టింది. ఇప్పటికే ఈ కంపెనీ స్పేస్ టూరిస్టులు వెయిటింగ్ లిస్ట్ చాలా ఉంది. వాళ్లంతా డిపాజిట్లు కట్టి పర్యటన కోసం ఎదురుచూస్తున్నారు. రాబోయే కాలంలో వాటి సరసన మన ఇస్రో స్పేస్ రాకెట్లు కూడా ఉండే అవకాశం ఉంది.

సాక్షి, అమరావతి

ఇంటి దొంగలు ఎందరు?

- ప్రశ్నపత్రాల లీక్‌పై సిట్ ముమ్మర దర్యాప్తు
- 42 మంది టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులకు నోటీసులు
- ఐదోరోజు 7 గంటలు సాగిన నిందితుల విచారణ
- నేటితో ముగియనున్న 9 మంది కస్టడీ

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజ్ స్కామ్‌ను దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇంటి దొంగల్ని కనిపెట్టడంపై దృష్టి పెట్టింది. ఇప్పటికే కమిషన్ కార్యదర్శి పీఏ ప్రవీణ్‌కుమార్ అరెస్టు కావడం, మాజీ ఉద్యోగి సురేష్ పేరు వెలుగులోకి రావడంతో లోతుగా ఆరా తీస్తోంది. కమిషన్‌కు చెందిన వివిధ స్థాయిల ఉద్యోగులు 42 మందికి నోటీసులు జారీ చేసి ప్రశ్నించడం ప్రారంభించింది. మరోపక్క తమ కస్టడీలో ఉన్న 9 మంది నిందితులను సిట్ అధికారులు బుధవారం ఏడు గంటల పాటు ప్రశ్నించారు. వీరి కస్టడీ గడువు గురువారంతో ముగియనుండటంతో విచారణ వేగవంతం చేశారు. బుధవారం కమిషన్ కార్యాలయానికి వెళ్లిన సైబర్ క్రైమ్ నిపుణుల బృందం కూడా నిందితులను ప్రశ్నించింది.

ఇక టెక్నికల్ టీమ్ వంతు..

టీఎస్‌పీఎస్సీలో పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు భద్రపరిచే కాన్ఫిడెన్షియల్ సెక్షన్ మొదలుపెట్టి అన్ని విభాగాల్లోనూ కలిపి దాదాపు 150 కంప్యూటర్లు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా టెక్నికల్ టీమ్ పని చేస్తుంటుంది. నెట్‌వర్క్ అడ్మిన్‌గా ఉండి, లీకేజ్ కేసులో అరెస్టు అయిన రాజశేఖర్ ఈ టీమ్‌లో కీలకంగా వ్యవహరించాడు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న సిట్ అధికారులు అంతర్గత లోపాలు గుర్తించడానికి టెక్నికల్ టీమ్‌ను ప్రశ్నించాలని నిర్ణయించారు. దీంతో పాటు వీరి బంధువులు, స్నేహితుల్లో ఎవరైనా టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షలు రాశారా? వారికి ఎన్ని మార్కులు వచ్చాయి? గతంలో వారి ప్రతిభ ఎలా ఉంది? తదితర అంశాలను దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్-1లో 10 మంది ఉద్యోగులు పాస్

గతేడాది అక్టోబర్‌లో జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసిన కమిషన్ ఉద్యోగుల్లో ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సహా పది మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో కొందరికి ఊహించని విధంగా మార్కులు వచ్చాయని సిట్ గుర్తించింది. ఇప్పటికే ఈ జాబితాను టీఎస్‌పీఎస్సీ నుంచి సేకరించిన అధికారులు వారికీ నోటీసులు జారీ చేసి విచారణకు సిద్ధమయ్యారు. కస్టోడియన్‌గా వ్యవహరిస్తున్న కమిషన్ ఉద్యోగిని శంకరలక్ష్మి కంప్యూటర్ నుంచే ప్రశ్నపత్రాలు బయటకు వచ్చాయని ఇప్పటికే నిర్ధారణైంది. వివిధ కోణాల్లో దర్యాప్తు చేసిన అధికారులు తనకు ఉన్న పరిజ్ఞానం వినియోగించిన రాజశేఖర్.. శంకరలక్ష్మి కంప్యూటర్‌లోకి అక్రమంగా చొరబడి ప్రశ్నపత్రాలు సంగ్రహించాడని తేల్చారు. ఈ విధంగా లీకేజ్ వ్యవహారంలో సైబర్ నేరమూ ఉండటంతో ఇన్ఫర్మేషన్ యాక్ట్‌ను జోడించాలని నిర్ణయించారు. నిందితులను గురువారం కోర్టులో హాజరుపరిచే సమయంలో దీనికి సంబంధించి మెమో దాఖలు చేయనున్నారు.

ముగ్గురి కోసం గాలింపు

గ్రూప్ -1 ప్రిలిమ్స్ పేపర్ లీక్‌లో పాత్ర ఉన్నట్టుగా గుర్తించిన ముగ్గురు అందుబాటులో లేకపోవడంతో, వారిని నిందితులుగా అనుమానిస్తూ సిట్ గాలింపు చేపట్టింది. వీళ్లు కమిషన్ ఉద్యోగులే అని తెలుస్తోంది. 100 కంటే ఎక్కువ మార్కులు సాధించిన పదిమందిలో ఈ ముగ్గురు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే నిందితులుగా ఉన్న 9 మందికి అదనంగా మరికొందరి పేర్లు జోడిస్తూ అధికారులు గురువారం కోర్టుకు సమాచారం ఇవ్వనున్నారు.

శంకరలక్ష్మిది నిర్లక్ష్యమే..?

లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తుకు సంబంధించిన పరీక్షల పేపర్లను భద్రపరచడంలో శంకరలక్ష్మి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సిట్ భావిస్తోంది. ఈమెకు నోటీసులు జారీ చేసి ఇప్పటికే రెండు సార్లు ప్రశ్నించిన నేపథ్యంలో తదుపరి చర్యలకు సంబంధించి కమిషన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది. గ్రూప్-1 ప్రిలిమ్స్ క్వశ్చన్ పేపర్ పరీక్షకు ముందే ప్రవీణ్, రాజశేఖర్, సురేష్‌లతో పాటు మరెవరికైనా చేరిందా అనే దానిపై లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఏఈ పరీక్ష పేపర్ క్రయ విక్రయాల్లో ప్రవీణ్, రేణుక, నీలేశ్, గోపాల్ మధ్య జరిగిన రూ.14 లక్షల లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు సైబర్ క్రైమ్ నిపుణుల బృందం కమిషన్ కార్యాలయంలో పని చేస్తున్న కీలక ఉద్యోగుల సెల్‌ఫోన్లు, వాట్సాప్ సంప్రదింపులను విశ్లేషించడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ కేసులో మరికొన్ని అరెస్టులు చోటు చేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

అక్షరాలా కష్టాలే..

▶ మొదటి పేజీ తరువాయి

దూరంగా ఉన్నాయి. 2,508 శివారు గ్రామాల్లో ఉన్నత పాఠశాల లేదు. రాష్ట్రవ్యాప్తంగా 30,395 మంది చిన్నారులు చదువు కోసం 3 నుంచి 5 కిలోమీటర్లు వెళ్సాల్సి వస్తోంది. నడుచుకుంటూనో, కిక్కిరిసిన ఆటోల్లోనో, సైకిళ్ల మీదో దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. కొద్దిపాటి వర్షం వచ్చినా బురదగా మారే రోడ్ల మీద అష్టకష్టాలు పడుతూ విద్యనభ్యసిస్తున్నారు. ఉచిత, నిర్బంధ విద్య కింద 10 నెలల రవాణా భత్యం ప్రభుత్వం ఇస్తుంది. కానీ పెరిగిన డీజిల్ చార్జీల కారణంగా చుక్కలనంటే ఆటో చార్జీలకు ఇవి ఏమాత్రం సరిపోవడం లేదని మారుమూల గ్రామాల పేద ప్రజలు అంటున్నారు. ఈ పరిస్థితులు విద్యపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. స్కూల్ దశలోనే చదువు మానేసేవారి (డ్రాపవుట్స్) సంఖ్య పెరుగుతోంది. విద్యకు దూరమవుతున్న వారిలో ఎక్కువ శాతం వెనుకబడిన ప్రాంతాల నిరుపేదలే ఉంటున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన 'యూ డైస్' (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) నివేదిక ఈ విషయాలన్నీ స్పష్టం చేస్తోంది.

మధ్యలోనే మానేస్తున్నారు

చదువుపై పెద్దగా అవగాహన లేని శివారు గ్రామస్తులు, ముఖ్యంగా పేద కుటుంబాల వారు పిల్లలను దూర ప్రాంతాలకు పంపేందుకు ఇష్టపడటం లేదు. దగ్గర్లో ఉన్న స్కూల్ విద్యకే పరిమితం చేస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో గత ఏడాది 13.7 శాతం మంది విద్యార్థులు టెన్త్ క్లాస్‌కు వచ్చేసరికే చదువు మానేశారు. ఇందులో 12.9 శాతం బాలికలే ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో చదివే విద్యార్థులకు జూనియర్ కాలేజీ అందుబాటులో లేదు. దీంతో తల్లిదండ్రులు బాలికలను టెన్త్‌తోనే ఆపేస్తున్నారు. గడచిన రెండేళ్లలో 18 మంది ఇలా విద్యకు దూరమయ్యారు. వీరిలో ఎక్కువ మందికి వివాహాలు కూడా జరిగాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో 8-10 తరగతుల బాలికలను పాఠశాలకు వెళ్లని కారణంగా పెళ్ళిళ్ళు చేసేస్తున్నట్టు గుర్తించారు. ఇలా గడచిన రెండేళ్ళలో 19 మందికి వివాహాలైనట్టు ప్రభుత్వ సర్వేల్లో తేలింది. స్కూళ్ళు, కాలేజీలు అందుబాటులో లేకపోవడం వల్లే చాలాచోట్ల ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. శివారు తండాల వరకూ ప్రభుత్వ స్కూళ్ళను తీసుకెళ్తే తప్ప ఈ పరిస్థితిలో మార్పు రాదని స్పష్టం చేస్తున్నారు.



నారాయణపేట జిల్లా షేర్నపల్లికి చెందిన ఈ విద్యార్థులు రోజూ జాజాపూర్‌లోని హైస్కూలుకు రానుపోనూ ఐదు కిలోమీటర్లు నడుస్తారు.. ఈ ఊరి నుంచి బస్సు సౌకర్యం లేదు

ఎంతెంత దూరం..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గుంపాడుకు సమీపంలోని గిరిజన గ్రామాల విద్యార్థులు కనీసం 4 కిలోమీటర్ల మేర ప్రయాణించి చదువుకోవాల్సి వస్తోంది. ఏడాదిలో 70 రోజులు బురదతో నరక యాతన పడుతున్నారు.
- ఆదిలాబాద్ జిల్లాలో 162 శివారు గ్రామాల్లో అక్షరం చెప్పే దిక్కే లేదు. మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నిర్మల్, పెద్దపల్లి.. ఇలా పలు జిల్లాల్లో..ఒక్కో జిల్లాలో 150కి పైగా శివారు గ్రామాల్లో స్కూళ్ళు లేవు.
- మెదక్ జిల్లా తూప్రాన్ సమీకృత వసతి గృహంలో ఉండే విద్యార్థులు 2.5 కిలో మీటర్ల దూరంలోని స్కూలుకు వెళ్తున్నారు.

సంవత్సరాంతంలో రాజకీయ ఒడిదుడుకులు

- రాష్ట్రంలో అధికార పక్షంలో వ్యతిరేక గళాలు
- ఈసారి మంచి వానలు, పంటలు
- శోభకృత్ నామ సంవత్సర పంచాంగ పఠనంలో సంతోష్‌కుమార్ శాస్త్రి
- రవీంద్రభారతిలో ఉగాది వేడుకలు



ఉగాది వేడుకలో పాల్గొన్న దేశపతి, ఆశారాజు,శ్రీనివాస్ గౌడ్ గోరటి వెంకన్న

సాక్షి, హైదరాబాద్: 'ఈ సంవత్సరం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఆశ్చర్యకర ఘటనలు చోటుచేసుకుంటాయి. ఈ పరిణామాలు విపరీతమైన రాజకీయ ఒడిదుడుకులకు కారణమవుతాయి. అక్టోబర్ 31కి రాహువు, కేతు గ్రహాలు మారుతున్నందున.. ఈ ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై ఉంటుంది'అని శృంగేరీ ఆస్థాన పండితుడు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పేర్కొన్నారు. అధికార పక్షంలోని కొందరినుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో అధికారంలోని పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని సూచించారు. ఈ ఏడాది బుధుడు రాజుగా ఉన్నందున.. ఈ పరిణామాలను ప్రభుత్వం నిలువరించగలదన్నారు. సప్తమాధిపతి అయిన గురువు అష్టమంలో మౌఢ్య స్థితిలో ఉన్నందున ప్రతిపక్షాలు తమ ఉనికి కోసం బాగా కష్టపడాల్సి వస్తుందని వెల్లడించారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ఉదయం రవీంద్రభారతిలో ఘనంగా జరిగాయి. దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పక్షాన ఈ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగాన్ని పఠించారు. కొన్నేళ్లుగా దేశంలో, రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నా..సామాజిక అశాంతి నెలకొంటుందని వెల్లడించారు. అశాంతి ఏర్పడ్డా, పోలీసు శాఖ సమర్థంగా ఎదుర్కొంటుందన్నారు.

మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..

'గురుడు జలాశయ కారకుడు అయినందున రాష్ట్రంలోని జలాశయాలన్నీ నిండుకుండలుగా మారతాయి. కేంద్ర, రాష్ట్రాలు విద్యారంగంలో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది. వర్సిటీల్లోనూ, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో కూడా అక్రమాలకు అవకాశం ఉంది. ఉన్నత న్యాయస్థానాలు కీలక తీర్పులు ఇవ్వబోతున్నాయి. వచ్చే మార్చిలో ప్రకృతి ఉపద్రవాలు, మత ఘర్షణలు, సామాజిక అశాంతికర పరిస్థితులు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది. బుధుడు భాగ్యమందు మంచి స్థితిలో ఉన్నందున రాష్ట్రంలో సుస్థిర పాలన కొనసాగుతుంది. ధన భాగ్యాధిపతి శుక్రుడు కావటంతో ఆర్థిక రంగం కొంత పురోగమిస్తుంది. కీలక పథకాలను కొనసాగించాలంటే అప్పులు చేయక తప్పని పరిస్థితి. మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తారు. విద్య, వైజ్ఞానిక రంగాల్లో పరిశోధనలు సాగుతాయి. ఏప్రిల్, మే నెలల్లో విపరీతమైన ఎండలు కాసే అవకాశం ఉంది. ఆగస్టు, సెప్టెంబర్‌లలో భారీ వర్షాలు కురుస్తాయి. మంచి పంటలు పండుతాయి. గురు, శుక్ర మౌఢ్యాలు 40 రోజులు మాత్రమే ఉన్నందున రాష్ట్రంలో శుభకార్యాలు విపరీతంగా జరుగుతాయి. పాల ఉత్పత్తి బాగా పెరగనున్నా.. పాలల్లో, ఆహారపదార్థాల్లో కల్తీ సమస్య కూడా పెరుగుతుంది. ఆగస్టు, సెప్టెంబర్‌లో తుపానులు ఏర్పడతాయి. ఏప్రిల్ 22 నుంచి మే 3 వరకు గంగా పుష్కరాలు ఉంటాయి' అని పేర్కొన్నారు.

సీఎం దైవ బలాన్ని సంపాదించుకోవాలి..

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సంబంధించిన కర్కాటక రాశికి ఈ సంవత్సరం మిశ్రమ ఫలితాలే ఉన్నాయని సంతోష్‌కుమార్ శాస్త్రి పేర్కొన్నారు. ఆదాయం 11 వ్యయం 8 రాజపూజ్యం 5, అవమానం 4గా ఉంటుందని, రాహువులో రవి దశ ముగిసి చంద్ర దశ నడుస్తోందని, జనవరి 17న అష్టమ శని దోశం ఏర్పడినందున జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. సీఎం దైవ బలాన్ని సంపాదించుకోగలిగితే అవాంతరాలను అధిగమించే వీలుంటుందన్నారు. కాగా, మంచి వానలతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పంచాంగం సూచించటం పట్ల ఆనందంగా ఉందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం పండితులను సన్మానించారు.

ధరలు మినహా అన్నీ శుభ ఫలితాలే

బీజేపీ కార్యాలయంలో మంగళంపల్లి పంచాంగ పఠనం



బండి సంజయ్‌కు ఉగాది పచ్చడి ఇస్తున్న శ్రీనివాస శర్మ. చిత్రంలో విజయశాంతి

సాక్షి, హైదరాబాద్: శ్రీ శోభకృత్ నామ సంవత్సరంలో ధరల హెచ్చుతగ్గులు మినహా మిగిలినవన్నీ శుభ ఫలితాలు ఇస్తాయని పంచాంగ కర్త మంగళంపల్లి శ్రీనివాస శర్మ చెప్పారు. బుధవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పంచాంగ పఠనం సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ ఏడాది మాగాణి, మెట్ట పంటలు బాగా పండుతాయి. వెండి, బంగారం ధరలు పెరిగే అవకాశం ఉంది. లోక కళ్యాణార్థం యజ్ఞాలు, యాగాదాలు విరివిగా నిర్వహిస్తారు. అయోధ్యలోని సుందరమైన శ్రీరాముడి ఆలయాన్ని ప్రతిష్ఠిస్తారు. గోవులను సంరక్షిస్తారు నిత్యావసర వస్తువులు, నూనె వస్తువుల ధరలు బాగా పెరిగే అవకాశం ఉంది. శ్రీరామ నవమి తరువాత నుంచి మూఢ దినాలు ప్రారంభం. ఏప్రిల్ 29 వరకు వివాహాలు ఉండవు. మే 1 నుండి జూన్ 14 వరకు శుభ కార్యాలకు అనువైన రోజులు'అని తెలిపారు. వైశాఖ శుద్ధి విదియ ఏప్రిల్ 22 నుంచి మే 2 వరకు గంగా నది పుష్కరాలు ప్రారంభం అవుతాయన్నారు. పంచాంగ పఠనం పూర్తయ్యాక పంచాంగకర్త చేతుల మీదుగా బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ సహా పార్టీ నేతలు ఉగాది పచ్చడి తీసుకున్నారు. పార్టీ జాతీయ సంస్థాగత సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్, జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జి అర్వింద్ మీనన్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పార్టీ నేతలు నల్లు ఇంద్రసేనారెడ్డి, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి సుధాకరరెడ్డి, విజయశాంతి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, గీతామూర్తి, ఆకుల విజయ పాల్గొన్నారు. తొలుత కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొని అక్కడి నుంచి బొల్లారం రాష్ట్రపతి నిలయంలో జరిగే ఉత్సవాలకు వెళ్లారు.

రాష్ట్రంలో మార్పునకు ప్రజలు నిర్ణయం తీసుకోవాలి.. కిషన్‌రెడ్డి

పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... 'ఈ ఏడాది వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నందున తెలంగాణ ప్రజలు ఉగాది పండుగ సందర్భంగా ఓ నిర్ణయం తీసుకోవాలి. కేంద్రంలో మోదీ నాయకత్వాన్ని ఆశీర్వదించి, తెలంగాణ బీజేపీ సర్కార్ ఏర్పాటుకు సహకరించాలి'అని కోరారు. దేశంలో మరోసారి సుస్థిర ప్రభుత్వం అధికారంలోకి రావాలని, రాష్ట్రంలో మార్పు రావాలని దేవుడిని కోరుకుంటున్నామన్నారు.

కొత్త ఏడాదిలో ప్రజలకు నచ్చేలా పనిచేస్తాం

- గాంధీభవన్‌లో ఘనంగా ఉగాది వేడుకలు
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి మరీ సంక్షేమ పథకాలు అమలు: శ్రీనివాసమూర్తి



గాంధీభవన్ లో పంచాంగ పఠనం చేస్తున్న శ్రీనివాసమూర్తి. చిత్రంలో రేవంత్ రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: కొత్త ఏడాదిలో ప్రజలకు నచ్చే విధంగా పనిచేస్తామని, పార్టీ కార్యకర్తలు కూడా ప్రజలకు నచ్చే విధంగా పనిచేయాలని పార్టీ శ్రేణులను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆయన ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అండగా ఉండటమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని, రాష్ట్రంలోని బలహీన వర్గాల పక్షాన నిలబడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయమైన గాంధీభవన్‌లో శోభకృత్ నామ ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉగాది సందర్భంగా చిలుకూరి శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి మరీ సంక్షేమ పథకాలను అమలు చేస్తాయని శ్రీనివాసమూర్తి జోస్యం చెప్పారు. ఇక రాజకీయంగా ఇబ్బందులు పెట్టే ప్రయత్నం ఎక్కడ జరిగినప్పటికీ ప్రజలు చివరికి రాజువైపే మొగ్గు చూపుతారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర ఎంతో కీలకమని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల పక్షాన పనిచేస్తున్న రేవంత్‌రెడ్డికి మిగతావారు సహకారం అందించాలని సూచించారు. ఈ వేడుకల్లో టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, పార్టీ నేతలు సంపత్‌కుమార్, ఎంఆర్‌జీ.వినోద్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, సుదర్శన్‌రెడ్డి, మల్లురవి, వేం నరేందర్‌రెడ్డి, రోహిణ్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొత్తులతోనే గట్టి పోటీ...

టీడీపీ కార్యాలయంలో పంచాంగ పఠనంలో బ్రహ్మశ్రీ నాయకంటి మల్లికార్జున శర్మ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగురాష్ట్రాల్లో ఇతర ప్రతిపక్ష పార్టీలతో పొత్తులతోనే తెలుగుదేశం పార్టీ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని బ్రహ్మశ్రీ నాయకంటి మల్లికార్జున శర్మ జోస్యం చెప్పారు. శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించారు. టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్లికార్జున శర్మ పంచాంగ శ్రవణం చేశారు. రానున్న ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో టీడీపీ ప్రధాన రాజకీయ పార్టీలతో పొత్తులు పెట్టుకుంటే అధికార పార్టీలకు పోటీ ఇస్తుందని అన్నారు. శోభకృత్ నామ సంవత్సర ప్రవేశ సందర్భంగా తెలుగు ప్రజలందరికీ శుభాలు కలగాలని, భగవంతుడు ప్రజలందరికీ సర్వశుభాలు కలగాలని కాసాని ఆకాంక్షించారు.



ఈ మూడు అత్యుత్తమ విషయాలకు దూరంగా ఉండవద్దు:
మంచి ఆలోచన, మంచి మాట, మంచి పని.
– జరాతుష్ట్ర

సాక్షి
గురువారం, మార్చి, 23

ఇకనైనా కళ్ళు తెరుస్తారా?

ప్రపంచానికి మరోసారి ప్రమాద హెచ్చరిక. పారిశ్రామికీకరణ మునుపటి స్థాయితో పోలిస్తే పుడమి తాపం ఇప్పటికే 1.1 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగింది. ఈ లెక్కన గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలనీ, ఈ శతాబ్ది చివరకు భూతాపోన్నతి 1.5 డిగ్రీల లోపలే ఉండేలా చూసుకోవాలనీ చెప్పుకున్న ఊసులు, చేసుకున్న బాసలు తీరా రానున్న పదేళ్ళలోనే పూర్తిగా భగ్నం కానున్నాయి. 'ఆఖరి అవకాశంగా తెరిచి ఉన్న తలుపు సైతం మూసుకుపోతోంద'ని ప్రపంచ అగ్రశ్రేణి శాస్త్రవేత్తల బృందం 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్'(ఐపీసీసీ) చేసిన హెచ్చరిక మానవాళికి మేలుకొలుపు. ఇప్పటికైనా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను నియంత్రించడానికి ప్రభుత్వాలు తక్షణం బరిలోకి దిగితే, ఎంతో కొంత ప్రయోజనమని సోమవారం నాటి తాజా నివేదిక కర్తవ్యాన్ని బోధిస్తోంది. వాతావరణ కాలుష్యానికి ప్రధాన కారణమైన సంపన్న దేశాలు దీన్ని చెవికెక్కించుకోకుండా, వర్ధమాన, నిరుపేద దేశాలదే బాధ్యత అన్నట్టు ప్రవర్తిస్తుండడమే ఇప్పుడున్న చిక్కు. విషాదం ఏమిటంటే– పాపం ఎవరిదైనా, ఫలితం ప్రపంచమంతా అనుభవించాల్సిందే!

ఐపీసీసీ 1988లో ఏర్పాటైన నాటి నుంచి ఇది ఆరో నివేదిక. ఈ ఆరో అంచనా నివేదిక (ఏఆర్6)కు సంబంధించిన నాలుగో విడత వివరాలివి. ఇదే ఆఖరి విడత కూడా! మునుపటి మూడు ప్రధాన విభాగాల నివేదికలోని కీలక సమాచారాన్ని ఒకచోట గుదిగుచ్చి అందిస్తున్నారు గనకనే ఈ చివరి దాన్ని ఐపీసీసీ ఏఆర్6 'సంకలన నివేదిక' అన్నారు. 2021 ఆగస్ట్, 2022 ఫిబ్రవరి, ఏప్రిల్‌లలో వచ్చిన మొదటి మూడూ వాతావరణ సంక్షోభం, దాని పర్యవసానాలు, గ్రీన్‌హౌస్ వాయువులను తగ్గించే మార్గాల గురించి చెప్పాయి. తాజా 'సంకలన నివేదిక' ప్రధానంగా మునుపటి ప్రచురణల్లోని కీలక ఫలితాల పునశ్చరణ. భూతాపం 'మళ్ళీ తగ్గించలేని స్థాయికి' చేరుతోందనీ, మానవాళికి దుష్పరిణామాలు తప్పవనీ, కఠిన చర్యలతోనే ప్రమాదాన్ని నివారించగలమనీ ఇది హెచ్చరిస్తోంది.

అపార ధనబలం, సాంకేతిక సామర్థ్యం తమ సొంతమైన ధనిక దేశాలు కేవలం అప్పులు, ప్రైవేట్ రంగ పెట్టుబడులిచ్చి వాతావరణ పరిరక్షణ చర్యకు సహకరించామని చేతులు దులుపుకొంటే సరిపోదు. ఈ 2020 –30 మధ్య ఇప్పుడు చేస్తున్న దానికి కనీసం 6 రెట్లయినా వాతావరణంపై పెట్టుబడి పెడితే తప్ప, తాపోన్నతిని 1.5 డిగ్రీల లోపు నియంత్రించే లక్ష్యం సాధ్యం కాదట. అలాగే, 2020 నాటి స్థాయిలోనే మన వాతావరణ విధానాలు బలహీనంగా ఉంటే, ఈ శతాబ్ది చివరకు భూతాపం 3.2 డిగ్రీలు పెరుగుతుంది. ఒకసారి 1.5 డిగ్రీలు దాటి ఎంత పెరిగినా, ఆ వాతావరణ నష్టం పూడ్చలేనిది. మానవాళికి మహా విపత్తు తప్పదు. పెను ప్రభావం పడే దేశాల్లో భారత్ ఒకటని నివేదిక తేల్చింది. వడగాడ్పులు, కార్చిచ్చులు, ఆకస్మిక వరదలు, సముద్రమట్టాల పెరుగుదల, పంటల ఉత్పత్తి తగ్గుదల, 2050 నాటికి 40 శాతం జనాభాకు నీటి కొరత – ఇలా పలు ప్రమాదాలు భారత్‌కు పొంచివున్నాయి. అయితే, వాతావరణ మార్పుల నివారణ భారాన్ని అందరూ పంచుకోవాలనే 'వాతావరణ న్యాయ' సూత్రానికి ఈ నివేదిక జై కొట్టడం మన లాంటి దేశాలకు ఊరట.

మునుపు మూడు విడతల్లో ప్రచురించిన వేలకొద్దీ శాస్త్రీయ సమాచారాన్ని సంక్షిప్తంగా, ప్రపంచవ్యాప్తంగా విధాన నిర్ణేతలకు వారు చేపట్టాల్సిన చర్యలను సారాంశరూపంలో అందించడం తాజా సంకలన నివేదిక ప్రత్యేకత. నవంబర్ 20న దుబాయ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆతిథ్యమివ్వనున్న ఐరాస తదుపరి వాతావరణ సదస్సు 'కాప్ 28'కు ఈ నివేదిక ఒక దిక్సూచి. 2015లో ప్యారిస్ వాతావరణ ఒప్పందం నాటి నుంచి నేటి వరకు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించడంలో వివిధ దేశాల పురోగతిని ఆ 'కాప్ 28'లో మదింపు చేస్తారు. ఇప్పటి దాకా చేస్తున్నవేవీ చాలట్లేదని తాజా నివేదిక సాక్షిగా తెలుస్తూనే ఉంది. వెరసి, వాయు ఉద్గారాలను తగ్గించే లక్ష్యంలో ప్రభుత్వాలన్నీ విఫలమయ్యాయి. నిజానికి, ఐపీసీసీ ఓ సమగ్ర నివేదిక ఇచ్చేందుకు 6 నుంచి 8 ఏళ్ళు పడుతోంది. అయినా గ్రీన్‌హౌస్ గ్యాస్‌లు పెరుగుతూనే ఉన్నాయి. నివేదికల పరిమాణం, సంక్షోభంపై చర్యల అత్యవసరం కూడా పెరుగుతూనే వచ్చాయి. ఇప్పటికైనా ప్రపంచ దేశాలు కఠిన చర్యలు చేపట్టకుంటే, ఆ తర్వాత ఏం చేసినా చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టే!

ఉద్గారాలను గణనీయంగా తగ్గించడం, పునరుత్పాదక ఇంధనంపైనా – ఇతర తక్కువ కర్బన సాంకేతికతల పైనా దృష్టి సారించి శిలాజ ఇంధనాల వినియోగం మానేయడం, అటవీ పెంపకం లాంటివి ప్రభుత్వాలు చేయాల్సిన పని. అలాగే, 'వాతావరణాన్ని బాగు చేసే' మార్గాల్ని అన్వేషించాలి. గాలిలో నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చేసే 'డైరెక్ట్ ఎయిర్ క్యాప్చర్' టెక్నాలజీలను అభివృద్ధి చేయాలి. ఐరాస ప్రధాన కార్యదర్శి మాట విని, ధనిక దేశాలు 2040 నాటికి 'నెట్ జీరో'ను అందుకొనేలా తమ లక్ష్యాన్ని ముందుకు జరుపుకొంటే మంచిది.

ఈ దేశాలు తమ వాతావణ బాధ్యతను నిర్వర్తించేలా చూడడం ఇప్పుడు సవాలు. ధనిక ప్రపంచపు బాధ్యతారహిత, మొండి వైఖరికి మిగతా అందరూ మూల్యం చెల్లించాల్సి రావడం మహాదారుణం. ఐపీసీసీ తదుపరి నివేదిక 2030లో కానీ రాదు. కాబట్టి భూతాపోన్నతిని 1.5 డిగ్రీల లోపలే నియంత్రించేలా చర్యలు చేపట్టడా నికి ఈ ఏఆర్6 తుది ప్రమాద హెచ్చరిక. మేల్కొందామా? లేక కళ్ళు తెరిచి నిద్ర నటిద్దామా? ప్రస్తుతం ఛాయిస్ ప్రపంచ దేశాలదే! ఒకసారి పరిస్థితి చేయి దాటేశాక మాత్రం ఏం చేసినా ఫలితం శూన్యం.

ఔషధ నియంత్రణపై రెండు నాలుకలు

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

దేశీ మార్కెట్‌లో చాలా నకిలీ మందులు చలామణీలో ఉన్నాయన్న కేంద్ర ఆరోగ్య మంత్రి వ్యాఖ్యలు బయటికి పొక్కడం కలకలం రేపింది. మళ్లీ ఆయనే అధికారిక సమావేశాల్లో నాణ్యమైన ఔషధాలు తయారవుతున్నాయని నొక్కిచెప్పారు. ప్రజలందరికీ చౌకగా, చక్కగా పనిచేసే మందులు అందివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమైతే అందుకు ఒక సమగ్రమైన పద్ధతిని అనుసరించాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ఒకే రసాయనానికి సంబంధించి వందలాది బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కోదాని ధర, సామర్థ్యాల్లో అంతరమూ కనిపిస్తోంది. అహేతుకమైన మిశ్రమాలున్న మందులూ దొరుకుతున్నాయి. జన ఔషధి కేంద్రాలు కొన్ని వేలు తెరచినంత మాత్రాన సమస్యకు పరిష్కారం లభించదు. వీటికి దన్నుగా నిలిచే సరఫరా వ్యవస్థ కూడా అత్యవసరం.

ఉజ్బెకిస్తాన్, గాంబియా... రెండు వేర్వేరు దేశాల్లో సుమారు 70 మంది పిల్లలు కల్తీ దగ్గుమందు కారణంగా మరణించారు. ఇటీవలి కాలంలో సంభవించిన ఈ దుర్ఘటనకు కారణమైన దగ్గు మందు సరఫరా అయ్యింది మన దేశం నుంచే. కొన్ని వారాల క్రితం నోయిడా పోలీసులు ఉజ్బెకిస్తాన్ మరణాలకు సంబంధించి ముగ్గురు ఫార్మా కంపెనీ ఉద్యోగులను అరెస్ట్ చేయగా... కొన్ని నెలల క్రితం గాంబియా ఘటనకు సంబంధించి దేశంలో పెద్ద దుమారమే చెలరేగింది. ఈ రెండు కేసుల్లోనూ దగ్గుమందులో విషపూరిత రసాయనాలు కలిసి ఉండటం గమనార్హం. గాంబియా ఘటనలను ముందుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచం దృష్టికి తెచ్చింది. భారత్ నుంచి ఎగుమతి అయిన దగ్గు మందులో గుర్తించిన డైఎథిలీన్ గ్లైకోల్ (డీఈజీ) కారణంగా మూత్ర పిండాలు పనిచేయకుండా పోయి పిల్లలు మరణించినట్లు అమెరికాకు చెందిన 'సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్' కూడా ఈ వారమే ధ్రువీకరించింది.

ఈ ఘటనలకు కేంద్ర ఆరోగ్య శాఖ, సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ), రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్లు, ఫార్మాస్యూటికల్ డిపార్ట్‌మెంట్‌ల స్పందన అంతంత మాత్రమే. ప్రపంచ ఆరోగ్య సంస్థ, గాంబియా ప్రభుత్వం చేసిన ప్రకటనల్లో లోపాలపై దృష్టి పెట్టాయి కానీ... ఆయా సంస్థలు గుర్తించిన అంశాల జోలికి ఇవి పోలేదు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఒక కమిటీని ఏర్పాటు చేసి ప్రపంచ ఆరోగ్య సంస్థ సమాచారం ఇవ్వకపోవడాన్ని విమర్శించి ఊరకున్నాయి.

ఆరోగ్య శాఖ నెపం మొత్తాన్ని గాంబియాపై నెట్టేసింది. దిగుమతి చేసుకునేటప్పుడు పరీక్షించుకోవాల్సిన బాధ్యత ఆ దేశానిదేనని తేల్చేసింది. అంతటితో ఆగకుండా... ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒక్కో కేసులో మరణానికీ, ఔషధానికీ ఉన్న సంబంధాన్ని వివరించలేదని వ్యాఖ్యానించింది. ఆ తరువాత తెలిసిందేమిటంటే... గాంబియా కొన్ని కేసుల్లో శవపరీక్షలు కూడా నిర్వహించి డీఈజీ అవశేషాలను గుర్తించిందని! అన్నింటి కంటే ముఖ్యంగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్ సుఖ్ మాండవియా ఈ ఘటనలన్నింటినీ భారత ఔషధ పరిశ్రమను దెబ్బతీసేందుకు జరుగుతున్న కుట్రగానే పరిగణించడం! గత నెల 24న వంద భాగస్వామ్య దేశాల భారత దౌత్యవేత్తలు పాల్గొన్న సమావేశంలోనూ మాండవియా దేశంలో నాణ్యమైన మందులు తయారవుతున్నాయని నొక్కి చెప్పడం ఇక్కడ ప్రస్తావించదగ్గ అంశం.

కేంద్ర ఆర్యోగ శాఖ మంత్రి ప్రకటనల్లో ద్వంద్వ ప్రమాణాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో జరిగిన ఓ రహస్య సమావేశంలో దేశంలో మందుల నియంత్రణ దుఃస్థితిని ఆయన నేరుగా అంగీకరించారు. ''దేశీ మార్కెట్‌లో చాలా నకిలీ మందులు చలామణిలో



ఉన్నాయి. కల్తీ మందులు ఎగుమతి అవుతున్నాయి కూడా. దీనివల్ల ఫార్మా రంగం విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి'' అని ఒప్పుకొన్నారు. ఈ దుఃస్థితికి అధికారులే కారణమని కూడా ఆయన కుండబద్దలు కొట్టారు. ''ఫార్మా రంగానిదే బాధ్యత. కానీ అంతకంటే ముందు ఇది మన బాధ్యత'' అని ఆయన అధికారులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

నియంత్రణ వ్యవస్థల గురించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ, ''ఇది చురుకుగా లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయమూ కొరవడుతోంది'' అని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి అంచనా ప్రకారం, ప్రస్తుత నియంత్రణ వ్యవస్థ కేంద్ర, రాష్ట్రాల సంస్థలు, ఫార్మాస్యూటికల్ విభాగాల పేరుతో ముక్కలు ముక్కలుగా ఉంది. మాండవియా ప్రసంగం యూట్యూబ్ ఛానల్‌లో ఎనిమిది నిమిషాల పాటు ప్రత్యక్ష ప్రసారమైంది. ఆ తరువాత ఆగిపోవడమే కాకుండా... అప్పటివరకూ రికార్డయిన వీడియోను కూడా ఛానల్ నుంచి తొలగించారు. అయితే వీడియో తొలగించినంత మాత్రాన విషయం బయటకు పొక్కకుండా ఉంటుందా? నిపుణులు ఎంతో కాలంగా చెబుతున్న విధంగానే నియంత్రణ సంస్థల నిర్లక్ష్యం కారణంగా నాణ్యత లేని, కల్తీ, నకిలీ మందులు భారతీయ మార్కెట్‌లో చలామణి అవు తున్నట్లు అందరికీ అధికారికంగా తెలిసిపోయింది. ఇలాంటి మందులు విదేశాలకూ ఎగుమతి అవుతున్నట్లు... దుష్ఫలితాలూ వాటివల్లనే అన్న విషయమూ స్పష్టమైంది.

మంత్రి ప్రకటనను బట్టి చూస్తే దేశ ఫార్మా రంగం దుఃస్థితికి కారణాలు ఆయనకూ తెలుసన్నమాట. మరి ఇదే నిజమైతే ఆయన, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఏం చేస్తున్నట్లు? గాంబియా, ఉజ్బెకిస్తాన్ ఘటనలపై వ్యతిరేక నివేదికలు వచ్చినప్పుడు బహిరంగంగా ఫార్మా రంగాన్ని, నియంత్రణ వ్యవస్థలకు మద్దతుగా మాట్లాడటం ఎందుకు? ఈ రెండు నాల్కల ధోరణిని వదిలిపెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. ఎందుకంటే ఇది ప్రజల జీవితాలతో కూడిన వ్యవహారం.

దేశ ఫార్మా రంగ నియంత్రణ సంస్థల్లోని అకృత్యాలు ఇప్పుడు కొత్తగా తెలిసినవి ఏమీ కాదు. 2012లోనే ఒక పార్లమెంటరీ కమిటీ సీడీఎస్‌సీఓ పనితీరుపై విచారణ జరిపి, కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఉన్న అక్రమాలను బయటపెట్టింది. దురదృష్టవశాత్తూ అప్పటినుంచి ఇప్పటివరకూ జరిగిన మార్పు స్వల్పమే. పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫారసులు కాగితానికే పరిమితమైపోయాయి. ప్రభుత్వాలు కూడా ఈ రంగాన్ని సంస్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేయలేకపోయాయి. ఇంకోవైపు ఫార్మా పరిశ్రమ ఎదుగుదలకు నియంత్రణ వ్యవస్థలు ప్రతిబంధకంగా మారుతున్నాయన్న ఆరోపణలు పెరిగిపోతున్నాయి.

దేశ ఫార్మా మార్కెట్ సుమారు నాలుగు లక్షల కోట్ల రూపాయల విలువైందని ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రకటించారు. ఈ మొత్తం పది లక్షల కోట్ల రూపాయలకు చేరవచ్చునని కూడా ఆయన అంచనా కట్టారు. ఇది కచ్చితంగా మంచి లక్ష్యం. కానీ భద్రత, సామర్థ్యం, మందుల ప్రమాణాలతో రాజీపడి సాధించడం ఎంతమాత్రమూ సరికాదు. స్థానిక మార్కెట్ అయినా, విదేశీ మార్కెట్ అయినా వీటిని పాటించడం అవసరం.

ప్రజలందరికీ చౌకగా, చక్కగా పనిచేసే మందులు అందివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమైతే అందుకు ఒక సమగ్రమైన పద్ధతిని అనుసరించాలి. ప్రస్తుతం మార్కెట్‌లో ఒకే రసాయనానికి సంబంధించి వందలాది బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో దాని ధర, సామర్థ్యాల్లో అంతరమూ కనిపిస్తోంది. అహేతుకమైన మిశ్రమాలున్న మందులూ దొరుకుతున్నాయి. వేర్వేరు బ్రాండ్లు ఉండటంతో వైద్యులను ఆకర్షించేందుకు కంపెనీలు అనైతిక మార్కెటింగ్ కార్యకలాపాలకూ దిగుతున్నాయి. జన ఔషధి కేంద్రాలు కొన్ని వేలు తెరచినంతమాత్రాన సమస్యకు పరిష్కారం లభించదు. వీటికి దన్నుగా నిలిచే సరఫరా వ్యవస్థ కూడా అత్యవసరం. నిజానికి జన ఔషధి కేంద్రాల స్థాపన ఆలోచన మాజీ మంత్రి రామ్ విలాస్ పాశ్వాన్‌ది. 2005లోనే ఆయన యూపీఏ కామన్ మినిమం ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ కేంద్రాల ఏర్పాటును ప్రస్తావించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఔషధ కంపెనీల నుంచి జెనెరిక్ మందులను ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన సంకల్పించారు. ఈ ప్రభుత్వ రంగ ఫార్మా కంపెనీల్లో అత్యధికం ఇప్పుడు పనిచేయడం లేదు. లేదా అస్తవ్యస్త పరిస్థితుల్లో ఉన్నాయి. కాబట్టి, సమస్య పరిష్కారానికి బహుముఖ వ్యూహం అవసరం. దేశంలోని నియంత్రణ వ్యవస్థలను గాడిలో పెట్టడంతో మొదలుపెడితే సరైన దిశలో ముందడుగు వేసినట్లు అవుతుంది!

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త ప్రారంభాలకు స్వాగతం



అందరికీ ఉగాది శుభాకాంక్షలు! తీపి, పులుపు, కారం, చేదు వంటి విభిన్నమైన జీవిత అనుభవాలను మనకు గుర్తుచేసే అద్భుతమైన ఉగాది పచ్చడి రుచులను ఆస్వాదిస్తూ ఈ పండుగను జరుపుకొందాం. కొత్త ప్రారంభాలు, సమృద్ధితో నిండిన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు!

– పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

నిరూపణ అక్కర్లేదు



పంజాబ్ ప్రజలు తమ ఇళ్ల మీద త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించాల్సిన అవసరం లేదు (దేశభక్తిని నిరూపించుకోవడానికి). ఎందుకంటే వాళ్ల పిల్లలు చాలా తరచుగా అదే త్రివర్ణ పతాకాల్లో చుట్టి వస్తారు (యుద్ధాల్లో మరణించి). వివేక్ అగ్నిహోత్రి లాంటి వాళ్ళు మాత్రమే మాతృభూమి పట్ల తమ విశ్వాసాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది.

– మన్‌దీప్ సింగ్ బజ్వా, కాలమిస్ట్

అందరూ హ్యాపీస్!



రైట్ వింగ్ ఎలాగూ సంతోషంగానే ఉంది. ప్రపంచ సంతోష సూచీలో ఇండియా స్థానం (126) చూసిన తర్వాత వామపక్షీయులు కూడా సంతోషంగానే ఉన్నారు. అంటే, ఇప్పుడు మొత్తంగా 140 కోట్ల మంది భారతీయులు సంతోషంగా ఉన్నట్టు. కాబట్టి, ఇండియా స్థానాన్ని పునఃపరిశీలించి, మొదటి స్థానంలోకి తేవాలి.

– జాఫర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

అనుసంధానం తప్పదు



ఈ రోజు ప్రపంచ జల దినోత్సవం (మార్చ్ 22). దేశంలో తలసరి నీటి లభ్యత (క్యూబిక్ మీటర్లలో): 1981– 2,895 ; 1991– 2,309 ; 2001– 1,816 ; 2011– 1,545 ; 2021– 1,486. కేవలం నలభై ఏళ్లలో నీటి లభ్యత సగానికి సగం తగ్గిపోయింది. మన వాననీటిలో అరవై శాతం సముద్రాల్లో కలుస్తోంది. అందుకే నదుల అనుసంధానం తప్పనిసరి అని నా అభిప్రాయం.

– ఆనంద్ రంగనాథన్, రచయిత

నిజాయితీకి నిలువెత్తు రూపం

మూడు సంవత్సరాలకు ముందు 2020లో జరిగి ఉండవలసిన జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి శత జయంతి వేడుకలు కోవిడ్ మూలంగా ఈ సంవత్సరానికి వాయిదాపడి, ఈ నెల 24 శుక్రవారంతో ముగియనున్నాయి. అల్లాడి కుప్పుస్వామి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1967లో న్యాయమూర్తిగా నియమితులై, 1980 నుండి 1982 వరకు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. 'హిందూ లా'లో సర్ వి. భాష్యం అయ్యంగార్ స్వర్ణ పతకాన్ని అందుకున్న ఆయన 1942లో మద్రాస్ హైకోర్ట్‌లో న్యాయవాదిగా నమోదయ్యారు. మద్రాస్ నుండి ఆంధ్ర విభజన జరిగిన తరువాత... మొదట ఆంధ్ర హైకోర్ట్ గుంటూరులో, తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు హైదరాబాద్‌లో కొనసాగారు. జడ్జి స్థాయికి ఎదిగారు. అప్పట్లో వారి తండ్రి అల్లాడి కృష్ణస్వామి అనారోగ్య కారణాల వల్ల కుప్పుస్వామిని రాజ్యాంగ నిర్మాణ సభలకు అనుమతించారు. అలా ఆయనకు భారత రాజ్యాంగ నిర్మాణం రూపొందిన వైనాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అదృష్టం కలిగింది. అత్యంత నిజాయతీపరుడుగా, నిష్పాక్షిక న్యాయమూర్తిగా ప్రశంసలందుకున్న ఆయనను ప్రభుత్వం పార్లమెంట్ ముందు ఎస్ఎస్‌పీ సభ్యులపై జరిగిన లాఠీ ఛార్జిపై, సికింద్రాబాద్‌లో జరిగిన ఆవ్రో క్రాష్‌పై, పేరుభొట్ల పాలెం డీప్ కట్ కేసు (నాగార్జున సాగర్)పై వన్‌మాన్ కమిషన్‌గా నియమించింది. ఆయన ఆంధ్రప్రదేశ్ జ్యూడీషియల్ అకాడెమి ప్రారంభించడంలో ప్రధాన పాత్ర వహించారు.



జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి

పదవీ విరమణ తరువాత 'అసోసియేషన్ ఫర్ ద కేర్ ఆఫ్ ద ఏజ్డ్', 'సుర భారతి సమితి', 'హైదరాబాద్ లిటరరీ సొసైటీ' వంటి ప్రముఖ సేవా సంస్థల కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారు. వారి తల్లిదండ్రుల పేరిట 'ది అల్లాడి మెమోరియల్ ట్రస్ట్', 'అల్లాడి వెంకటలక్ష్మమ్మ మెమోరియల్ ట్రస్ట్'లను సమాజానికి న్యాయ, వైద్య సేవలందించడం కోసం ప్రారంభించారు. కొన్నిసంవత్సరాల క్రితం ఈ రెండు సేవా సంస్థలు 'అల్లాడి మెమోరియల్ ట్రస్ట్' పేరుతో విద్యారంగాన్ని కూడా చేర్చుకొని ప్రధానంగా అట్టడుగు వర్గాల వారికి ఈ మూడు రంగాలలో సహాయ, సహకారాలను అందిస్తూ వచ్చాయి. జీవితంలో ఆటల ప్రాధాన్యాన్ని గుర్తించిన ఆయన టెన్నిస్, క్రికెట్, బ్రిడ్జ్‌లలో రాణించడమేకాక, యువకులను వాటిలో ప్రోత్సహించేవారు. తన భార్య లక్ష్మి తన కంటే గొప్పగా బ్రిడ్జ్ ఆడేవారని బహిరంగంగా ఎన్నోసార్లు అనేవారు. నిరంతర విద్యార్థిగా ఆయన 'మెయిన్స్ హిందూ లా', ఇండియన్ ఎవిడెన్స్ ఏక్ట్ 1872లను పునర్లిఖించారు. పిల్లలకోసం 'ద టేల్స్ ఫ్రమ్ ద క్లాసిక్స్'ను ఇంగ్లీష్‌లో ప్రచురించారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా 'కాన్‌స్టిట్యూషన్, వాట్ ఇట్ మీన్స్ టు ద పీపుల్' అనే పుస్తకంలో అనేక వ్యాసాలను ప్రచురించారు. వారి తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని... అందరూ అత్యంత పేదరికం నుంచి సర్వోన్నత స్థానానికి ఎదగగలరనే ధైర్యాన్నిచ్చే అల్లాడి కృష్ణస్వామి జీవిత చరిత్రను రాశారు. తన 92వ సంవత్సరంలో తుది శ్వాస విడిచారు.

మార్చి 24న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో ఆయన పేరున 'డెమోక్రసీ: డిసెంట్ అండ్ ద కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' పేరుతో 'శత జయంతి ఉపన్యాసం' (సెంటినరీ లెక్చర్) ఉమ్మడి ఆంధ్రకు అడ్వకేట్ జనరల్‌గా సేవలందించిన సీవీ మోహన్ రెడ్డి ఇవ్వనున్నారు. ఏపీ హైకోర్ట్ జడ్జిగా సేవలందించిన జస్టిస్ గోడ రఘురాం అధ్యక్షత వహించే ఈ కార్యక్రమంలో పలువురు జడ్జీలు, పౌరులు పాల్గొంటారు.

– అల్లాడి కుప్పుస్వామి కుటుంబం
(రేపు అల్లాడి కుప్పుస్వామి శతజయంతి సభ)

పోలీసు చట్టంతో నిర్బంధం ఇంకెన్నాళ్లు?

అభిప్రాయం



కోట ఆనంద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2018 జనవరి నుంచీ 'పోలీస్ చట్టం 1861' సెక్షన్ 30ని అమలుచేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజల గొంతు నొక్కుతోంది. ఇది ఎమర్జెన్సీ పరిస్థితులను తలపించే చట్టం. జిల్లా సూపరింటెండెంట్ లేదా అసిస్టెంట్ డిస్ట్రిక్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రతి నెల 1 నుంచి నెలాఖరు వరకు నెల రోజుల పాటు పోలీస్ ఏక్ట్ నిబంధనలను అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. ప్రజా సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ఊరేగింపులు, బహిరంగ సభలు, ప్రజలు గుమికూడే కార్యక్రమాలను చేపట్టాలంటే ముందస్తుగా డీఎస్పీ లేదా ఆపై అధికారుల నుంచి అనుమతి పొందాల్సిందే.

నెల రోజుల పాటు నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసిగొల్పే ఎటువంటి ఆయుధాలు, సామగ్రీ కలిగి ఉండొద్దని ఆ ఆర్డర్‌లో పేర్కొంటున్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే సెక్షన్ 30, పోలీస్ ఏక్ట్ 1861 ప్రకారం శిక్షకు అర్హులవుతారని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. శాంతిపూర్వకంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందస్తుగా అన్ని వివరాలు వెల్లడించి అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటనలు విడుదల చేస్తున్నారు. సాధారణ ప్రజలు నివసించే ఈ ప్రాంతంలో ఇంత కఠినమైన చట్టాలు అమలు చేయడం ఎందుకోసం?

అనేక సమస్యలకు నిలయమైన ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలలో ఎక్కువగా ఆదివాసీ ప్రజలు, దళిత బహుజనులు ఉన్నారు. వారి సమస్యలు బయట ప్రపంచానికి తెలుపలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు నిత్యం తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాల కూంబింగ్ కార్యక్రమంతో ఉమ్మడి జిల్లాల ప్రజలు నిత్య నిర్బంధంలో మగ్గుతున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్ నగర్ పట్టణంలో మార్చి 5 వ తేదీన అటవీ సంరక్షణ నియమాలు ఉపసంహరించుకోవాలనీ, ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రక టించినట్లు పోడు భూముల పట్టాలు మంజూరు చేయాలనీ, పంటలకు గిట్టుబాటు ధరలు చెల్లించాలనే డిమాండ్లతో నిర్వహించ తలపెట్టిన రైతుల జిల్లా సదస్సును ఈ పోలీసు ఏక్ట్ అమలవుతున్నందున అనుమతి ఇవ్వకుండా సదస్సును భగ్నం చేశారు. అంతటితో ఆగకుండా



కాగజ్‌నగర్; బెజ్జూర్, కౌటాల పెంచికల్ పేట మండలాల్లోనే కాక అనేక ప్రాంతాల్లో జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో ప్రజా సంఘాల, యువజన సంఘాల నాయకులను ముందస్తు అరెస్టులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. వీరిని కాక మరి కొంతమందిని పోలీస్ అధికారులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతూ... వారికి నక్సలైట్లతో సంబంధాలు ఉన్నాయనీ, అందుకనే కేసులు నమోదు చేస్తామనీ బెదిరిస్తున్నారు. ఈ విషయంలో మానవ హక్కుల వేదిక రెండు రాష్ట్రాల సమన్వయకర్త జీవన్ కుమార్ పోలీసులతో మాట్లాడటంతో పోలీసులు వెనక్కి తగ్గారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో నివసిస్తున్న ఆదివాసీలు తరచూ ఏదో ఒక అన్యాయానికి గురౌతూ వారి సమస్యలపై పోరాడాల్సిన అనివార్యత ఏర్పడుతోంది. పాలకులు పులుల సంరక్షణ పేరుతో టైగర్ జోన్, టైగర్ కారిడార్‌లను నెలకొల్పి ఆదివాసీలను నిర్వాసితులు చేస్తున్నారు. ఆదివాసీలు నివసిస్తున్న ఐదవ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఓపెన్ కాస్ట్ గనుల తవ్వకాలు చేపడుతున్నారు. మరో వైపు ఫారెస్టు అధికారులు, సిబ్బంది ఆదివాసీలపై తరచూ దాడులకు పాల్పడుతున్నారు. ఆదివాసీలు ఇక్కడ ఎక్కువ మంది నివసిస్తున్నప్పటికీ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలోని పదుల గ్రామాలను ఏజెన్సీ ప్రాంతాలుగా నోటిఫై చేయలేదు. ఇందు వల్ల ఆదివాసీలకు అందాల్సినవేవీ అందడం లేదు.


ఐదవ షెడ్యూల్ రాజ్యాంగ హక్కులను, పీసా, 1/70, అటవీ హక్కుల చట్టాలను అమలు చేయడం లేదు. ఈ సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్టు ఒక శాపంగా మారింది. ప్రతి ఏడాది కాళేశ్వరం బ్యాక్ వాటర్స్‌తో వందల ఎకరాల పంటలు ముంపుకు గురవుతున్నాయి. మరోవైపు వర్షాకాలంలో ఆసిఫాబాద్ జిల్లాలోని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల, కస్తూర్బాగాంధీ విద్యాలయాల, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంక్షేమ వసతి గృహాలకు చెందిన విద్యార్థులు విషజ్వరాల బారిన పడి, అధికారులు సకాలంలో ఆసుపత్రిలో చేర్పించలేక పోవడంతో మరణిస్తున్నారు. ఇటువంటి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు దిగితే పోలీసు ఆక్ట్‌తో అణచివేస్తున్నారు. దీన్ని అందరూ ఖండించాలి.

వ్యాసకర్త కుల నిర్మూలన వేదిక రాష్ట్ర కార్యదర్శి | 96523 57076

రోజా – దైవాదేశం

విశ్వంలోని విశ్వాసులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న విశిష్ట మాసం రమజాన్ ప్రారంభమైంది. ఇది శుభాలు వర్షించే వరాల వసంతం. ఈ పవిత్ర మాసంలో ఉపవాసాలు పాటించాలన్నది దైవాదేశం.

పవిత్ర ఖురాన్‌లో ఇలా ఉంది: 'విశ్వాసులారా! గత ప్రవక్తల అనుయాయులపై ఏవిధంగా ఉపవాసాలు విధిగా నిర్ణయించబడ్డాయో, అలాగే ఇప్పుడు మీపై కూడా ఉపవాసాలు విధిగా నిర్ణయించబడ్డాయి. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశముంది' (2–183). దైవం పట్ల భయభక్తులు ఉన్నప్పుడే మనిషి అన్నిరకాల చెడులనూ, దుర్మార్గాలనూ విసర్జించి మంచిని స్వీకరిస్తాడు. ప్రతి మనిషీ ఈ ప్రపంచంలో తాను చేసుకున్న కర్మలకు పరలోకంలో విశ్వప్రభువు ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంది. ఆప్రకారమే ప్రతిఫలమూ లభించనుంది. విశ్వాసి మదిలో నిరంతరం మెదిలే ఈ భావనే దైవభీతి.



ఇలాంటి భయభక్తులు కలిగిన మనిషి సమస్త చెడులకూ, పాపాలకూ దూరంగా ఉంటూ పవిత్రమైన, పరిశుద్ధమైన జీవితం గడపడానికి ప్రయత్నిస్తాడు. విశ్వాసులకు ఉపవాసాలు పాటించాలని ఆజ్ఞాపించిన ఉద్దేశ్యంలో దైవభీతితోపాటు కృతజ్ఞత కూడా ఉంది. అంటే, దైవం రమజాన్ మాసంలో మానవుల జీవితాలను సమూలంగా సంస్కరించి, వారికి ఇహపర సౌభాగ్యాలు అనుగ్రహించే పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని అనుగ్రహించినందుకు కృతజ్ఞతలు సమర్పించుకుంటారు. 'దైవం మీకు రుజుమార్గం చూపినందుకు ఆయన ఔన్నత్యాన్ని కొనియాడడానికీ, ఆయనకు కృతజ్ఞులై ఉండడానికీ ఈ సౌలభ్యం ప్రసాదించాడు' (2–183).

రమజాన్ ఉపవాసాలు పాటించడం ద్వారానే మనం దైవానికి కృతజ్ఞతలు చెల్లించుకోగలుగుతాం. ఈ మాసంలో ఒక విశ్వాసి శక్తి ఉండికూడా ఉపవాసాలు పాటించడం లేదంటే, అతడు దైవం చేసిన మేలును మరచిపోయి ఆయనకు కృతఘ్నుడై పోయాడని అర్థం. దైవం మొత్తం మానవులందరికీ సన్మార్గ పథం ప్రసాదించాలని కోరుకుందాం.

– మదీహా అర్జుమంద్
(పవిత్ర రమజాన్ మాస సందర్భంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: శు.విదియ రా.8.32 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: రేవతి సా.4.13 వరకు, తదుపరి అశ్వని, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.10.07 నుండి 10.55 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.43 వరకు, అమృతఘడియలు: ప.1.50 నుండి 3.24 వరకు ; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.07.

క్లుప్తంగా...

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం

జనచైతన్య యాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం



వైరా/మధిర: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర బుధవారం ఖమ్మం జిల్లా వైరా, మధిర, బోనకల్‌లో కొనసాగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ నల్లధనాన్ని వెనక్కి తీసుకొస్తామని, ఒక్కొక్కరి అకౌంట్‌లో రూ.15 లక్షలు వేస్తామని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. మోదీ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పేద ప్రజలను అణగదొక్కుతున్నారని, కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఎవరైనా వ్యతిరేకిస్తే ఈడీ, సీబీఐతో దాడులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న సీఎం కేసీఆర్‌కు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు సీపీఎం, సీపీఐ పార్టీలు కేసీఆర్ వెంటే నడుస్తాయని, వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని తమ్మినేని తెలిపారు. కాగా, వైరాలో జనచైతన్య యాత్రకు ఎమ్మెల్యే రాములునాయక్, మధిరలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు.

జర్నలిస్టులను తప్పుడు కేసులతో వేధిస్తోంది: వివేక్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలు, తప్పులను బయట పెడుతున్న పత్రికా సంస్థలను, ఇండిపెండెంట్ జర్నలిస్టులను తప్పుడు కేసులతో ప్రభుత్వం వేధిస్తోందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. ప్రభుత్వ బండారాన్ని వెలుగులోకి తీసుకొస్తుండడంతో సహించలేక కేసులు పెడుతున్నారన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ మీడియా సంస్థలపై దాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తీన్మార్ మల్లన్న, తదితరులపై పెట్టిన కేసులను ఖండిస్తున్నామని తెలిపారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వండి



జూలకంటి రంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలతో రైతుల కష్టమంతా నీళ్లపాలైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరాలకు రూ.20 వేల నష్ట పరిహారం ఇవ్వాలని జూలకంటి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2018 నుంచి ఇప్పటి వరకు రూ.1,500 కోట్ల పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. 2020 నుంచి 2023 వరకు రూ.1,287 కోట్లు 15వ ఫైనాన్స్ కమిషన్‌లో ప్రకటించినా నష్టపరిహారం నామ మాత్రంగానే అందించిందని వెల్లడించారు. 2022లో వానాకాలంలో అధిక వర్షాల వల్ల 11 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. జరిగిన నష్టంపై కేంద్రానికి లేఖ రాయాలని, ఆహార ధాన్యాలకు రూ.20 వేలు, వాణిజ్య పంటలకు రూ.40 వేల చొప్పున పరిహారం చెల్లించాలని జూలకంటి డిమాండ్ చేశారు.

25న వైష్ణోదేవి విశాల్ జాగరణ్



పూజలు చేస్తున్న జాగరణ్ మండలి సభ్యులు

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 25న గోషామహల్ పోలీస్ స్టేడియంలో వైష్ణోదేవి విశాల్ జాగరణ్ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు జాగరణ్ మండలి చైర్మన్ అంజనీకుమార్ అగర్వాల్ తెలిపారు. బుధవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో జాగరణ్ మండలి సభ్యులు భూమి పూజ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవజాతి శ్రేయస్సు కోసం, శాంతి ప్రోత్సహించాలనే కర్తవ్యంతో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరవుతారని వెల్లడించారు. దాదాపు 20 వేల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోర్‌కమిటీ సభ్యులు రాంకిషన్ అగర్వాల్, సంజయ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

రామచంద్రస్వామికి ఆదాయం 11 , వ్యయం 8



శ్రీసీతారామ చంద్రస్వామి వారికి దిష్టి తీసి యాగశాలలకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు బుధవారం వైభవంగా అంకురార్పణ చేశారు. శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలకు ఏకకాలంలో మృత్సంగ్రహణం (పుట్టమట్టితో పూజ) చేసి, వేడుకలకు శ్రీకారం చుట్టారు. బుధవారం ఉదయం చిత్ర కూట మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, ఆ తర్వాత ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలల్లో ఉత్స వమూర్తులను ప్రవేశపెట్టి పూజలు చేశారు. వాస్తు హోమం, పర్య గ్నికరణం జరిపి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక విశిష్టతను వేద పండితులు వివరించారు. 15రోజుల పాటు సంక్షేమ రామాయణ హవనం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం బేడా మండపంలో శోభకృత్ నామ ఉగాది ఉత్సవాలు నిర్వహించి, పంచాంగ శ్రవణం నిర్వహించారు. రామచంద్రస్వామి వారికి 11 ఆదాయం , 8 వ్యయమని, రాజపూజ్యం 08, అవమానం 05గా ఉన్నాయని, సీతమ్మవారికి ఆదాయం 02, వ్యయం 11, రాజపూజ్యం 4, అవమానం 07గా ఉంటాయని పురోహితులు వివరించారు.

శ్రీస్వామి వారి ఆదాయం 14, వ్యయం 11

యాదాద్రిలో ఘనంగా ఉగాది వేడుకలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంతోపాటు శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శ్రీశోభకృత్ నామ తెలుగు నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఆచార్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభూలు కొలువైన ప్రధానాలయంలో భక్ష్యాలు తయారు చేసి, షడ్రుచులతో సిద్ధం చేసిన పచ్చడికి ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీస్వామి, అమ్మవార్లకు నివేదించారు. సాయంత్రం ముఖ మండపంలో శ్రీస్వామి వారిని అలంకరించి మాఢ వీధుల్లో సేవోత్సవం జరిపించారు. తూర్పు రాజ గోపురం ముందు అధిష్టించి ఆచార్యులు పంచాగ పఠనం చేశారు. యాదాద్రి నృసింహస్వామిది తులా రాశి కాగా ఈ ఏడాది శ్రీస్వామి వారికి 14 ఆదాయం, 11 వ్యయం, శ్రీలక్ష్మీ అమ్మవారిది మేషరాశి కాగా ఆదాయం 5, వ్యయం 5, ఆండాళ్ అమ్మవారిది సింహ రాశి కాగా ఆదాయం 14 వ్యయం 2 ఉన్నట్లు ఆచార్యులు వివరించారు.



యాదాద్రి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న ఆచార్యులు

శ్రీశోభకృత్‌లో భక్తులతో పాటు ప్రజలంతా ఆనందంగా ఉంటారని ఆచార్యులు వెల్లడించారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురుస్తాయని, వడగళ్లు సైతం పడతాయని తెలిపారు. రైతాంగానికి శ్రీ శోభకృత్ నామ సంవత్సరం కలసి వచ్చే అంశం అని అన్నారు. వేసవిలో ఎండలు దంచి కొడతాయన్నారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని, ఎలాంటి వైరస్ ప్రజలకు సోకదని తెలిపారు. ఈ వేడుకల్లో ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, ముఖ్య అర్చకులు, పండితులు, పురోహితులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'కు విశేష స్పందన

- మహిళలకోసం ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమం
- 100 కేంద్రాల్లో ప్రతి మంగళవారం వైద్య సేవలు
- దశలవారీగా 1,200 కేంద్రాల ఏర్పాటు
- ఈ నెల 8న ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు
- రెండు మంగళవారాల్లో 11 వేల మందికి పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'ఆరోగ్య మహిళ'కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గత రెండు మంగళవారాల్లో కలిపి 11,121 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. ఈనెల 14న 4,793 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించగా, ఇందులో 975 మందికి అవసమైన మందులు అందజేశారు. స్పెషలిస్టుల ద్వారా వైద్యం అవసరమైన వారిని, సమీపంలోని పెద్దాసుపత్రికి తీసుకువెళ్ళి చికిత్సలు అందేలా చూస్తున్నారు. తమ కోసం ప్రత్యేకంగా ఒకరోజు కేటాయించి వైద్య సేవలు అందిస్తుండటంపై మహిళలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులకు చెప్పుకోవడం ఇష్టం లేక కొందరు, వ్యాధి లక్షణాలపై అవగాహనలేక మరికొందరు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు అలాంటి వారు ఆరోగ్య మహిళా కేంద్రాలకు వెళ్లి ఉచితంగా వైద్యం, పరీక్షలు చేయించుకుని మందులు పొందుతున్నారు. కాగా, రెండో మంగళవారం.. 21వ తేదీన 6,328 మంది మహిళలు ఆరోగ్య మహిళ క్లినిక్స్‌కు వెళ్లారు. వీరిలో అవసరమైనవారికి రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ నిర్ధారణ పరీక్షలు, నోటి కేన్సర్ పరీక్షలు చేశారు. అలాగే కొంత మందికి మూత్రకోశ ఇన్ఫెక్షన్ల పరీక్షలు, సూక్ష్మ పోషక లోప నిర్ధారణ పరీక్షలు, థైరాయిడ్, విటమిన్-డీ లోప నిర్ధారణ, సీబీపీ పరీక్షలు నిర్వహించారు.

100 కేంద్రాల్లో కొనసాగుతున్న సేవలు..

వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన మంత్రి హరీశ్‌రావు కరీంనగర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 24 జిల్లాల్లో 100 కేంద్రాల్లో వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. దశల వారీగా వీటిని 1,200 కేంద్రాలకు విస్తరించనున్నారు. ఈ కేంద్రాల్లో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళలకే 8 రకాల వైద్య సేవలు అందిస్తున్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్య మహిళ'అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళల కోసం 100 ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం. మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే 8 రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్యం చేస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి మహిళ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను.

– హరీశ్‌రావు, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి

రామయ్య పెళ్లికి రండి..

గవర్నర్, సీఎంకు ఆహ్వాన పత్రికలు అందజేసిన ఆలయ అర్చకులు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 30, 31వ తేదీన జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణం, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలకు హాజరు కావాలని సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను ఆహ్వానించారు. హైదరాబాద్‌లో బుధవారం వారిని దేవస్థానం ఈఓ రమాదేవి, అర్చక బృందం కలిసి రామయ్య పెళ్లి పత్రికలు అందజేశారు. అలాగే, అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఈఓ సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, స్థానాచార్యులు స్థలశాయి పాల్గొన్నారు.



శ్రీసీతారాముల కల్యాణ వేడుక పత్రికను అందుకున్న సీఎం కేసీఆర్ దంపతులు. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అర్చకులు

నాగలి పట్టి పొలం దున్నిన భట్టి

- రైతులతో కలసి సహపంక్తి భోజనం

కెరమెరి (ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లా కెరమెరి మండలం మోడి గ్రామంలో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం మధ్యాహ్నం బారేమోడి గ్రామానికి వెళ్లిన ఆయన మోహర్లే వెంకట్‌రావ్ పొలంలో నాగలి పట్టారు. ఈ సందర్భంగా ఎడ్లు, నాగలికి ప్రత్యేక పూజలు చేసి, రైతు కుటుంబానికి కొత్త దుస్తులు అందజేశారు. అనంతరం ఉగాది పచ్చడి తీసుకుని రైతులతో సహపంక్తి భోజనం చేశారు. మోడి గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా చేసిన గుడాలను వారితో కలసి ఆరగించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఉగాది రాష్ట్ర ప్రజలందరికి శుభాలు చేకూర్చాలని భట్టి ఆకాంక్షించారు. ఉగాది పండుగను కుమురంభీం పుట్టిన గడ్డపై చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. భట్టి వెంట డీసీసీ అధ్యక్షుడు కె.విశ్వప్రసాద్‌రావు, ఏఐసీసీ సభ్యులు మర్సకోల సరస్వతి, గణేశ్ రాథోడ్ తదితరులు ఉన్నారు.



పొలం దున్నుతున్న భట్టి విక్రమార్క

తీన్మార్ మల్లన్నకు రిమాండ్

- ఆయనతోపాటు మరో నలుగురిని చర్లపల్లి జైలుకు తరలించిన పోలీసులు
- విధుల్లో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్ల అక్రమ నిర్బంధం..
- క్యూ న్యూస్ ఆఫీసులో బంధించి లాఠీలతో దాడిచేశారని ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్/అబ్దుల్లాపూర్‌మెట్/మేడిపల్లి: మేడిపల్లి పీఎస్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లపై దాడి చేశారన్న కేసులో మంగళవారం రాత్రి అరెస్టు చేసిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నతోపాటు మరో నలుగురిని పోలీసులు బుధవారం ఉదయం హయత్‌నగర్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చారు. మేజిస్ట్రేట్ మల్లన్నతోపాటు నలుగురు వ్యక్తులకు 14 రోజులు రిమాండ్ విధించడంతో వారిని చర్లపల్లి జైలుకు తరలించారు. రాత్రి అరెస్టు చేసిన మల్లన్నను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసు స్టేషన్‌కు తీసుకుచ్చారు. కాగా, న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచే వరకు పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం సాయంత్రం 5 గంటలకు పీర్జాదిగూడలో చైన్ స్నాచింగ్ నేరాలను నిరోధించేందుకు ఇద్దరు కానిస్టేబుళ్లు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కానిస్టేబుళ్ల వద్దకు వచ్చి ఎవరు మీరు! అని ప్రశ్నించారు. తాము పోలీసులమని చెబుతున్నా.. వినకుండా వారిని కొట్టి, లాఠీలను లాక్కొని బలవంతంగా సమీపంలో ఉన్న క్యూ న్యూస్ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఆఫీసు ముందు తిరుగుతున్నారని, దీంతో అనుమానం వచ్చి తీసుకొచ్చామని కానిస్టేబుళ్ల గురించి మల్లన్నకు తెలిపారు. వారిని తన గదిలోకి తీసుకురావాలని మల్లన్న చెప్పడంతో లోపలికి తీసుకెళ్లి కానిస్టేబుళ్ల సెల్‌ఫోన్లు లాక్కొని, రెచ్చగొట్టేలా మాట్లాడుతూ.. కర్రలతో దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న రాచకొండ పోలీసు ఉన్నతాధికారులు వెంటనే ప్రత్యేక పోలీసు బృందాలను పంపించారు. సీనియర్ పోలీసు అధికారులు కూడా క్యూ న్యూస్ ఆఫీసుకు చేరుకొని నిర్బంధంలో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లను రక్షించారు. వారిని నిర్బంధించిన తీన్మార్ మల్లన్నతో పాటు క్యూ న్యూస్ ఎడిటర్ బండారు రవీందర్, డ్రైవర్ ఉప్పాల నిఖిల్, ఆఫీసు బాయ్ సిర్రా సుధాకర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చింత సందీప్ కుమార్‌లను అరెస్టు చేశారు. విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకోవటంతో పాటు అక్రమంగా బంధించడం, కర్రలతో దాడి చేయడం వంటి నేరంపై ఆ ఐదుగురిపై ఐపీసీ సెక్షన్ 363, 342, 395, 332, 307 ఆర్/డబ్ల్యూ 34, సెక్షన్ 7(1) కింద కేసులు నమోదు చేశారు.

నా భర్త ఆచూకీ చెప్పండి..

ఇదిలా ఉండగా తన భర్త ఆచూకీ చెప్పాలని తీన్మార్ మల్లన్న భార్య మమత మేడిపల్లి పోలీసులను ఆశ్రయించారు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు, లాయర్లతో కలసి మేడిపల్లి పోలీస్‌స్టేషన్ వెళ్లిన ఆమె, తన భర్తను ఎందుకు అరెస్ట్‌చేశారని, ఎక్కడికి తీసుకు వెళ్లారని ప్రశ్నించారు. ఎఫ్‌ఐఆర్ కాపీని ఇవ్వాలని కోరారు. కాగా, పోలీసులు మల్లన్నతో ఫోన్‌లో మాట్లాడిస్తామని ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం.

ఖల్లివెల్లిలకు షాకిచ్చిన సౌదీ సర్కార్

- వీసా గడువు ముగిసినా అక్కడే ఉంటున్నవారికి సాయం చేయొద్దని ఆదేశాలు

మోర్తాడ్ (బాల్కొండ): తమ దేశంలో వీసా నిబంధనలను ఉల్లంఘించి ఉంటున్న విదేశీయులపై సౌదీ అరేబియా ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. వీసా గడువు ముగిసినా తమ దేశంలో ఉంటూ ఖల్లివెల్లిగా మారిన వారికి ఎవరైనా ఉపాధి కల్పించినా, వసతికి అవకాశం ఇచ్చినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సౌదీ పబ్లిక్ సెక్యూరిటీ ఆథారిటీ హెచ్చరించింది. గతంలో అనేక మంది సౌదీకి విజిట్ వీసాలపై వెళ్లడం, వీసా గడువు ముగిసినా అక్కడే ఉంటూ ఏదో ఒక పని వెతుక్కోవడం చేసేవారు. కంపెనీ వీసాలపై వెళ్లినవారు కూడా ఆ కంపెనీని విడిచి బయటకు వచ్చి, మరో చోట పని చేసేవారు. ఇప్పుడు అలాంటి వారిని నిరోధించడానికి సౌదీ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. వీసా నిబంధనలు ఉల్లంఘించి ఉంటున్న వ్యక్తులకు వసతి, పని కల్పించిన వారికి లక్ష రియాళ్ల జరిమానా (మన కరెన్సీలో రూ.20 లక్షలు), ఆరు నెలల జైలు శిక్ష విధిస్తామని సౌదీ ప్రభుత్వం హెచ్చరించింది. రిక్రూట్‌మెంట్ సంస్థలు వీసా నిబంధనలు పాటించనివారికి పని కల్పిస్తే ఆరు నెలల పాటు రిక్రూట్‌మెంట్లపై నిషేధం అమలు చేయడంతో పాటు జరిమానా, జైలు శిక్ష , దేశ బహిష్కరణ అమలు చేయనున్నారు. ఈ కఠిన నిబంధనలు అమలులోకి రావడంతో ఖల్లివెల్లి కార్మికులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఇక నుంచి సౌదీకి ఉపాధి కోసం వెళ్లేవారు పక్కా వీసా తీసుకుని అక్కడకు చేరుకోవాలని వలస కార్మికుల సంఘాల నాయకులు సూచిస్తున్నారు.

ఈతకు వెళ్లి..గల్లంతయ్యారు

- ఎస్సారెస్పీ కాల్వలో గల్లంతైన అన్నా తమ్ముళ్లు
- ఈత కొడుతున్న అన్నను గట్టిగా పట్టుకున్న తమ్ముడు
- నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన వైనం
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు

హసన్‌పర్తి: ఈతకు వెళ్లిన అన్నదమ్ములిద్దరూ ఎస్సారెస్పీ కాల్వలో గల్లంతయ్యారు. హనుమకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధి పలివేల్పుల ప్రాంతంలో బుధవారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. పలివేల్పుల శివారులోని కొత్తపల్లికి చెందిన మట్టెడ కళ్యాణి -నరేశ్ దంపతులకు హర్షిత్(16), అన్విక్(9)లు ఇద్దరు కుమారులున్నారు. హార్షిత్ ఇంటర్మీడియెట్ చదువుతుండగా, అన్విక్ స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి అభ్యసిస్తున్నాడు. ఉగాది పండుగకు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన నేపథ్యంలో అన్నదమ్ములిద్దరూ కలిసి స్థానిక ఎస్సారెస్పీ కాల్వలో ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో హర్షిత్‌కు ఈత రావడంతో కాల్వలోకి దిగాడు. ఈత కొడుతూ తమ్ముడిని కూడా దిగమన్నాడు.



అన్విక్ (ఫైల్)



హర్షిత్ (ఫైల్)

భయపడి గట్టిగా పట్టుకోవడంతో..

కాల్వలోకి దిగిన అన్విక్ భయంతో అన్న హర్షిత్‌ను గట్టిగా పట్టుకున్నాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఇద్దరూ కొట్టుకుపోతుండగా, అక్కడే దుస్తులు ఉతుకుతున్న కేతమ్మ అనే మహిళ గమనించింది. విషయాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సమాచారం అందించింది. కానీ అప్పటికే నీటిలో కొట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని విలపించారు. విషయం తెలుసుకుని ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు అన్నదమ్ముల కోసం అగ్నిమాపక సిబ్బంది, గజఈతగాళ్లను రంగంలోకి దించినప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. పిల్లలు గల్లంతైన సమాచారం అందడంతో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు ఎస్సారెస్పీ గేట్లు మూసివేశారు.

హ్యాండ్ గ్రెనేడ్లు పేల్చేశారు!

గతేడాది అక్టోబర్‌లో అరెస్టయిన ఉగ్రత్రయం

- దసరా రోజు విధ్వంసాలకు కుట్ర పన్నిన ముగ్గురు
- నిందితుల నుంచి నాలుగు చైనా గ్రెనేడ్లు స్వాధీనం
- భద్రపరచడం ముప్పు కావడంతో కోర్టులో పిటిషన్
- న్యాయస్థానం అనుమతితో పేల్చివేసిన సీసీఎస్‌డబ్ల్యూ

సాక్షి, హైదరాబాద్: నగరంలో గతేడాది దసరా ఉత్సవాల నేపథ్యంలో విధ్వంసాలకు కుట్ర పన్ని చిక్కిన లష్కరేతొయిబా(ఎల్‌ఈటీ) ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న హ్యాండ్ గ్రెనేడ్లను పోలీసులు పేల్చేశారు. వీటిని భద్రపరచడం ముప్పుతో కూడిన వ్యవహారం, నిర్వీర్యం చేయడం సాధ్యం కాకపోవడంతో సీసీఎస్ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ కేసు జాతీయ దర్యాప్తు సంస్థకు (ఎన్ఐఏ) బదిలీ కావడంతో ఈ మేరకు ఆ అధికారులకు సమగ్ర నివేదికను అందించింది.

చైనా గ్రెనేడ్లు మనోహరాబాద్ మీదుగా...

గత ఏడాది అక్టోబర్ 2న అరెస్టయిన ఉగ్ర త్రయం అబ్దుల్ జాహెద్, మహ్మద్ సమీయుద్దీన్, మాజ్ హసన్ ఫారూఖ్‌లు పాకిస్తాన్‌లోని రావల్పిండిలో ఉన్న హ్యాండ్లర్స్ ఫర్హతుల్లా ఘోరీ, సిద్ధిఖ్ బిన్ ఉస్మాన్, అబ్దుల్ మాజిద్ ఆదేశాల మేరకు పని చేశారు. దసరా రోజు నగరంలో విధ్వంసాలు సృష్టించేందుకు సిద్ధమైన వీరికి చైనాలో తయారైన హ్యాండ్ గ్రెనేడ్లను వారు పంపారు. ఇవి లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ఏసీ) మీదుగా కశ్మీర్‌కు డ్రోన్ల ద్వారా డెడ్ డ్రాప్ విధానంలో చేరాయి. వాటిని అక్కడ నుంచి మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ వరకు చేర్చిన స్లీపర్‌సెల్స్ ఓ రహస్య ప్రదేశంలో దాచాయి. అక్కడకు వెళ్లిన సమీయుద్దీన్ నాలుగు గ్రెనేడ్స్‌ను తీసుకువచ్చారు. వీటిని తమ వద్ద దాచి ఉంచిన ఆ ముగ్గురూ నగరంలో రెక్కీలు చేస్తుండగానే సిట్ అధికారులకు చిక్కారు.

ఈ కేసుల్లో సీజర్ కీలకాంశం...

ఈ తరహా ఉగ్రవాద సంబంధ కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సీజర్ ప్రాపర్టీ నేరం నిరూపణలో కీలక ఆధారంగా మారుతుంది. దీంతోనే కోర్టులో నిందితులను దోషిగా నిరూపించడానికి అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే సిట్ అధికారులు ఉగ్ర త్రయం నుంచి స్వాధీనం చేసుకున్న చైనా మేడ్ గ్రెనేడ్స్‌ను తొలుత కోర్టులో దాఖలు చేశారు. ఆ పై న్యాయస్థానం ఆదేశాల మేరకు తమ అధీనంలోనే భద్రపరిచారు. సాధారణంగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న సందర్భంలో పోలీసులు పంచ్ విట్నెసెస్ (సాక్షులు) సమక్షంలో దొరికిన మొత్తం ఎంతో రికార్డుల్లో పొందుపరుస్తారు. ఆపై దాని నుంచి కొంత మొత్తాన్ని తీసుకుని సురక్షితంగా కోర్టులో దాఖలు చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతారు. అయితే లైవ్ బాంబులు, గ్రెనేడ్స్ దొరికిన పక్షంలో ఇవి ప్రమాదహేతువులు కావడతంతో పంచ్ విట్నెసెస్‌ల సమక్షంలో పంచ్‌నామా తరువాత వాటిని నిర్వీర్యం చేసి తదుపరి చర్యలు తీసుకుంటారు.



నిర్వీర్యం సాధ్యం కాకపోవడంతో...

ఎల్‌ఈటీ ఉగ్రవాదుల నుంచి పోలీసులు నీలి రంగులో ఉన్న నాలుగు చైనా మేడ్ హ్యాండ్ గ్రెనేడ్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిని నిర్వీర్యం చేసేందుకే పోలీసులు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే చైనాలో తయారైనవి కావడంతో ఆ ప్రయత్నం చేస్తే పేలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారు. దీంతో సిట్ అధికారులు వీటిని పేల్చేయడమే శ్రేయస్కరమని భావించారు. ఈ మేరకు న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసి అనుమతి పొందారు. ఇటీవల నగర భద్రతా విభాగంలోని బాంబు నిర్వీర్యం బృందాల సమక్షంలో ఈ తంతు పూర్తి చేశారు. గోషామహల్ పోలీసుస్టేడియంలోని సీఎస్‌డబ్ల్యూ ఆఫీస్‌లోనే పూర్తి భద్రతా ఏర్పాట్ల మధ్య నాలుగు గ్రెనేడ్లు పేల్చేశామని, దీనిపై కోర్టుతో పాటు ఎన్ఐఏకు సమాచారం ఇచ్చామని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

విషవాయువుతో ఊపిరాడక సోదరులు మృతి

భద్రాద్రి జిల్లా లక్ష్మీపురం అట్టల ఫ్యాక్టరీలో ప్రమాదం

బూర్గంపాడు: ఉగాది పండగ రోజున ఓ వలస కార్మికుల కుటుంబంలో తీరని విషాదం చోటుచేసుకుంది. అట్టల ఫ్యాక్టరీలో పల్ప్ (పేపర్‌గుజ్జు) ఉండే బావిని శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అన్నదమ్ములు విషవాయువుతో ఊపిరాడక ప్రాణాలొదిలారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో ఎస్ఎస్ అట్టల ఫ్యాక్టరీలో బుధవారం చోటుచేసుకుంది. సాయంత్రం 5.30 గంటల సమయంలో పల్ప్ బావిని శుభ్రం చేసేందుకు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కావాసి జోగా (21), కావాసి బుద్ధరామ్ (23) అనే వలస కార్మిక సోదరులు పది అడుగుల లోతు ఉన్న బావిలోకి నిచ్చెన సాయంతో దిగారు. వెంటనే ఇద్దరూ ఊపిరాడక కుప్పకూలారు. గమనించిన తోటి కార్మికులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకుని, వారిని బయటకు తీసేందుకు ఐదుగురు బావిలోకి దిగారు. వారిని బయటకు తీసుకొస్తున్న క్రమంలో మరో ఇద్దరు కూడా విషవాయువులతో ఊపిరాడక అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. వీరిలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన గొగ్గలి రాంబాబును భద్రాచలం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతడి పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. మొదట బావిలోకి దిగిన వలస కార్మికులను బయటకు తీసుకురాగానే బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో కావాసి జోగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బుద్ధరామ్ భద్రాచలంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు. మృతులిద్దరూ ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లా కాంకిపార గ్రామానికి చెందినవారుగా గుర్తించారు. ఈ ఫ్యాక్టరీలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పది మంది కార్మికులు పని చేస్తున్నారు. సోదరులిద్దరూ ఒకేసారి మృత్యువాత పడటంతో అక్కడున్న వారిలో విషాదం నెలకొంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



బావిలో పడిపోయిన కావాసి జోగా, బుద్ధరామ్

క్లుప్తంగా

అప్పటిదాకా పోటీచేయను

శ్రీనగర్: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్ తొలగించిన ఆర్టికల్ 370ను పునరుద్ధరించే దాకా తాను శాసనసభ సమరంలో అడుగుపెట్టబోనని పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) చీఫ్ మెహబూబా ముఫ్తీ స్పష్టంచేశారు. జమ్మూకశ్మీర్ మాజీ సీఎం అయిన మెహబూబా బుధవారం పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. ' రద్దయిన ఆర్టికల్‌ను పునరుద్ధరించే వరకు జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగను. ఇది సరైన నిర్ణయం కాదని నాకూ తెలుసు. కానీ ఇది భావోద్వేగంతో తీసుకున్న కఠిన నిర్ణయం. ఎన్నికైన ప్రభుత్వం ఉంటే తమ రహస్య ఎజెండా కార్యరూపం దాల్చదనే భయంతోనే బీజేపీ ప్రభుత్వం ఆ ఆర్టికల్‌ను తొలగించింది. 'ఆర్టికల్‌ను రద్దుచేసి కశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామని కేంద్రం చెబుతోంది. అసెంబ్లీ ఎన్నికల కంటే పంచాయితీ ఎన్నికలే ప్రజాస్వామ్యానికి అసలైన గీటురాయి అన్నపుడు ప్రధాని, హోం మంత్రి వంటి వేరే పదవులు ఎందుకు ? వాళ్లు ఏం చేస్తున్నట్లు ?. కశ్మీర్ ప్రజలను బలహీనపరచి తమ ముందు సాగిలపడేలా చేయాలని కేంద్రం కుట్ర పన్నింది' అని ఆరోపించారు.

మనీశ్ సిసోడియాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) సీనియర్ నాయకుడు మనీశ్ సిసోడియాను 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈడీ కస్టడీ ముగియడంతో అధికారులు ఆయనను కోర్టులో ప్రవేశపెట్టారు. సిసోడియాను ఏప్రిల్ 5 దాకా జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తున్నట్లు ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ ప్రకటించారు. మనీ లాండరింగ్ వ్యవహారంలో ఈడీ అధికారులు ఆయనను ఏడు రోజులపాటు విచారించారు. ఇక సీబీఐ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సిసోడియా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ప్రత్యేక కోర్టు ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది.

పాకిస్తాన్ భూకంపంలో 12 మంది బలి

ఇస్లామాబాద్: రిక్టర్ స్కేల్‌పై 6.8గా నమోదైన భారీ భూకంపం పాకిస్తాన్‌ను వణికించింది. భూప్రకంపనల ధాటికి 12 మంది మరణించారు. అఫ్గాన్-పాక్ సరిహద్దులోని ఖైబర్ పఖ్తూంక్వా ప్రావిన్స్‌లో 9 మంది, ఇస్లామాబాద్‌లో ఇద్దరు, అబోతాబాద్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. అఫ్గానిస్తాన్‌లో ముగ్గురు మరణించారు. భూకంపం వల్ల అఫ్గానిస్తాన్, పాకిస్తాన్‌లో దాదాపు 200 మంది గాయపడ్డారని అధికారులు బుధవారం ప్రకటించారు.

ఇద్దరు మిత్రులు సాధించిందేమిటి?

పశ్చిమ దేశాలపై చైనా, రష్యా అధ్యక్షుల కన్నెర్ర

అమెరికాపై వ్యతిరేకతే అజెండా	పుతిన్, జిన్‌పింగ్ సంకేతాలు	సైనిక సహకారంపైనే ఆసక్తి	ఉక్రెయిన్ సంక్షోభంపై నోరెత్తని జిన్‌పింగ్



ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలకడమే లక్ష్యంగా ఇరు దేశాల మధ్య శాంతి చర్చల కోసం తన వంతు సహకారం అందిస్తానన్న ప్రకటనతో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రష్యా పర్యటన ప్రారంభించారు. శాంతి ప్రణాళికతో వచ్చానని చెప్పారు. తన బృందంతో కలిసి మూడు రోజులపాటు రష్యా రాజధాని మాస్కోలో మకాం వేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో, ఆయన బృందంతో సుదీర్ఘంగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, వ్యాపారం, వాణిజ్యం వంటి రంగాల్లో పరస్పర సహకారం కోసం చైనా-రష్యా పదికిపైగా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అండగా ఉంటానని పుతిన్‌కు జిన్‌పింగ్ అభయ హస్తం ఇచ్చారు. ఉక్రెయిన్‌పై ఏకపక్షంగా దండయాత్రకు దిగిన రష్యా పశ్చిమ దేశాల ఆంక్షల కారణంగా ప్రపంచంలో దాదాపు ఏకాకిగా మారింది. మరోవైపు ఉక్రెయిన్‌లో యుద్ధ నేరాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో పుతిన్‌పై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ) అరెస్ట్ వారెంటు జారీ చేసింది. రష్యా నుంచి బయటకు రాగానే పుతిన్‌ను అరెస్టు చేయడం తథ్యమని చెబుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రష్యాలో పర్యటించారు. పుతిన్‌కు స్నేహహస్తం అందించారు. జిన్‌పింగ్ రష్యాలో ఉన్న సమయంలోనే అమెరికా మిత్రుడైన జపాన్ ప్రధానమంత్రి ఫ్యుమియో కిషిదా ఉక్రెయిన్‌లో అడుగుపెట్టడం గమనార్హం. చైనా, రష్యా మధ్య బంధాన్ని పటిష్టం చేసుకోవడంతోపాటు ప్రపంచ దేశాలపై అమెరికా, దాని మిత్రదేశాల పెత్తనం ఇకపై చెల్లదన్న సంకేతాలు ఇవ్వడమే జిన్‌పింగ్, పుతిన్ భేటీ వెనుక ఉన్న అసలు ఉద్దేశమని నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఐదు కీలక అంశాలు ఉన్నాయని అంటున్నారు. అవేమిటో చూద్దాం..

ఉక్రెయిన్‌పై చొరవ సున్నా

ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించే విషయంలో జిన్‌పింగ్ ఏమీ సాధించలేకపోయారు. యుద్ధాన్ని ముగించేలా రష్యాపై ఒత్తిడి పెంచలేదు. కనీసం ఆ విషయాన్ని కూడా ప్రస్తావించలేదు. ఉక్రెయిన్‌లో హింస, అమాయక ప్రజల మరణాలపై మాట మాత్రంగానైనా స్పందించలేదు. ఉక్రెయిన్‌లో ఉద్రిక్తతలను పెంచే చర్యలకు దూరంగా ఉండాలంటూ జిన్‌పింగ్, పుతిన్ సంయుక్తంగా పశ్చిమ దేశాలకు హితబోధ చేశారు. ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, భద్రతను, ప్రయోజనాలను గౌరవించాలని సూచించారు. శాంతికి చొరవ చూపుతానన్న జిన్‌పింగ్ ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పుతిన్‌తో భేటీలో ఆ ఊసే ఎత్తలేదు. ఉక్రెయిన్ నుంచి ఇప్పటికిప్పుడు తమ సైన్యాన్ని వెనక్కి రప్పించే ప్రతిపాదన ఏదీ లేదని పుతిన్ తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యకు పశ్చిమ దేశాల రెచ్చగొట్టే చర్యలే కారణమని చైనా, రష్యా చాలా రోజులుగా ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

- సాక్షి, నేషనల్ డెస్క్

సైనిక సహకారం, రక్షణ సంబంధాలు

నాటో దేశాలతోపాటు ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్, అమెరికా(ఏయూకేయూఎస్) భద్రతా చట్టం వంటి వాటితో తమకు ముప్పు పొంచి ఉందని చైనా, రష్యా చెబుతున్నాయి. అందుకే పరస్పరం సైనిక సహకారం మరింత పెంపొందించుకోవాలని, రక్షణ సంబంధాలు బలోపేతం చేసుకోవాలని జిన్‌పింగ్, పుతిన్ నిర్ణయించుకున్నారు. ఆసియా ఖండంలో స్థానికంగా ఎదురవుతున్న చిక్కులను పరిష్కరించుకోవడంతోపాటు పశ్చిమ దేశాలకు చెక్ పెట్టడానికి ఇది తప్పనిసరి అని భావిస్తున్నారు. పలు ఆసియా-పసిఫిక్ దేశాలతో అమెరికా సైనిక-రక్షణ సంబంధాలు మెరుగుపడుతుండడం పట్ల ఇద్దరు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికంగా శాంతికి, స్థిరత్వానికి విఘాతం కలిగించే బాహ్య సైనిక శక్తులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని ప్రకటించారు. ఇకపై ఉమ్మడి సైనిక విన్యాసాలు తరచుగా చేపట్టాలని నిర్ణయానికొచ్చారు. తద్వారా తాము ఇరువురం ఒక్కటేనని, తమ జోలికి రావొద్దంటూ ప్రత్యర్థులకు హెచ్చరికలు జారీ చేశారు.

అమెరికా వ్యతిరేక కూటమి

అమెరికాకు వ్యతిరేకంగా తామే ఒక కొత్త కూటమిగా ఏర్పాటు కావడంతోపాటు నూతన వరల్డ్ ఆర్డర్ నెలకొల్పాలన్నదే చైనా, రష్యా ఆలోచనగా నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వరల్డ్ ఆర్డర్ తమ సొంత అజెండాలకు అనుగుణంగా, ప్రయోజనాలను కాపాడేలా ఉండాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. దీనిపై జిన్‌పింగ్, పుతిన్ మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. బహుళ ధ్రువ ప్రపంచం కోసం కృషి చేద్దామని ఉమ్మడి ప్రకటనలో ఇరువురు నేతలు పిలుపునిచ్చారు. అమెరికా పెత్తనం కింద ఏకధ్రువ ప్రపంచానికి కాలం చెల్లిందన్నదే వారి వాదన. జిన్‌పింగ్ చైనాకు బయలుదేరే ముందు పుతిన్‌తో కరచాలనం చేశారు. కలిసి పనిచేద్దామని, అనుకున్న మార్పులు తీసుకొద్దామని చెప్పారు. మన ఆలోచనలను ముందుకు తీసుకెళ్దామని అన్నారు. పశ్చిమ దేశాల శకం ముగిసిందని, ఇకపై చైనా ప్రాబల్యం మొదలుకాబోతోందని జిన్‌పింగ్ పరోక్షంగా వెల్లడించారు.

వ్యాపార, వాణిజ్యాలకు అండ

యుద్ధం మొదలైన తర్వాత తమ దేశం నుంచి వెళ్లిపోయిన పశ్చిమ దేశాల వ్యాపార సంస్థల స్థానంలో చైనా వ్యాపారాల సంస్థలను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామని పుతిన్ చెప్పారు. నాటో దేశాల ఆంక్షల తర్వాత ఎగుమతులు, దిగుమతుల విషయంలో చైనాపై రష్యా ఆధారపడడం పెరుగుతోంది. ఇరు దేశాల నడుమ ఇంధన వాణిజ్యం అభివృద్ధి చెందుతోంది. చమురు, గ్యాస్, బొగ్గు, విద్యుత్, అణు శక్తి వంటి రంగాల్లో ఇరుదేశాల సంస్థలు కలిసికట్టుగా పనిచేసేలా మద్దతు ఇస్తామని జిన్‌పింగ్, పుతిన్ తెలిపారు. కొత్తగా చైనా-మంగోలియా-రష్యా నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు చేపడతామని పుతిన్ వెల్లడించారు.

రష్యాకే మొదటి ప్రాధాన్యం

- ఇతర దేశాలతో సంబంధాలను పణంగా పెట్టయినా సరే రష్యాతో బంధాన్ని కాపాడుకోవాలని చైనా పట్టుదలతో ఉన్నట్లు అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు.
- అమెరికా వ్యతిరేకతే ఏకైక అజెండాగా రెండు దేశాలు ఒక్కటయ్యాయని అభిప్రాయపడుతున్నారు. ఉక్రెయిన్‌కు నాటో దేశాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.
- ఆర్థిక, ఆయుధ సాయం అందిస్తున్నాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం మొదలయ్యాక జిన్‌పింగ్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఒక్కసారి కూడా మాట్లాడలేదు.
- యుద్ధాన్ని ఏనాడూ ఖండించలేదు.
- రష్యాకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తన వైఖరి ద్వారా తేల్చేశారు.

అది స్నేహం, సహకారం, శాంతి యాత్ర: చైనా

బీజింగ్: రష్యాలో చైనా అధినేత షీ జిన్‌పింగ్ పర్యటన బుధవారం ముగిసింది. ఈ పర్యటనను స్నేహం, సహకారం, శాంతి యాత్రగా చైనా అభివర్ణించింది. ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ, ఆర్థిక సాయం అందిస్తుండడాన్ని డ్రాగన్ దేశం తప్పుపట్టింది. ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తతలను ఇంకా రెచ్చగొట్టడానికి అమెరికా కుట్రలు పన్నుతోందని ఆరోపించింది. ఉక్రెయిన్-రష్యా యుద్ధం విషయంలో తాము తటస్థంగానే వ్యవహరిస్తామని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ బుధవారం స్పష్టం చేశారు. ఉక్రెయిన్ విషయంలో తమకు ఎలాంటి స్వార్థపూరిత ప్రయోజనాలు లేవన్నారు. ఈ యుద్ధాన్ని లాభం కోసం వాడుకోవాలన్న ఆలోచన ఎంతమాత్రం లేదని తేల్చిచెప్పారు. జిన్‌పింగ్ రష్యా పర్యటనపై ప్రపంచవ్యాప్తంగా పూర్తి సానుకూల స్పందన వ్యక్తమైందని వెన్‌బిన్ హర్షం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్-రష్యా దేశాల నడుమ శాంతి చర్చల కోసం తాము చొరవ చూపుతున్నామని వివరించారు. ఇదిలా ఉండగా, జిన్‌పింగ్ రష్యా పర్యటన వల్ల తక్షణ ఫలితమేమీ కనిపించలేదు. ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా వెనక్కి తగ్గడం లేదు. శాంతి ప్రణాళికతో రష్యాకు వచ్చానని జిన్‌పింగ్ చెప్పిన సంగతి తెలిసిందే.

బిల్కిస్ కేసు విచారణకు ప్రత్యేక ధర్మాసనం

న్యూఢిల్లీ: గోధ్రా అల్లర్ల బాధితురాలు బిల్కిస్ బానో కేసులో దోషులుగా తేలి జీవితఖైదు అనుభవిస్తున్న 11 మందిని ముందస్తుగా విడుదలచేసిన అంశాన్ని విచారించేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటుచేస్తామని సర్వోన్నత న్యాయస్థానం మరోమారు స్పష్టంచేసింది. బాధితురాలిని గ్యాంగ్‌రేప్ చేసి ఆమె కుటుంబసభ్యులు ఏడుగురిని హత్యచేసిన దోషులకు వర్తింపజేసిన రెమిషన్(ముందస్తు విడుదల)ను వ్యతిరేకిస్తూ బిల్కిస్ తరఫున శోభా గుప్తా సుప్రీంకోర్టులో బుధవారం కేసును వాదించారు. ఈ కేసును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దివాలాల ధర్మాసనం విచారించింది. ' ఈ అంశాన్ని విచారించేందుకు ప్రత్యేకంగా బెంచ్‌ను ఏర్పాటుచేస్తాం' అని సీజేఐ చంద్రచూడ్ గుప్తాకు హామీ ఇచ్చారు. ఈ కేసును వీలైనంత త్వరగా విచారించాలని ఫిబ్రవరి ఏడో తేదీనే బిల్కిస్ న్యాయవాది కోర్టును కోరగా అప్పటి నుంచీ ఈ కేసు కనీసం విచారణకు నోచుకోలేదు. ఫిబ్రవరి 24వ తేదీన విచారణకు వచ్చినా అదే బెంచ్‌లోని జడ్జీలు అనాయాస మరణానికి సంబంధించిన వేరే కేసును విచారించే ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో సభ్యులుగా ఉండటంతో ఈ విచారణ వీలుకాలేదు. యావజ్జీవ ఖైదీలను ముందస్తుగా విడుదల చేయడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని గుజరాత్ రాష్ట్ర సర్కార్ చెప్పడంతో అందుకు అనుమతిస్తూ కోర్టు సమ్మతి తెలపడంతో ఆ ఖైదీలు గత ఏడాది విడుదలయ్యారు.

మళ్లీ హైకమిషన్ వద్ద ఉద్రిక్తత

ఖలిస్తాన్ అనుకూల, భారత వ్యతిరేక నినాదాలు చేసిన వేర్పాటువాదులు • అప్రమత్తతతో దాడి యత్నాన్ని అడ్డుకున్న లండన్ పోలీసులు

లండన్: ఖలిస్తానీ మద్దతుదారుల దాడితో ఘటనకు కేంద్ర బిందువుగా మారిన లండన్‌లోని భారతీయ హైకమిషన్ వద్ద మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం భారతీయ హైకమిషన్‌పై దాడికి తెగబడిన ఘటన మరువకముందే మళ్లీ దాదాపు 2,000 మందితో కూడిన ఆ వేర్పాటువాద మూక అదే భవంతి సమీపానికి చేరుకుంది. ఖలిస్తాన్ అనుకూల, భారత వ్యతిరేక నినాదాలు చేసిన వేర్పాటువాదులు వెంట తెచ్చుకున్న రంగులు వెదజల్లే చిన్న బాణసంచా, నీళ్ల సీసాలు, కొన్ని వస్తువులను హైకమిషన్ భవంతిపైకి విసిరారు. ఆదివారం నాటి దుశ్చర్యతో అప్రమత్తమైన లండన్ పాలనా యంత్రాంగం భారీ సంఖ్యలో పోలీసులను అంతకుముందే అక్కడ మొహరించడంతో వేర్పాటువాదుల భారీ దాడి యత్నాలు ఆచరణలో విఫలమయ్యాయి. అమృత్‌పాల్ అరెస్ట్‌కు కంకణం కట్టుకున్న పంజాబ్ పోలీసుల చర్యను నిరసిస్తూ ఫెడరేషన్ ఆఫ్ సిఖ్ ఆర్గనైజేషన్స్, సిఖ్ యూత్ జతేబందియా వంటి సంస్థలు ఉమ్మడిగా 'నేషనల్ ప్రొటెస్ట్' పేరిట బ్యానర్లు సిద్ధంచేసి భారతీయ హైకమిషన్ వద్ద దాడికి కుట్ర పన్నినట్లు మీడియాలో వార్తలొచ్చాయి. నిరసనకారులను అదుపులోకి తీసుకుని తరలించేందుకు దాదాపు 20 బస్సులను పోలీసులు తెప్పించారు. అప్రమత్తతలో భాగంగా కొందరు పోలీసులను అక్కడి వీధుల్లో కవాతుచేశారు. ఖలిస్తానీవాదులు అక్కడికి రాగానే పంజాబ్‌లో మానవహక్కుల ఉల్లంఘన కొనసాగుతోందని ఇంగ్లిష్, పంజాబీ భాషల్లో మైకుల్లో భారత వ్యతిరేక ప్రసంగాలు ఇచ్చారు. నిరసనకారుల్లో చిన్నారులు, మహిళలూ ఉండటం గమనార్హం. భారత్ తమను వేర్పాటువాదులని, పాక్ ఐఎస్ఐతో కుమ్మక్కయ్యారని ప్రకటించడాన్ని తప్పుబడుతున్నారు.



భారత్ హైకమిషన్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన ఖలిస్తానీ మద్దతుదారులు

అమృత్‌పాల్ సింగ్ విదేశీ నిధులపై పోలీసుల ఆరా

భార్య కిరణ్‌దీప్ కౌర్‌ను ప్రశ్నించిన పంజాబ్ పోలీసులు

అమృత్‌సర్: ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు అమృత్‌పాల్ సింగ్ పోలీసుల కన్నుగప్పి తప్పించుకొని తిరుగుతున్న నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యుల్ని పంజాబ్ పోలీసులు ప్రశ్నించారు. అమృత్‌పాల్ సింగ్ భార్య కిరణ్‌దీప్ కౌర్, ఆయన తండ్రి తర్సేమ్ సింగ్, తల్లిని బుధవారం పోలీసులు విచారించారు. అమృత్‌పాల్‌కు అందుతున్న విదేశీ నిధులపై ప్రశ్నించినట్టుగా తెలుస్తోంది.

ఎవరీ కిరణ్ దీప్ ?

యూకేలో ఎన్నారై అయిన కిరణ్ దీప్ కౌర్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో అమృత్‌పాల్ పెళ్లి చేసుకున్నారు. పెళ్లయిన వెంటనే పంజాబ్‌కు వచ్చిన కిరణ్‌దీప్ ప్రస్తుతం తమ పూర్వీకుల గ్రామం జల్లూపూర్ ఖేదాలో ఉంటున్నారు. పంజాబ్‌లోని జలంధర్ ఆమె స్వగ్రామం. వారిస్ పంజాబ్ దే వారిస్ సంస్థ బాధ్యతల్ని అమృత్‌పాల్ తీసుకున్న కొద్ది నెలలకే కిరణ్‌దీప్‌ను వివాహం చేసుకున్నారు. రివర్స్ మైగ్రేషన్ జరగాలని, వివిధ దేశాల్లో భారతీయుల్ని తిరిగి మాతృదేశానికి రప్పించడమే తన ధ్యేయమని, అందుకే ఎన్నారైని పెళ్లి చేసుకున్నానని అమృత్‌పాల్ అప్పట్లో చెప్పారు. అమృత్‌పాల్ సింగ్, కిరణ్‌దీప్, ఇతర కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్లను పోలీసులు ఇప్పుడు తరచి చూస్తున్నారు. ఆ అకౌంట్లలోకి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయో ఆరా తీస్తున్నారు.



అమృత్‌పాల్‌కు విదేశాల నుంచి వివిధ మార్గాల ద్వారా దాదాపుగా రూ.35 కోట్లు అందినట్టుగా ఆయన అనుచరుడు దిల్‌జిత్ కల్సిని విచారించగా వెల్లడైంది. ఆ డబ్బులతోనే తనకు, తన అనుచరులకు అమృత్‌పాల్ వాహనాలు కొన్నాడు.

రూ.35 కోట్ల విదేశీ నిధులు

అక్రమ ఆయుధాలతో పాటు 35 బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు కొన్నారు. పాకిస్తాన్ ఐఎస్ఐతో కూడా అమృత్‌పాల్‌కు సంబంధాలున్నట్టు పోలీసులు చెబుతున్నారు.



బుధవారం రాష్ట్రపతి భవన్‌లో కేంద్ర మాజీ మంత్రి ఎస్.ఎం.కృష్ణకు పద్మవిభూషణ్ పురస్కారం, గాయని సుమన్ కల్యాణ్‌పూర్‌కు పద్మభూషణ్ పురస్కారం ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

6జీ.. భారత ఆత్మవిశ్వాస ప్రతీక: మోదీ

న్యూఢిల్లీ: దేశంలో 5జీ సాంకేతికత అందుబాటులోకి వచ్చిన కేవలం ఆరు నెలల్లోనే 6జీ టెక్నాలజీపై పరిశోధనలు చేసే స్థాయికి భారత్ ఎదిగిందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ టెలీకమ్యూనికేషన్ సంఘం(ఐటీయూ) ప్రాంతీయ కార్యాలయం, ఇన్నోవేషన్ సెంటర్‌ను బుధవారం ఢిల్లీలో ప్రారంభించిన సందర్భంగా ప్రధాని ప్రసంగించారు. ' దేశంలోకి 5జీ సేవలు మొదలైన 6 నెలల్లోనే 6జీ టెక్నాలజీపై పరిశోధన మొదలవుతోంది. ఇది భారత ఆత్మవిశ్వాసానికి దర్పణం పడుతోంది. 4జీ కంటే ముందు టెలికం సాంకేతికతలో భారత్ కేవలం ఒక యూజర్‌గా ఉండేది. కానీ ఇప్పుడు భారీ టెలికం టెక్నాలజీని ఎగుమతి చేసే దిశగా అడుగులు వేస్తోంది. దేశీయంగా అభివృద్ధిని సాధించిన టెక్నాలజీ వైపు ప్రపంచం దృష్టి సారించింది.

ఇది భారత సాంకేతిక దశాబ్దం

'సమ్మిళిత సాంకేతికత వల్లే డిజిటల్ చెల్లింపులు, ప్రత్యక్ష నగదు బదిలీ, జన్‌ధన్, ఆధార్, బ్రాడ్‌బ్యాండ్ సేవలు సాధ్యమయ్యాయి. టెలికం టెక్నాలజీ భారత్‌లో కేవలం శక్తి మాధ్యమం మాత్రమేకాదు సాధికారతకు సోపానం. ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య 85 కోట్లకు పెరిగింది. దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో మొత్తంగా 25 లక్షల కి.మీ.ల ఆప్టికల్ ఫైబర్ వేశాం. త్వరలో వంద 5జీ ల్యాబ్‌లు ఏర్పాటుచేస్తాం. దేశీయ అవసరాల తీర్చేలా 5జీ అప్లికేషన్లను ఇవి అభివృద్ధిచేస్తాయి. దేశంలో 5జీ సేవలు మొదలైన 120 రోజుల్లోనే 125 నగరాలకు విస్తరింపజేశాం. ఈ దశాబ్దం భారత సాంకేతికదశాబ్దం(టెక్‌ఏడ్)' అని మోదీ అభివర్ణించారు.

అది 'క్లీన్ చిట్' కమిటీ: జైరామ్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ అక్రమాలపై విచారణ కోసం సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీతో ఎలాంటి ఉపయోగం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తేల్చిచెప్పారు. అది ప్రభుత్వానికి క్లీన్ చిట్ కమిటీగా మాత్రమే తోడ్పడుతుందని అన్నారు. అదానీ విషయంలో అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపే అధికారం చట్టపరంగా నిపుణుల కమిటీకి లేదన్నారు. కేవలం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తోనే నిజాలు వెలుగులోకి వస్తాయని తేల్చిచెప్పారు. జైరామ్ బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. దర్యాప్తు సంస్థలను దేశ ప్రయోజనాల కోసమా? వ్యక్తిగత అవసరాల కోసమా? దేని కోసం వాడుకుంటారని ప్రధాని మోదీని ప్రశ్నించారు. 1992లో హర్షద్ మెహతా, 2001లో కేతన్ పరేఖ్ స్కామ్‌లపై విచారణకు జేపీసీ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు అదానీ అక్రమాలపై జేపీసీని నియమించాలని చెప్పారు.

సభలో రాహుల్ గాంధీని మాట్లాడనివ్వండి

లోక్‌సభలో మాట్లాడేందుకు, వివరణ ఇచ్చేందుకు రాహుల్‌కు అవకాశం కల్పించాలని స్పీకర్‌కు జైరామ్ రమేశ్ విజ్ఞప్తి చేశారు. రూల్ 357 కింద సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలంటూ స్పీకర్‌కు రాహుల్ లేఖ రాశారని, దానిపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది కాలమే సమాధానం చెబుతుందన్నారు.

నిరసనగా పోలీసులే బారికేడ్లు తొలగించారు

న్యూఢిల్లీ: లండన్‌లో భారత హైకమిషన్‌కు సరైన భద్రత కల్పించడంలో విఫలమైన బ్రిటిష్ ప్రభుత్వానికి భారత ప్రభుత్వం తన నిరసనను మరోలా తెలియజేసింది. ఖలిస్తానీ మద్దతుదారులు లండన్‌లోని భారత హైకమిషన్ ముందున్న బారికేడ్లు తొలగించి భవనం పైన ఉన్న త్రివర్ణ పతాకాన్ని కిందకు లాగి ఖలిస్తానీ జెండాలు రెపరెపలాడించడం తెల్సిందే. ఈ దుశ్చర్యను వెంటనే తీవ్రంగా ఖండించిన భారత సర్కార్.. ఖలీస్తానీవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. భారత ప్రభుత్వ నిరసనకు కొనసాగింపుగా ఢిల్లీ పోలీసులు ఢిల్లీలోని బ్రిటిష్ హైకమిషన్ కార్యాలయం ముందు ఉన్న బారికేడ్లు అన్నింటినీ పక్కన పడేశారు. ఇవి పాదచారుల బాటకు అడ్డుగా ఉన్నాయని పోలీసులు చెబుతున్నా.. నిజానికి ఇది బ్రిటన్ వైఖరికి సరైన సమాధానంగా తీసుకున్న చర్యగా కొందరు అభివర్ణించడం గమనార్హం. బారికేడ్లు తొలగించిన విషయాన్ని బ్రిటిష్ హైకమిషన్ అధికార ప్రతినిధి వద్ద మీడియా ప్రస్తావించగా.. ' భద్రతకు సంబంధించిన అంశాలపై మేం స్పందించబోం' అని ఆయన అన్నారు.

అప్రమత్తత ముఖ్యం

న్యూఢిల్లీ: గత రెండు వారాలుగా కరోనా పాజిటివ్, ఇన్‌ఫ్లూయెంజా కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో కోవిడ్ పట్ల అప్రమత్తత అత్యవసరమని ప్రధాని మోదీ సూచించారు. కోవిడ్ తాజా పరిస్థితిపై ప్రధాని మోదీ బుధవారం ఢిల్లీలో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 'కోవిడ్ ఇంకా ముగిసిపోలేదు. జన్యుక్రమ విశ్లేషణ కొనసాగించండి. కోవిడ్ నిబంధనావళిని తప్పక పాటించండి. తీవ్ర శ్వాస సంబంధ కేసులు, ఇన్‌ఫ్లూయెంజా, సార్స్-కోవ్2 పరీక్షలు పెంచండి' అని ఉన్నతాధికారులకు సూచించారు.



కోవిడ్ పరిస్థితిపై సమీక్షా సమావేశంలో ప్రధాని సూచన

ఆస్పత్రుల్లో పడకలు, మానవ వనరుల అందుబాటు తదితర సన్నద్ధతలనూ మోదీ సమీక్షించారు. 2020లో జనతా కర్ఫ్యూ పెట్టిన సరిగ్గా మూడేళ్ల తర్వాత అదేరోజు ప్రధాని కోవిడ్ సమీక్షా సమావేశం నిర్వహించడం గమనార్హం. ఎక్కువవుతున్న కోవిడ్ కేసులు, కోవిడ్ మళ్లీ విజృంభిస్తే ప్రజారోగ్య వ్యవస్థ ఏ మేరకు సంసిద్ధంగా ఉందనే వివరాలను ఆయన ఉన్నతాధికారులను అడిగి తెల్సుకున్నారు. ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి రాజేశ్ భూషణ్ దేశంలో కోవిడ్ తాజా పరిస్థితిపై మోదీకి ఒక ప్రజెంటేషన్ చూపించారు. బుధవారం కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం గత 24 గంటల్లో కొత్తగా 1,134 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

బాణసంచా పేలి 9 మంది మృతి

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కాంచీపురం సమీపంలోని కురివి మలైలో బుధవారం బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలుసహా తొమ్మిది మంది మరణించారు. గాయపడిన 12 మందిని ఆస్పత్రిలో చేర్పించారు. మృతుల కుటుంబాలకు తలా రూ.3 లక్షల ఆర్థికసాయం రాష్ట్ర సీఎం స్టాలిన్ ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి తలా రూ.1 లక్ష సాయం అందిస్తామన్నారు. కర్మాగారం నిర్వాహకుడిని అరెస్టు చేశారు.

ఉక్రెయిన్‌పై మళ్లీ నిప్పుల వాన



జపొరిజాజియాలో రష్యా క్షిపణి దాడిలో మంటలంటుకున్న బహుళ అంతస్తుల భవనం

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా సైన్యం మళ్లీ విరుచుకుపడింది. బుధవారం ఉదయం తెల్లవారుజామున క్షిపణులు, డ్రోన్లతో సాధారణ నివాస ప్రాంతాలపై దాడికి దిగింది. ఉక్రెయిన్ నుంచి జపాన్ ప్రధానమంత్రి ఫ్యుమియో కిషిదా, రష్యా నుంచి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ వెళ్లిపోయిన తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. జపొరిజాజియా నగరంలో తొమ్మిది అంతస్తుల అపార్టుమెంట్‌పై రష్యా మిస్సైల్ దాడి వీడియో దృశ్యాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. రాజధాని కీవ్ సమీపంలో విద్యార్థుల వసతి గృహంపై రష్యా సైన్యం దాడి చేయడంతో నలుగురు మృతిచెందారు. 20 మందికిపైగా గాయపడ్డారు. కీవ్‌కు దక్షిణాన ఉన్న రిజీసిచివ్ సిటీలో ఓ ఉన్నత పాఠశాల, రెండు డార్మిటరీలు సైతం పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఓ డార్మిటరీ ఐదో అంతస్తు నుంచి 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని వెలికితీశారు. మొత్తం ఎంతమంది చనిపోయారన్నది ఇంకా తెలియరాలేదు. రష్యా 21 డ్రోన్లను ప్రయోగించగా, అందులో తాము 16 డ్రోన్లను కూలిచ్చేశామని ఉక్రెయిన్ సైనిక వర్గాలు వెల్లడించాయి. రష్యా ఒకవైపు శాంతి చర్చలు అంటూనే మరోవైపు భీకర దాడులకు ఆదేశాలకు జారీ చేస్తోందని జెలెన్‌స్కీ మండిపడ్డారు. పౌరుల నివాసాలపై రష్యా క్షిపణి దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రష్యాలో మూడు రోజుల పర్యటన ముగించుకొని బుధవారం స్వదేశానికి తిరిగివచ్చారు. జపాన్ ప్రధాని కిషిదా ఉక్రెయిన్ నుంచి పోలాండ్‌కు చేరుకున్నారు.

సాక్షి
కరీంనగర్
గురువారం । 23 । మార్చి । 2023



రాజన్నకు ఉగాది పూజలు

వేములవాడ: రాజన్నను బుధవారం ఉగాది పండుగ సందర్భంగా చెందిన 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.



గజవాహనంపై విహారం

వేములవాడ: రాజన్న సన్నిధిలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి ఉత్సవమూర్తులను గజవాహనంపై ఊరేగించారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

వైభవంగా ఉగాది వేడుకలు

కరీంనగర్/కరీంనగర్‌కల్చరల్: శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు, ఉగాది పచ్చడి స్వీకరణ, కవిసమ్మేళనాలు నిర్వహించారు.కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఉగాది కవిసమ్మేళనం, పంచాంగ శ్రవణం , పుస్తకావిష్కరణలో మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురాణం మహేశ్వర శర్మ పంచాంగ శ్రవణం, రాశి ఫలాలను వివరించారు. పలువురు కవులు తమ కవితలు వినిపించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మేయర్ వై.సునీల్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్యాం ప్రసాద్‌లాల్ పాల్గొన్నారు. మహాశక్తి ఆలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు,ఎంపీ బండి సంజయ్ పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. పద్మనాయక కల్యాణ మండపంలో నిర్వహించిన ఉగాదివేడుకలకు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు, డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, సుంకిశీల సంపత్‌రావు, కాంగ్రెస్ నాయకుడు మేనేని రోహిత్‌రావు, వెలమ సంఘం ప్రతినిధులు డాక్టర్ బీఎస్.రావు పాల్గొన్నారు. సద్భావనాఫోరం, శ్రీవేంకటేశ్వరకాలనీ, రాజీవ్ పార్క్ కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో 'సర్వమత సమ్మేళనం'నిర్వహించారు.జిల్లాకేంద్రంలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



పంచాంగ పఠనం చేస్తున్న పండితుడు



మహాశక్తి ఆలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు



మహాశక్తి ఆలయంలో పాల్గొన్న బండి సంజయ్



కలెక్టరేట్‌లో పాల్గొన్న మంత్రి కమలాకర్, వినోద్‌కుమార్, కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, తదితరులు



ఆడిటోరియంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

రంజాన్ వేళలు

ఎవరైతే ఇతర మానవులపై
కరుణ, ప్రేమ చూపరో వారిని
అల్లా(దేవుడు)సైతం కరుణించడు
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
గురు : 6:32	శుక్ర 4:53

న్యూస్‌రీల్

ఇంటర్‌లో అవకాశం కల్పించాలి

చొప్పదండి: సీబీఎస్ఈ విధానంలో సైనిక శిక్షణ విద్యాలయంలో పదోతరగతి వరకు చదివిన విద్యార్థులకు ఇంటర్‌లో కొనసాగింపు లేకపోవడంతో నష్టపోతున్నారని వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. తమ పిల్లలకు ఇంటర్‌లో కొనసాగింపు అవకాశం కల్పించాలని కోరుతూ సైనిక శిక్షణ విద్యాలయం ప్రిన్సిపాల్ లచ్చయ్యకు వినతిపత్రం ఇచ్చారు. సైనికశిక్షణ పాఠశాలలో పదోతరగతి వరకు చదివిన విద్యార్థులు, ఇంటర్‌లోనూ సైనిక శిక్షణ పాఠశాలలో కొనసాగాలంటే మళ్లీ ప్రవేశ పరీక్ష రాయాల్సిన నిబంధనల ఉందని తెలిపారు. ఇంటర్ ప్రవేశ పరీక్షకు కొందరి వయసు నిబంధన అడ్డు వచ్చి రాయలేక పోతున్నారని అన్నారు.పదోతరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్ చదివిన విద్యార్థులకు ఇంటర్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ ద్వారా నిర్వహిస్తుండటం శాపంగా మారిందన్నారు. ఇంటర్మీడియట్‌లో అదనపు సెక్షన్ ఏర్పాటు చేసి ఆసక్తి గల పదోతరగతి విద్యార్థులకు చదువు కొనసాగించాలని కోరారు.

నేటి కంటివెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో గురువారం 48ప్రాంతాల్లో కంటివెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో జువేరియా ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని 1, 6, 8, 12, 15, 18, 41, 45, 46, 49, 53, 58 డివిజన్లలో, హుజూరాబాద్ పట్టణంలో 6,16 వార్డులు, మండలంలోని కాట్రపల్లి, సిరసపల్లి గ్రామాలు, జమ్మికుంట పట్టణంలోని 10వ వార్డు, మండలంలోని నాగంపేట, మడిపల్లి, వీణవంక మండలం ఎలబాక, పోతిరెడ్డిపల్లి, కనపర్తి, చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి, ఇందుర్తిలో శిబిరాలు నిర్వహించనున్నారు. చొప్పదండి వార్డునంబర్ 12, కాట్నపల్లి, రాగంపేట, ఇల్లందకుంట మండలం చిన్నకోమటిపల్లి, మల్యాల, గంగాధర మండలం ఒద్యారం, వెంకటయ్యపల్లి, ఉప్పర మల్యాల, రామడుగు మండలం దేశరాజ్‌పల్లి, గోలిరామయ్యపల్లి, కొత్తపల్లి మండలం కమాన్‌పూర్, కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్, మొగ్దుంపూర్, నగునూర్, మానకొండూరు మండలం శ్రీనివాసనగర్, కొండపల్కల, పచ్చునూర్, సైదాపూర్ మండలం దుద్దెనపల్లి, అమ్మనగుర్తి, కేశపట్నం మండలం ఎరడపల్లి, ములంగూర్, తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, బాలయ్యపల్లి, గన్నేరువరం మండలం హన్మాజిపల్లిలో శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆదుకోండి సారూ..



లక్ష్మీపూర్‌లో సీఎం కేసీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు



- నేడు సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన
- రామడుగు మండలంలోని పలు గ్రామాల్లో..
- దెబ్బతిన్న పంటలను పరిశీలించనున్న ముఖ్యమంత్రి
- బాధిత రైతులతో మాట్లాడనున్న చంద్రశేఖర్‌రావు
- ఏర్పాట్లు పర్యవేక్షించిన కలెక్టర్, పోలీస్ కమిషనర్

మంత్రి గంగుల సమీక్ష

సీఎం కేసీఆర్ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షించారు. రామడుగు మండలంలో పంటనష్టాన్ని పరిశీలించడానికి సీఎం కేసీఆర్ రానున్న నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రామడుగు మండలంతో పాటు జిల్లావ్యాప్తంగా జరిగిన పంటనష్ట నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మేయర్ సునీల్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు ఉన్నారు.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/రామడుగు: ఇటీవల కురిసిన వడగండ్ల వానలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో సీఎం పర్యటించనున్నారని అధికారులు వెల్లడించారు. జిల్లాలోని 12మండలాల్లో అకాలవర్షాలతో దాదాపు 14వేల ఎకరాలలో రూ.100కోట్ల వరకు నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ముఖ్యంగా రామడుగు మండలంలో పంటల మార్పిడిలో భాగంగా ఇటీవల వేసిన పలు వాణిజ్య పంటలైన మస్క్‌మిలాన్, డ్రాగన్ ఫ్రూట్, ఖర్బూజ, మామిడితోపాటు టమాట, బీర, కాకర, మిర్చి, పాలకూర, బెండ దారుణంగా దెబ్బతిన్నాయి. మొత్తంగా చొప్పదండి నియోజకవర్గంలో దాదాపు మూడు వేల ఎకరాలకుపైగా పంటలు దెబ్బతిన్నాయని సమాచారం.

మధ్యాహ్నం సీఎం పర్యటన

- గురువారం మధ్యాహ్నం అనంతరం రామడుగుకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు. రామచంద్రపూర్, చిప్పకుర్తి, లక్ష్మీపూర్ గ్రామాలకు రోడ్డు మార్గాన వెళ్తారు. అక్కడ వడగండ్ల కారణంగా దెబ్బతిన్న పంటలు పరిశీలిస్తారు.
- అనంతరం రైతులతో మాట్లాడి తిరిగి అక్కడ నుంచే హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు వెళ్తారని అధికారులు వివరించారు. మరో వైపు సీఎం పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.
- పోలీసు కమిషనర్ సుబ్బారాయుడు నేతృత్వంలో పోలీసులు సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్, భద్రతలపై చర్చించారు. సీఎంకు నిరసనలు తెలిపే అవకాశం ఉందన్న కొందరునేతలను ముందస్తుగా హౌస్‌అరెస్టుచేసే యోచనలో ఉన్నారని సమాచారం.
- కలెక్టర్ కర్ణన్ కూడా ఏర్పాట్లు పర్యవేక్షించారు. లక్ష్మీపూర్ గాయత్రీ పంపుహౌజ్ వద్ద ఉన్న హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో రామడుగు మండలంలోని అకాల వర్షాల ప్రభావిత గ్రామాలలో బుధవారం పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు.
- జిల్లా వ్యాప్తంగా దాదాపు 14వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిన నేపథ్యంలో తమను ఎలాగైనా ఆదుకోవాలని రైతాంగం విన్నవిస్తోంది. ఆరుగాలం శ్రమించిన పంట, పెట్టుబడి మొత్తం అకాల వర్షం దెబ్బకు కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట వడగండ్ల పాలైంది



మరోవారం రోజుల్లో మార్కెట్‌కు తరలించాల్సిన మస్క్ మిలాన్, కర్బూజ పంటలు కళ్ల ముందే వడగండ్ల వర్షంతో పాడైపోయాయి. దాదాపుగా రూ.12 లక్షల పెట్టుబడి పెట్టి మస్క్ మిలాన్ 10 ఎకరాల్లో సాగు చేశాను. 4ఎకరాలలో కర్బూజ, 6 ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్, పది ఎకరాలలో వరి సాగు చేశాను. వడగండ్లతో నాకు రూ.కోటిపైగా నష్టం వచ్చింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– ద్యావ రాంచెంద్రారెడ్డి, రైతు, లక్ష్మీపూర్

కూరగాయల పంటలకు దెబ్బ



టమాట, బీర, కాకర, మిర్చి, పాలకూర, బెండకాయ కూరగాయల పంటలను మూడు ఎకరాలలో సాగు చేశాను. వడగండ్ల వర్షంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పదిహేను రోజులైతే కూరగాయలు మార్కెట్‌కు తీసుకెళ్లేవాడ్ని. పెట్టుబడి రూ.70వేలు పెట్టిన. రూ.నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల వరకు నష్టం వచ్చింది. ప్రభుత్వం పరిహారం అందించి అందుకుంటే రుణపడి ఉంటాం.

నారెడ్డి మధుకర్‌రెడ్డి, రైతు, లక్ష్మీపూర్

మామిడి మొత్తం రాలింది



ఎనిమిది ఎకరాలలో మామిడి తోట మంచిగా కాపు వచ్చింది. ఈ సారి మంచి ఫలితాలు ఉంటాయనుకుంటే అకాలవర్షం నిండా ముంచింది. తోటలో మామిడి కాయలు 70శాతం వరకు రాళ్ల దెబ్బలకు రాలిపోయాయి. వడగండ్ల వర్షం తీరని నష్టం చేసిపోయింది. ప్రభుత్వమైన మాపైన దయ చూపి పరిహారం అందించాలి.

– బాపురెడ్డి, రైతు, లక్ష్మీపూర్

రైతులకు రూ. 5కే అన్నం

- వ్యవసాయ మార్కెట్లలో అమలుకు సన్నాహాలు
- ప్రభుత్వ నిర్ణయంతో అన్నదాతల్లో హర్షం



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్లో భోజనం వడ్డింపు(ఫైల్)

కరీంనగర్ అర్బన్: వ్యవసాయ మార్కెట్ యార్డులు, రైతు బజార్లలో అన్నదాతల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మార్కెట్లలో పొద్దస్తమానం పడిగాపులు కాసి ఇబ్బందులు పడే రైతులకు రూ.5కే ఆహారం అందించాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే పట్టణాల్లో అన్నపూర్ణ పథకం పేరుతో రూ.5కే భోజనం అందిస్తుండగా ఒక్కో భోజనానికి ప్రభుత్వం రూ.21 రాయితీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో మార్కెట్లలోనూ అమలు చేసేందుకు త్వరలో విధి విధానాలు ఖరారు చేయనుంది. అన్నపూర్ణ భోజన పథకాన్ని జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లతో పాటు రైతు బజార్లలోనూ అమలు చేయనున్నారు. సంవత్సరానికి సుమారు 300ల రోజులు మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుగుతుండగా నిత్యం వందల సంఖ్యలో రైతులు వస్తుంటారు.

వేల మందికి ప్రయోజనం

జిల్లాలో జమ్మికుంట మార్కెట్లో అత్యధికస్థాయిలో క్రయ,విక్రయాలు జరుగుతుండగా తదుపరి కరీంనగర్, గంగాధర, మానకొండూరు మార్కెట్లలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు జరుగుతాయి. చొప్పదండి, గోపాల్‌రావుపేట, హుజూరాబాద్ మార్కెట్లలో ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతుంటాయి. రూ.5 భోజన పథకం ద్వారా వ్యవసాయ మార్కెట్లలో సుమారు లక్ష మంది వరకు భోజనం వడ్డించనున్నారు. 300 పనిదినాలకు గానూ రోజూ అన్ని మార్కెట్లు కలిపి 800 మంది చొప్పున వడ్డించినా ఏడాదికి 24 లక్షల మందికి భోజనం అందనుంది. పంట విక్రయ సమయంలో అన్నదాతలు మార్కెట్లలో రెండు మూడురోజుల వరకు ఉండాల్సి వస్తోంది. ఇంటి నుంచి భోజనం రావాలంటే దూరభారంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. మార్కెట్ల సమీపంలో భోజన సదుపాయం లేకపోవడంతో ఆకలితో అలమటించాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఎంతోమంది రైతులు భోజనానికి ఇబ్బందులు పడుతుంటారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రూ.5కే భోజనం అందించేందుకు ప్రణాళికలు చేస్తోంది.

రైతుబజార్లలో కూడా..

జిల్లా కేంద్రంలో రెండు రైతు బజార్లున్నాయి. నగరంలోని శనివారం అంగడి వద్ద, కశ్మీర్‌గడ్డ వద్ద రైతు బజార్లుండగా నిత్యం వందల మంది రైతులు కూరగాయలు తీసుకొస్తారు. వ్యాపారులు బయటకు వెళ్లి భోజనం చేసే తీరిక ఉండదు. ఒకవేళ వెళ్లినా అల్పాహారం తిని సర్దుకుంటున్నారే తప్ప కడుపు నిండా తినడం లేదు. రైతుబజార్లలో కూడా రూ.5కే భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంఘాల వారు ముందుకొస్తే ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

కరీంనగర్ మార్కెట్‌లో అమలు

కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో ఇప్పటికే ఉచిత భోజనం సౌకర్యం కల్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మధు ప్రత్యేక చొరవ తీసుకుని భోజనాన్ని అందిస్తున్నారు. ఉచిత భోజనం సౌకర్యం కల్పించడంతో పంట ఉత్పత్తులు అధికంగా వస్తున్నాయి. నాణ్యమైన భోజనంతో పాటు విశ్రాంతి భవనం, శుద్ధజలం ఏర్పాటు చేశారు.

నిరంతరం కొనసాగించాలి



మార్కెట్లలో భోజన పథకాన్ని నిరంతరం కొనసాగించాలి. పొద్దున ధాన్యం తెచ్చి రోజుల తరబడి మార్కెట్‌కు వచ్చి వెళ్లాల్సి ఉంటుంది. ఉదయం ఇంటి వద్ద తినొచ్చామంటే మళ్లీ రాత్రి తినేవాళ్లం. మధ్యాహ్నం సమయంలో భోజన సౌకర్యం కల్పించడం శుభ పరిణామం.

– లక్ష్మి, మహిళా రైతు, గోపాల్‌పూర్


సంతోషదాయకం



మార్కెట్ యార్డుల్లో రూ.5కే భోజన వసతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకం. ఆదేశాలు రాగానే అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. గతంలో కూడా ఏర్పాటుకు సన్నాహాలు చేశాం. ఈసారి ప్రభుత్వమే ముందుకు రావడం హర్షణీయం.

– రెడ్డవేణి మధు, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్

పంట అమ్మాలంటే రూ.700 ఖర్చు



గత యాసంగి పంటను అమ్ముదామని మార్కెట్‌కు వస్తే రూ.700 తిండికే ఖర్చయింది. సరిగా నీళ్లుండవు. భోజనం తినాలంటే బయట హోటళ్లకు వెళ్లాలి. అపుడు 7 రోజులుంటే రూ.700 ఖర్చయింది. కానీ రూ.5కే భోజనం నిర్ణయంతో రైతులకు ఎంతో మేలు.

– కిషన్, రైతు, బొమ్మకల్

జాతీయ విపత్తుగా గుర్తించాలి

- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్



పంటను పరిశీలిస్తున్న పొన్నం ప్రభాకర్

రామడుగు: వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతుల పంటలను గుర్తించి, కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు కింద పరిహారం అందించేలా ఎంపీ బండి సంజయ్‌కుమార్ కృషి చేయాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొన్నం ప్రభాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. రామడుగు మండలం రాంచంద్రాపూర్, చిప్పకుర్తి, గుండి, దత్తోజీపల్లి గ్రామాల్లో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు హామీలు ఇవ్వకుండా, తక్షణ పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు అందించిన విధంగా పంటలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సత్యప్రసన్న, బీసీ సెల్ చైర్మన్ పులి అంజనేయులుగౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, నాగి శేఖర్, పంజాల శ్రీనివాస్‌గౌడ్, కాడె శంకర్, బుచ్చయ్య, రాజిరెడ్డి, తిరుపతి, రాజేశం, మాధవరెడ్డి ఉన్నారు.

పంజాబ్‌ల కాదు.. ఇక్కడి రైతులను ఆదుకోండి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

వీణవంక: సీఎం కేసీఆర్ ఎక్కడో పంజాబ్ రైతులకు డబ్బులు ఇచ్చుడు కాదు.. పంటనష్టపోయి నిండా మునిగి బాధలో ఉన్న ఇక్కడి రైతులను ఆదుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం వీణవంక మండలం హిమ్మత్‌నగర్, రామకృష్ణపూర్, బ్రహ్మణపల్లి, మామిడాలపల్లి, కోర్కల్, చల్లూరు, రెడ్డిపల్లి గ్రామాల్లో అకాలవర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అకాలవర్షం సృష్టించిన బీభత్సం రైతులకు కడగండ్లు మిగిల్చిందన్నారు. వేల ఎకరాల్లో మొక్కజొన్న మిరుప, వరి పొలాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఇంత విపత్తు జరిగినా ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని, అధికారులు తూతూమంత్రంగా వచ్చిపోతున్నారని, కనీస భరోసా ఇవ్వడం లేదని ఆరోపించారు. కేంద్రం ఇచ్చే ఫసల్ బీమాను రాష్ట్రంలో అమలు చేయడం లేదని, వెంటనే పంటనష్టం అంచనావేసి, ఎకరాకు రూ.50వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

శ్రేయస్సు కోరేదే నిజమైన కవిత్వం



మాట్లాడుతున్న వక్తలు

కరీంనగర్: కవి విశ్వనరుడిగా మారి విశ్వశ్రేయస్సు కాంక్షించి రాసిన కవిత్వం మాత్రమే సమాజం ఉన్నంతకాలం ఆ సాహిత్యం, ఆ కవి నిరంతరంగా వెలుగొందుతూ ఉంటాడని అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. బుధవారం తెలంగాణ సాహితీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శ్రీనిధి దాసరి గార్డెన్‌లో ఉగాది పండుగను పురస్కరించుకొని 'కవిస్వరం' పేరుతో కవి సమ్మేళనం నిర్వహించారు. అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ కవులు సంకుచిత భావజాలాన్ని వదిలి సమాజహితం కోరి సత్యం శాస్త్రీయత పునాదిగా రాసే కవితలు కవులు తరతరాల వరకు నిలిచి ఉంటారన్నారు. 100 మంది వరకు కవులు, కవయిత్రులు, చిన్నారులు తమ కవితలు వినిపించడం ఆసక్తి కలిగించిందని అన్నారు. కార్పొరేటర్ సుధగోని మాధవికృష్ణగౌడ్ మాట్లాడుతూ సాహిత్యాన్ని గౌరవించడం అంటే మంచి సమాజ నిర్మాణాన్ని కాంక్షించడం అన్నారు. నృత్య కళాకారిణి సమత బృందం వృషాబాది భరత నాట్య మండలి పిల్లలు రూపక ప్రదర్శన ఆకట్టుకుంది. తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జిల్లా అధ్యక్షుడు రమణచారి, ప్రధాన కార్యదర్శి మానువాడ శంకర్, గౌరవ అధ్యక్షుడు ఆడెపు రాంనారాయణ, ఎదుల్ల రాజశేఖర్ ఉన్నారు.

క్లుప్తంగా

గుడుంబా పట్టివేత



పోలీసుల అదుపులో నిందితుడు

జమ్మికుంట: గుడుంబా తయారుచేసి, రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదుచేసినట్లు ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ బుధవారం తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శంకరపట్నం మండలం మెట్టుపల్లికి అంగిడి రమేశ్ గుడుంబా తయారుచేసి, జమ్మికుంట పట్టణంలో అమ్మేందుకు అక్రమ రవాణా చేస్తున్న క్రమంలో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. 10 లీటర్ల గుడుంబాతో పాటు మోపెడ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారుచేసినా, విక్రయించినా రవాణాచేసినా కేసులు నమోదుచేస్తామని రూ. లక్ష జరిమానాతో పాటు నిందితుడిని బైండోవర్ చేస్తామని హెచ్చరించారు.నిందితుడిని పట్టుకున్న ఎస్సై కబీర్‌దాస్, కానిస్టేబుల్ విశ్వజ్ఞలను అభినందించారు.

సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలి



మాట్లాడుతున్న జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి(మంథని): శోభకృత్ నామ సంవత్సరంలో కార్మికులు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు కోరారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉగాది సందర్భంగా ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ వద్ద బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మికులకు సీఅండ్ఎండీ నడిమెట్ల శ్రీధర్ సందేశాన్ని చదివి వినిపించారు. ఎనిమిదేళ్లలో సింగరేణి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. గని మేనేజర్ జనార్దన్, సేఫ్టీ ఆఫీసర్ రమేశ్, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ దాసరి మల్లేశ్, ఇతర అధికారులు, వివిధ పార్టీల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

యూనియన్ ఆవిర్భావానికి 25 ఏళ్లు పూర్తి



జ్ఞాపిక అందిస్తున్న యూనియన్ సభ్యులు

రామగుండం: తెలంగాణ స్టేట్‌పవర్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌పీఈయూ–1535) ఆవిర్భవించి బుధవారంతో 25 ఏళ్లు పూర్తయినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం కుమారస్వామి తెలిపారు. ఈమేరకు రామగుండం బీ–థర్మల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్‌కు యూనియన్ ప్రతినిధులు జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ తఖీ, రామగుండం బ్రాంచి అధ్యక్షుడు అబ్దుల్ నజ్మీ, సమియొద్దీన్, శ్రీనివాస్, ఖమరొద్దీన్, నయింపాషా, స్వామి, రాధ,లక్ష్మి, సరోజన తదితరులున్నారు.

ప్రాణం తీసిన స్థిరాస్తి గొడవ

- కరీంనగర్‌లో వ్యక్తి దారుణహత్య
- కొన్నాళ్లుగా కొనసాగుతున్న భూ వివాదం
- పథకం ప్రకారమే హత్య.. కుటుంబ సభ్యుల ఆరోపణ
- కేసు నమోదు చేసి లోతుగా విచారిస్తున్న పోలీసులు
- అదుపులో ఎనిమిది మంది.. కాల్‌డేటా పరిశీలన



హత్యకు గురైన అమిరిశెట్టి నరేందర్



నరేందర్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: పండుగపూట నగరంలో విషాదం నెలకొంది. సంతోషంగా ఉగాది వేడుక జరుపుకుంటున్న సందర్భంలో ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. భూ వివాదంలో కక్ష పెంచుకొని ఓ వ్యక్తిని గొంతుకోసి దారుణంగా హత్యచేసిన ఘటన భయాందోళనకు గురిచేసింది. కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సంతోశ్‌నగర్‌లో నివాసిస్తున్న పురంశెట్టి నర్సింగరావు– లక్ష్మీ దంపతులకు ఇద్దరు కొడుకులు. చిన్నకొడుకు నరేందర్‌రావు(40) గతంలో ఆస్ట్రేలియాలో చదివి 2009లో స్వస్థలానికి వచ్చాడు. హైదరాబాద్‌కు చెందిన అనూషతో వివాహం కాగా.. కూతురు ఉంది. రెండు నెలల క్రితం వరకు జార్ఖండ్‌లో సింగరేణిలో ప్రయివేటు ఉద్యోగం చేసి ఇటీవల కరీంనగర్‌కు వచ్చి ఖాళీగా ఉంటున్నాడు. బుధవారం ఉదయం తన ఇంట్లో మటన్ ఇచ్చి, 9 గంటల సమయంలో బయటకు వెళ్లాడు. మధ్యలో తన తండ్రి నర్సింగరావు ఫోన్ చేసి త్వరగా ఇంటికి రమ్మని సూచించాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పీటీసీ కాలేజ్ రోడ్డు దగ్గరలోని నిర్మానుష్య ప్రదేశంలో ఓ పాతస్కూల్ వద్ద గొంతుకోసి హత్యకు గురై నరేందర్‌రావు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి సీసీ కెమెరాలు పరిశీలించి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తన కుమారుడు నరేందర్‌రావుకు విద్యానగర్‌కు చెందిన బోనాల అజయ్, అభిషేక్, రాజిరెడ్డి, సత్తి, రాజేందర్, శేఖర్, శ్రీను, ఆదిరెడ్డితో వివాదాస్పద భూముల గొడవలున్నాయని, సదరు భూమి విషయంలో బలవంతంగా సంతకం చేయకపోయేసరికి కక్ష పెంచుకొని గొంతుకోసి చంపారని చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి నర్సింగరావు కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లోతుగా పోలీసుల విచారణ

హత్య జరిగిన ప్రదేశాన్ని కరీంనగర్ టౌన్ ఏసీపీతో పాటు సీఐ లక్ష్మీబాబు పరిశీలించారు. సీపీ ఆదేశాల మేరకు లోతుగా విచారణ చేపట్టిన పోలీసులు విద్యానగర్‌కు చెందిన వారితో గతంలోనే వివాదాస్పద భూమి విషయంలో గొడవలు ఉన్నాయని అనుమానిస్తున్నారు. సీసీ కెమెరాలు పరిశీలించగా ఉదయం రెండు బైకులపై ముగ్గురు, ముగ్గురుగా వెళ్లి ఓ బార్‌లో మద్యం తాగారని, తర్వాతే హత్య జరిగిన ప్రదేశానికి సుమారు 3 గంటల వరకు వెళ్లి ఉంటారని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఆ ఎనిమిది మంది కాల్ డేటాను పరిశీలించి ఎవరు ఎవరికి కాల్ చేశారనే విషయాలపై దృష్టిసారించినట్లు సమాచారం. మద్యం తాగిన తర్వాత భూవివాదం విషయంలో మాటమాట పెరిగి హత్యకు కారణమైనట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ లక్ష్మీబాబు తెలిపారు. భూవివాదంలో జరిగిన హత్యను సీపీ ఎల్.సుబ్బారాయుడు సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు తెలిసింది.

వరుస చోరీలు

- జగిత్యాల జిల్లాలో వారంలో నాలుగు చోరీలు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- నిఘా పెంచిన పోలీసులు



వైన్స్‌లో చోరీకి పాల్పడుతున్న వ్యక్తి

సమాచారం అందించాలి



ప్రజలు ఇంటికి తాళంవేసి వెళ్లేటప్పుడు పోలీసులతో పాటు స్థానికంగా ఉండేవారికి సమాచారం అందించి వెళ్లాలి. దీంతో తాళాలు వేసిన ఇంటి ప్రాంతాల్లో నిఘా పెంచుతాం. ప్రజలు ఇళ్లల్లో విలువైన వస్తువులు దాచి ఉంచొద్దు. తాళాలు వేసి బయటకు వెళ్లవద్దు.

– రత్నపురం ప్రకాశ్, డీఎస్పీ, జగిత్యాల

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో ఇంటికి తాళాలు వేసి వెళ్తే చోరీలకు పాల్పడుతున్నారు. ఈనెల 11న రాత్రి వెల్గటూర్ మండలకేంద్రంలోని బీరెల్లి శ్రీనివాస్ ఇంట్లో దొంగలు పడి 14 తులాల బంగారం, రూ.లక్ష నగదు, విలువైన వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈనెల 17న రాత్రి ఇబ్రహీంపట్నం మండలకేంద్రానికి చెందిన కుంబోజి లక్ష్మీ అనే వృద్ధురాలి మెడలోంచి రెండున్నర తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. 15 రోజుల్లో జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ అంగన్‌వాడీలో రేషన్‌బియ్యం, పొరండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో నూనె ప్యాకెట్లు దొంగలు ఎత్తుకెళ్లారు. ఈనెల 21న రాత్రి మెట్‌పల్లి పట్టణంలోని బస్‌డిపో వద్ద మహాలక్ష్మీ వైన్స్‌లో చోరీకి పాల్పడిన దొంగ కౌంటర్‌లోనిని రూ.80వేల నగదు, సీసీపుటేజీ టీవీ, కంప్యూటర్ పరికరాలు ఎత్తుకెళ్లాడు.

భయంభయం...

జిల్లాలో వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు చిన్నపాటి పనిపై తాళంవేసి ఆరుబయటకు వెళ్లాలన్నా పట్టణాల్లో జంకుతున్నారు. నిత్యం తాళంవేసిన ఇళ్లల్లోనే చోరీలు జరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జగిత్యాల జిల్లాలోప్రజలు ఎటైనా వెళ్తున్నప్పుడు ఇంటికి తాళంవేసి పోలీసులకో, స్థానికులకు సమాచారం ఇస్తున్నా ఏదో ఒక సమయంలో దొంగలు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడుతుండడంతో ఇంటికి తాళంవేసి బయటకు వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు.

సీసీకెమెరాలున్నా... ఆగని దొంగతనాలు..

జిల్లా వ్యాప్తంగా నేరాలను నియంత్రించేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో నేనుసైతం కార్యక్రమం ద్వారా పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా సీసీకెమెరాలను ఏర్పాటుచేసినా చోరీలు తగ్గడం లేదు. దీంతో పాటు పోలీసుశాఖ నిరంతర నిఘా ఏర్పాటుకు బ్లూకోట్స్ టీంలను సైతం ఏర్పాటుచేసి నిఘా పెంచినా చోరీలు ఆగడం లేదు.

రాత్రివేళల్లోనే చోరీలు..

జగిత్యాల జిల్లావ్యాప్తంగా దొంగతనాలు రాత్రివేళల్లోనే ఎక్కువగా జరుగుతున్నాయి. మధ్యాహ్నం దొంగలు తాళం వేసిన ఇళ్లను చూసి రాత్రివేళలో చోరీలకు పాల్పడుతున్నారు. చాలామంది ఇంటికి తాళంవేసి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని చెప్పినా విలువైన వస్తువులు ఇళ్లలో పెట్టుకోవద్దని చెప్పినా అవేమీ పట్టించుకోవడం లేదు. దీంతో దొంగలు తాళంవేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు.

పాతనేరస్తులపై నిఘా :

జిల్లాలో జరుగుతున్న వరుస దొంగతనాలకు పాత నేరస్తులే కారణమని పోలీసులు జైళ్ల నుంచి బయటకు వెళ్లిన దొంగలపై నిఘా పటిష్టం చేయడంతో పాటు వారి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. పాత దొంగతనాలకు పాల్పడి బయటకు వచ్చిన వారు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు. ఏం పనిలో ఉన్నారని విచారిస్తున్నారు. దీంతో మెట్‌పల్లి పోలీసులు ఇప్పటికే ఓ పాత దొంగను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. పెగడపల్లి పోలీసులు కూడా కొంతమంది దొంగలను పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

మహాలక్ష్మీ వైన్స్‌లో చోరీ

మెట్‌పల్లి: పట్టణంలోని జాతీయ రహదారి పక్కన మహాలక్ష్మీ వైన్స్‌లో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. ముఖానికి మాస్క్ వేసుకున్న ఓ వ్యక్తి వైన్స్ పైకప్పు రేకులను తొలగించి లోపలికి చొరబడ్డాడు. అనంతరం కౌంటర్‌లోని రూ.80వేల నగదును దొంగిలించాడు. చోరీ తర్వాత బయటికి వెళ్లే క్రమంలో పైకి ఎక్కుతుండగా మద్యం బాటిళ్లు దెబ్బతిన్నాయి. అంతకు ముందు అక్కడున్న కొన్ని సీసీ కెమెరాలు ధ్వంసం చేయగా మిగిలిన సీసీ కెమెరాల్లో చోరీకి సంబంధించిన దృశ్యాలు రికార్డయ్యాయి. మొత్తం మీద రూ.1.50లక్షల నష్టం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.



తొలగించిన వైన్స్ పైకప్పు

నిమ్మపల్లిలో పిచ్చి కుక్కల స్వైరవిహారం

- ముగ్గురిపై దాడి
- ఆస్పత్రికి తరలింపు





గాయపడిన కమ్మరి పోచవ్వ, సాగర్

కోనరావుపేట (వేములవాడ): మండలంలోని నిమ్మపల్లిలో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ క్రమంలో ముగ్గురిపై దాడి చేశాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు గన్నారపు కిష్టయ్య, గన్నారపు సాగర్ ఇంటివద్ద ఉన్న సమయంలో ఒక్కసారిగా కుక్కలు దాడికి పాల్పడ్డాయి. దీంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరితో మరో వృద్ధురాలు కమ్మరి పోచవ్వపై దాడి చేయడంతో కాలికి గాయమైంది. గాయపడిన ముగ్గురిని కోనరావుపేటలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గత కొంతకాలంగా మండలంలోని గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తుండడంతో వారు గాయాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శోభకృత్ శుభాలకు నాంది

- ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సునీల్‌కుమార్



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఈడీ సునీల్‌కుమార్

జ్యోతినగర్: శ్రీశోభకృత్ ఉగాది శుభాలకు నాంది అని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లోని జ్యోతిక రిక్రియేషన్ క్లబ్ మ్యూజిక్ హాలులో పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలను ఎంచుకుని వాటిని ప్రణాళికాబద్ధంగా అమలుచేసుకోవాలన్నారు. అర్చకులు వామనశర్మ, రుద్రభట్ల శ్రీకాంత్ శర్మలు పంచాంగ శ్రవణం వినిపించారు. అనంతరం కవిసమ్మేళనంలో పలువురు కవులు తమ కవితలను వినిపించారు. ఉగాది షడ్రుచుల పచ్చడి, మిఠాయిలు అందించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు దేశాయ్, జ్యోతిక క్లబ్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, కార్పొరేటర్ కొలిపాక సుజాత, ఉద్యోగ గుర్తింపుసంఘం ప్రతినిధులు, వివిధయూనియన్ల సభ్యులు పాల్గొన్నారు.

పండుగకు వచ్చి పరలోకాలకు..

- ఇంటర్ పరీక్షలు బాగా రాయడం లేదని మనస్తాపం
- గోదావరి నదిలో దూకి విద్యార్థిని ఆత్మహత్య



నాగలక్ష్మి(ఫైల్)

ధర్మపురి: ఇంటర్మీడియెట్ పరీక్షలు బాగా రాయలేకపోయాననే మనస్తాపంతో కాల్ల నాగలక్ష్మి(16) బుధవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాల్ల రామయ్య – నర్సవ్వ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. చిన్నకూతురు నాగలక్ష్మి. మల్యాల మండలం నూకపెల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ చదువుతోంది. సోమవారం మల్యాలలో బోటనీ పరీక్ష రాసింది. అయితే, పరీక్ష బాగా రాయలేదని మనస్తాపానికి గురైంది. ఇదే విషయాన్ని తన స్నేహితులతో చెప్పింది. పరీక్ష మంచిగారాసి ఉగాది పండుగకు ఇంటికి రావాలని తల్లిదండ్రులు కోరారు. ఈ క్రమంలో మంగళవారం బాలిక ఇంటికి చేరుకుంది. వచ్చినప్పటి నుంచి నాగలక్ష్మి ముదావహంగా ఉంటోంది. భోజనం కూడా సరిగా చేయడంలేదు. తల్లిదండ్రులు ఆరా తీయగా, తాను పరీక్ష బాగా రాయలేకపోయానని రోదిస్తూ తెలిపింది. ఏం ఫర్వాలేదని, ధైర్యంగా ఉండాలని తల్లిదండ్రులు బాలికకు సూచించారు. ఈక్రమంలో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా ఇంటి ఎదుట వాకిట్లో ముగ్గులు వేసిన నాగలక్ష్మి.. ఉదయం 11 గంటల సమయంలో బయటకు వెళ్లింది. మధ్యాహ్నం వరకూ ఆమె కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు పరిసరాల్లో గాలించారు. బంధువులకు సమాచారం అందించారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. గోదావరినది వైపు నాగలక్ష్మి వెళ్లిందని స్థానికులు వారికి చెప్పారు. దీంతో తల్లిదండ్రులు అటువైపు వెళ్లి చూడగా, గోదావరి ఒడ్డున నాగలక్ష్మి చెప్పులు కనిపించాయి. నదిలో దూకి ఉంటుందనే అనుమానంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు జాలర్లసాయంతో నీటిలో గాలించగా నాగలక్ష్మి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతిరాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజు తెలిపారు. కొడుకులు లేకున్నా.. ఇద్దరు కూతుళ్లే సర్వస్వం అనుకున్న ఆ తల్లిదండ్రులు.. చిన్నకూతురు మృతితో విషాదంలో మునిగారు.

హన్మాన్ విగ్రహాన్ని ఢీకొట్టిన వాహనం

- పోలీస్‌ల ఆధీనంలో 30 ట్రాక్టర్లు
- కేసు నమోదుచేసిన పోలీసులు



పగుళ్లు చూపిన హనుమాన్ విగ్రహం

ధర్మపురి: పురాతనమైన హన్మాన్ విగ్రహాన్ని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో విగ్రహం కింది భాగం పూర్తిగా పగుళ్లు చూపింది. దీంతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధర్మపురిలోని గోదావరి ఒడ్డున హన్మాన్ ఆలయం సమీపంలో రోడ్డుమధ్యలో పురాతనమైన హన్మాన్ విగ్రహం ఉంది. ఈ విగ్రహానికి సమీపంలోని భక్తులు నిత్యం పూజలు చేస్తుంటారు. ఈక్రమంలో బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో విగ్రహం కిందిభాగంలో పగుళ్లు చూపింది. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్‌పైనే అనుమానాలు..

విగ్రహం ముందు నుంచి గోదావరికి నిత్యం అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌తో గోదావరి నిండుగా ఉండడంతో ఇసుకను గోదావరిపై భాగం నుంచి ట్రాక్టర్లలో తరలిస్తుంటారు. నిత్యం 50 నుంచి వంద ట్రాక్టర్ల వరకు ఇసుక అక్రమ రవాణ సాగుతుందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఇసుక ట్రాక్టరే ఢీ కొట్టి వెళ్లి ఉంటుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 30 ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు రప్పించారు. విగ్రహం ధ్వంసంపై ఆరాతీస్తున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న విగ్రహం ఇసుక రవాణకు అడ్డుగా ఉందని భావించి ట్రాక్టర్‌తో ఢీకొట్టి ఉంటారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దెబ్బతిన్న విగ్రహం చుట్టూ పోలీసులు భారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ ఘటనపై ధర్మపురికి చెందిన అంబటి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంచాంగం చూస్తుండగా పాముకాటు

- ఆస్పత్రికి తరలింపు

కాల్వశ్రీరాంపూర్: మానవహక్కుల సంఘం మాజీ చైర్మన్ ఎరబాటి భాస్కర్‌రావు సోదరుడు స్వాతంత్ర్య సమరయోధుడు సీనియర్ సిటిజన్ హరిహర ఆలయం నిర్మాణకర్త రాజేశ్వర్‌రావును కాల్వశ్రీరాంపూర్‌లోని ఆయన నివాసంలో బుధవారం నాగుపాము కాటువేసింది. ఉగాది పండుగ సందర్భంగా పంచాగం చూస్తుండగా పెరట్లో నుంచి పామువచ్చి కాలుపై కాటువేసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. గమనించిన రాజేశ్వర్‌రావు అప్రమత్తమై ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఫోన్‌చేయగా హుటాహుటిన కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యానికి 108లో కరీంనగర్‌కు తరలించారు. రాజేశ్వర్‌రావు కుమారుడు హైకోర్టు న్యాయవాది హైదరాబాద్ నుంచి కరీంనగర్ వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యస్థితిపై స్థానికులు ఆందోళన చెందుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ ఆడెపు శ్రీదేవిరాజు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రఘుపతిరావు, తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ డీసీపీకి సమన్లు జారీ

ధర్మపురి: బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి కొప్పుల ఈశ్వర్‌పై ఎన్నికల పిటిషన్‌ను అమలుచేయడంలో విఫలమైనందుకు హైకోర్టు నుంచి మల్కాజ్‌గిరి డీసీపీకి సమన్లు జారీఅయ్యాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అతి తక్కువ మెజార్టీతో ఓటమి చవిచూడగా ఓట్లలెక్కింపులో అవకతవకలు జరిగాయంటూ అందుకు ఎన్నికల అధికారి భిక్షపతి కారణమని లక్ష్మణ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందిన భిక్షపతి బీఆర్ఎస్ మంత్రికి అనుకూలంగా ఫలితాల షీట్‌ను మార్చాడని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి తరుపున న్యాయవాది ధర్మేశ్ వాదిస్తూ రిటర్నింగ్ అధికారి రెండుసార్లు హాజరైనప్పటికీ సంబంధిత పత్రాలు సమర్పించడంలో విఫలమయ్యారని మరో రెండు సందర్భాల్లో గైర్హాజరైనట్లు వాదించారు. పోలీసుల వైఫల్యంపై అసంతృప్తి వ్యక్తంచేసిన న్యాయమూర్తి మల్కాజ్‌గిరి డీసీపీతో పాటు సంబంధిత పత్రాలతో ఈనెల 27న కోర్టుకు హాజరు కావాలని భిక్షపతిని ఆదేశించారు.

విరిగిన తాటిచెట్టు.. తప్పిన ప్రమాదం

- మూడు గంటల పాటు అంధకారం

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామంలో అకస్మాత్తుగా ఈదురుగాలుల వర్షానికి తాటిచెట్టు విరగడంతో ప్రమాదం తప్పింది. బుధవారం సాయత్రం గ్రామంలోని పశువైద్యశాల సమీపంలోని తాటిచెట్టు అకస్మాత్తుగా పడడంతో విద్యుత్‌స్తంభాలు విరిగాయి. ఇళ్లమధ్యలోని వందేళ్ల నాటి తాటిచెట్టు విరగడంతో చుట్టుకాలనీ వాసులు ప్రాణాలతో బయటపడ్డారు. రోడ్డుపక్కనున్న తాటిచెట్టు ఎవరులేని సమయంలో పడడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటన స్థలానికి విద్యుత్ సిబ్బంది వచ్చి సరిచేశారు.

ఆరుగురిపై కేసు

మల్లాపూర్: మండలంలోని సాతారంలో మంగళవారం రాత్రి పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఆరుగురిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని సాతారం గ్రామానికి చెందిన మెడకొక్కుల హరీశ్, పీట్ల లక్ష్మణ్, రుద్రంగి చందు, ఒల్లపు పెద్దులు, పందిరి ప్రశాంత్, నాటకారి రమేశ్ డీజే సౌండ్స్‌తో ఇబ్బందిపెడుతున్నారని ఫిర్యాదురావడంతో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లారు. ఈక్రమంలో వారిని హెచ్చరించిన పోలీసులపై దురుసుగా వ్యవహరించి విధులకు ఆటంకం కలిగించారు. ఆరుగురిపై కేసు నమోదుచేసి డీజే సౌండ్‌సిస్టం సీజ్‌చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో మంటలు

- రెండు అంతస్తుల్లో అంటుకున్న వైరింగ్
- మంటలను అదుపుచేసిన ఫైర్‌సిబ్బంది
- షార్ట్‌సర్క్యూట్‌గా భావిస్తున్న అధికారులు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బుధవారం రాత్రి మంటలు చెలరేగాయి. పరిశీలించిన స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించగా అప్పటికే ఒక అంతస్తు నుంచి మరో అంతస్తుకు మంటలు వ్యాపించి, పొగతో నిండిపోయింది. ఫైర్ సిబ్బంది లోనికి వెళ్లేందుకు వీలులేకపోవడంతో మంటలను ఆర్పుతూ అదుపులోకి తెచ్చారు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి ఉగాది రోజు సెలవుదినం కావడంతో ఉద్యోగులెవరూ రాలేదని తెలిసింది. రెండస్తుల్లోని వైర్లు, మిషనరీ కాలిపోయినట్లు ఫైర్‌సిబ్బంది అధికారులు చెబుతున్నారు. నష్టాన్ని ఇప్పుడే అంచనా వేయలేమని పూర్తిస్థాయి విచారణ చేసి వివరాలు వెల్లడిస్తామని కరీంనగర్ డివిజన్ ఫైర్ అధికార తగరం వెంకన్న తెలిపారు. ప్రమాదానికి ప్రాథమికంగా షార్ట్‌సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది.

‘శోభకృత్’లో ప్రజల జీవితాల్లో వెలుగులు


పంచాంగ శ్రవణం చేస్తున్న మహేశ్వర శర్మ

విద్యానగర్: శోభకృత్ అంటే ప్రకాశాన్ని కలిగించేదని ,శోభకృత్ నామ సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా బుధవారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత శ్రీ దుర్గాభవానీ ఆలయంలో పంచాగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ.. ప్రకృతి మనకు అనుకులంగా ఉండాలని అందరూ కోరుకుంటారని, శోభకృత్ సంవత్సరం శుభకరమే కాదు శోభాకరమైనదన్నారు. ఉగాది కాల సంబంధమైన పర్వం కాబట్టి ఆదిత్యున్ని, విశ్వసృజనకు ఆరంభం కావడం వల్ల సృష్టికర్త బ్రహ్మను ఆరాధించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ, ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

కవర్లతో ఇటుకలకు రక్షణ


అకాల వర్షాలతో పంటలు నేలవాలడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. గతంలో వర్షాలకు మట్టి ఇటుకలు తడవడంతో వ్యాపారులు నష్టపోగా ప్రస్తుతం అప్రమత్తమైన కొందరు వర్షాల నుంచి మట్టి ఇటుకలు, బట్టీ తడవకుండా రక్షణగా ప్లాస్టిక్ కవర్లు కప్పారు. కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్ శివారులో ఓ వ్యాపారి ఇటుకలపై రక్షణగా కట్టిన కవర్లను గ్రామస్తులు ఆసక్తిగా చూస్తున్నారు. - కరీంనగర్‌రూరల్

చిత్ర కథ

రోడ్డు పనులు పూర్తి చేయరూ!


కరీంనగర్‌లోని గణేశ్‌నగర్ బైపాస్ రోడ్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఒకచోట రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టిసారించి, పనులు చేయించాలని కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

సింగిల్‌విండో చైర్మన్‌కు పరామర్శ


శ్యాంసుందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, మేయర్

కరీంనగర్‌రూరల్: గుండెపోటుకు గురై, ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్న కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, నగర మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అనిల్‌కుమార్, వాల రమణారావు తదితరులు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, శస్త్రచికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామాల్లో సామాజిక సర్వే


సమావేశంలో ప్రజాప్రతినిధులు, వలంటీర్లు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్, నల్లగుంటపల్లి గ్రామాల్లో ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా వలంటీర్లు బుధవారం సామాజిక సర్వే చేపట్టారు. నల్లగుంటపల్లిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి, హనుమాన్ ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచు వడ్లూరి సంతోష, ఎంపీటీసీ సభ్యురాలు గొల్లె రాజ్యలక్ష్మిలు మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నాయుడు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి


పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర(చొప్పదండి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బుధవారం గంగాధర మండలంలోని కొట్ల నర్సింహులపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. గ్రామాల్లో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, డంపింగ్ యార్డుల ఏర్పాటు, కొత్త గ్రామ పంచాయతీలకు సొంత భవనాలకు నిధులిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచు తోట కవిత, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలి



రామడుగు(చొప్పదండి): ఈ నెల 26, 27వ తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి కోయ్యడ సృజన్‌కుమార్ కోరారు. రామడుగు మండల కేంద్రంలో బుధవారం కౌన్సిల్ సమావేశాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గంటి రాజేశం, మచ్చ రమేశ్, గొడిశెల తిరుపతి గౌడ్, నారాయణ రెడ్డి, రవీందర్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలు.. కూలిన కల్వర్టు, డ్రాప్‌లు


నగునూరు శివారులో కూలిన కల్వర్టు


జూబ్లీనగర్‌లో కొట్టుకుపోయిన డ్రాప్

- డీ–89 ప్రధాన కాలువకు దశాబ్దాలుగా మరమ్మతు చేపట్టని అధికారులు
- పొలాల వద్దకు, కాట్నపల్లికి వెళ్లేందుకు రైతుల ఇబ్బందులు

కరీంనగర్‌రూరల్: అకాల వర్షాలకు శిథిలావస్థలో ఉన్న ఎస్సారెస్పీ కాలువలకు సంబంధించిన డ్రాప్‌లు, కల్వర్టు కూలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు వర్షాలతో వరద నీరు, మరోవైపు ఎస్సారెస్పీ నీటి విడుదలతో కాలువల్లో ప్రవాహం పెరిగి, పలుచోట్ల డ్రాప్‌లు కొట్టుకపోయాయని అంటున్నారు.

40 ఏళ్ల క్రితం నిర్మాణం..

కరీంనగర్ మండలానికి ఎస్సారెస్పీ నీటిని సరఫరా చేసే డీ–89 ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరింది. దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రధాన కాలువతోపాటు ఉపకాలువలకు ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు చేపట్టలేదు. దీంతో పలుచోట్ల డ్రాప్‌లు, లైనింగ్ కూలిపోయాయి. ఈ నెల 18, 19 తేదీల్లో కురిసిన వర్షాలకు నగునూరు -కాట్నపల్లి దారిలోని డీ–89 ప్రధాన కాలువ అనుబంధ 3ఎల్ కాలువ కల్వర్టు కూలిపోయింది. గతంలో బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా అధికారులు అండర్ గ్రౌండ్ వంతెనలో పెద్ద పైపులు వేయకుండా చిన్న పైపులు వేసినట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు కూలడంతో పొలాలతోపాటు కాట్నపల్లికి వెళ్లేందుకు అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ నీళ్లు కిందకు వెళ్లే అవకాశం లేకపోవడంతో పంటలు ఎండుతాయని ఆయకట్టు చివరి రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పరిశీలించిన ఆర్అండ్‌బీ అధికారులు..

ఎస్సారెస్పీ అధికారులు కల్వర్టు తమ పరిధిలోకి రాదని చెప్పడంతో ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించారు. కాలువ నీళ్లు తగ్గిన అనంతరం మరమ్మతు చేస్తామని తెలిపారు. అలాగే డీ–89 కాలువ పరిధిలోనే జూబ్లీనగర్ వద్ద నీరు ఎక్కువగా రావడంతో డ్రాప్ కూలిపోయింది. అధికారులు తాత్కాలికంగా ఇసుక బస్తాలను అడ్డుగా వేశారు. కాలువల్లో నీటి ప్రవాహం పెరగడం వల్లే కల్వర్టు, డ్రాప్‌లు కూలిపోయాయని ఎస్సారెస్పీ ఏఈ మౌనిక పేర్కొన్నారు. వాటిని పరిశీలించి, మరమ్మతు కోసం అంచనాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా చైతన్య యాత్రకు తరలిరండి


కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న కరీంనగర్ జిల్లాలో నిర్వహించే సీపీఎం ప్రజా చైతన్య యాత్రకు తరలిరావాలని ఆ పార్టీ నగర కార్యదర్శి గుడికందుల సత్యం కోరారు. బుధవారం స్థానిక బస్టాండ్‌లో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం నగరంలోని ప్రయాణ ప్రాంగణం, తెలంగాణ చౌక్, కశ్మీర్ గడ్డ, ఆదర్శనగర్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతోందని ఆరోపించారు. రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను రూ.1,200కు పెంచి, ప్రజలపై భారం వేస్తున్నారని పేర్కొన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకుండా రోజురోజుకూ పెంచుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ రాష్ట్రంలో 33 జిల్లాలు తిరుగుతూ సీపీఎం ప్రజా చైతన్య యాత్ర ఈ నెల 26న కరీంనగర్ చేరుకుంటుందని అన్నారు. ప్రజలు, మేధావులు, కార్మిక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద సభ, అనంతరం రోడ్ షోగా వెళ్లి, కోతిరాంపూర్‌లోని అన్నమనేని గార్డెన్స్‌లో మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు పుల్లెల మల్లయ్య,పున్నం రవి, కొంపల్లి సాగర్ నాయకులు రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసీతారామచంద్రస్వామి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


పల్లకి సేవలో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు దంపతులు, భక్తులు

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్ 33వ డివిజన్ భగత్‌నగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మేయర్ యాదగిరి సునీల్‌రావు–అపర్ణ దంపతులు తమ నివాసంలో సీతారాముల ఉత్సవమూర్తులకు వేద మంత్రోచ్ఛరణల మధ్య పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఎదుర్కోలుగా పెద్ద ఎత్తున ర్యాలీతో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఆలయంలో చైతన్య యూత్ క్లబ్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి వేడుకలు 9 రోజులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో చైతన్య యూత్ క్లబ్ సభ్యులు, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శోభకృత్ నామ ఉగాది వేడుకలు


నగునూరులో జగన్నాథస్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


గోపాల్‌పూర్‌లో ఎండ్లబండ్లతో ఊరేగింపు

కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి/కరీంనగర్: కరీంనగర్ మండలంలో బుధవారం శ్రీశోభకృత్ నామ ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో వేదపండితుల ఆధ్వర్యంలో జరిగిన పంచాంగ శ్రవణంలో ప్రజలు పాల్గొన్నారు. కొత్తపల్లి మండలంలోని గ్రామాలు, కొత్తపల్లి పట్టణంలో గల దేవాలయాల్లో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. రేకుర్తి, కొత్తపల్లి, బద్దిపల్లి, చింతకుంట, కమాన్‌పూర్, మల్కాపూర్, బావుపేట, ఎలగందుల, ఖాజీపూర్, నాగులమల్యాల, బద్దిపల్లి గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఉగాది పండుగ సందర్భంగా నగర మేయర్ వై.సునీల్‌రావు బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌ను బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందించి, శ్రీ శోభకృత్ నామ తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కలిసి, పూలమొక్క అందించి, ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కుల సంఘాల నాయకులు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రంజాన్‌ను పురస్కరించుకొని ముస్లింలకు వినోద్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, కుల సంఘాల నాయకులు జీఎస్.ఆనంద్, నర్సింగరావు, కలర్ సత్తన్న, రమేశ్‌గౌడ్, మహమ్మద్ అక్బర్, శ్రీనివాస్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి గంగుల కమలాకర్‌కు మొక్క అందిస్తున్న మేయర్ సునీల్‌రావు


వినోద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కుల సంఘాల నాయకులు


చామనపల్లి: పంచాంగ శ్రవణంలో గ్రామస్తులు


కొత్తపల్లి శివాలయంలో పంచాంగ శ్రవణంలో మున్సిపల్ చైర్మన్ రాజు, స్థానికులు

శ్రీరామనవమి ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్ కోటేశ్వర్

గన్నేరువరం: ఈనెల 30న శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని మైలారం గ్రామం నిర్వహించే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను బుధవారం ఉత్సవ కమిటీ చైర్మన్ తోట కోటేశ్వర్ పరిశీలించారు. శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పక్కన, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరివెంట మర్రి వెంకటమల్లు, తోట పవన్, గువ్వ పర్శయ్య, పులి రామకృష్ణగౌడ్, బుర్ర చంద్రశేఖర్ గౌడ్, తోట రాజు, దొగ్గల జగన్, మడికంటి శ్రీనివాస్, ఇట్టనేని నాగరాజు, తోట ప్రశాంత్, నూకల చింటు, గంగొపెల్లి నరేశ్ పాల్గొన్నారు.

25న వేంకటేశ్వరస్వామి కల్యాణం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ శివారులో గల వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక ఉత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 24న స్వామివారిని గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయం నుంచి గుట్టపైకి తీసుకెళ్తారని, 25న ఉదయం వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం గ్రామస్థులు తెలిపారు. ఈనెల 26న సాయంత్రం చైత్ర శుక్ల పంచమిని పురస్కరించుకొని గుట్టబండ్ల జాతర జరుగుతుందని, భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కేబుల్ బ్రిడ్జి పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు 11 కేవీ ఎల్లమ్మ, సదాశివపల్లి ఫీడర్ల పరిధిలోని ఆటోనగర్, కోతిరాంపూర్, పోచమ్మవాడ, సదాశివపల్లిల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

సీఎం కేసీఆర్, మంత్రి గంగుల చిత్రపటానికి క్షీరాభిషేకం



కరీంనగర్: ఈద్గా, షాదీఖానా, శ్మశానవాటికల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం పట్ల బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సుడా డైరెక్టర్ షేక్ యూసుఫ్ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్‌ల చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. సాలెనగర్ ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.20 లక్షలు, కరీంల్లాషా దర్గాకి రూ.20 లక్షలు, చింతకుంటలో నూతనంగా నిర్మించే షాదీఖానాకు రూ.2 కోట్ల ప్రొసీడింగ్, కబరస్తాన్‌ల అభివృద్ధికి రూ.30 లక్షలు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మైనారిటీ నాయకులు జమీలొద్దీన్, సాబీర్, పాషా, ఫహద్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



శంకరపట్నం: మండలంలోని ఊరూరా పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గద్దపాక, ఆముదాలపల్లి, తాడికల్‌తో పాటు పలు గ్రామాల్లోని మహిళలు డప్పు చప్పుళ్లతో ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్ రెడ్డి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

గన్నేరువరం: ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా గన్నేరువరంలో గౌడ సంఘం భవనంలో గురువారం ఉదయం 10 గంటలకు జెడ్పీటీసీ సభ్యుడు మాడుగుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ, రైతుబంధు సమితి సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ, సింగిల్‌విండో డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

నేడు గోదాముల ప్రారంభం

చొప్పదండి : చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళపల్లి రోడ్డులో నిర్మించిన గోదాములను గురువారం టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు ప్రారంభించనున్నట్లు చైర్మన్ వెల్మ మల్లారెడ్డి తెలిపారు. సహకార సంఘం 72వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంఘం పరిధిలోని రైతులంతా సమావేశానికి తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా...

నేడు ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. వెలగపూడిలోని తాత్కాలిక శాసనసభ ప్రాంగణంలో పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175. ఇందులో వైఎస్సార్‌సీపీకి 151 మంది సభ్యులు ఉండగా.. టీడీపీకి అధికారికంగా 23 మంది, జనసేనకు ఒకరు ఉన్నారు. నలుగురు సభ్యులు టీడీపీకి దూరంగా ఉంటున్నారు. దీంతో టీడీపీకి 19 మంది బలం మాత్రమే ఉంది. అలాగే జనసేనకు ఉన్న ఒక సభ్యుడు కూడా ఆ పార్టీకి దూరమయ్యారు. ఒక్కో ఎమ్మెల్సీ గెలుపొందడానికి 22 మంది సభ్యుల ఓట్లు అవసరం. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉన్న నేపథ్యంలో ఏడు స్థానాలకు అభ్యర్థులను బరిలోకి దించింది. ఈ క్రమంలో వాస్తవంగా చూస్తే.. ఒక్క స్థానం గెలవడానికి కూడా టీడీపీకి బలం లేదు. అయినా సరే అభ్యర్థిని బరిలోకి దింపడం చర్చనీయాంశంగా మారింది. కాగా, సాయంత్రం ఐదు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది.

ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి కన్నుమూత



సాక్షి, అమరావతి: ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి (67) కన్నుమూశారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ అప్పా జంక్షన్ కాళిమాత టెంపుల్ సమీపంలో నివసిస్తున్న ఆయన బుధవారం రాత్రి 7.45 గంటలకు తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సుధారాణి, కుమార్తెలు దీప్తి, కీర్తి ఉన్నారు. శ్రీనాథ్‌రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ఆయన స్వగ్రామం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కోరగుంటపల్లిలో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. పులివెందుల నియోజకవర్గం కోరగుంటపల్లిలో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించిన ఆయన.. 1978లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చేరారు. కడప రిపోర్టర్‌గా దాదాపు 30 ఏళ్లు, తరువాత కొంతకాలం హైదరాబాద్‌లో పనిచేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు సంస్థలు, బీబీసీ, సాక్షిలో ఉన్నత హోదాల్లో పనిచేశారు. ఏపీయూడబ్ల్యూజేలో కీలకనేతగా వ్యవహరించారు. 2019 నుంచి దాదాపు మూడేళ్లు శ్రీనాథ్‌రెడ్డి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.



పంచాంగ శ్రవణం ఆలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి



ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న సీఎం వైఎస్ జగన్ దంపతులు

ఏడాదంతా.. వసంత 'శోభ'

సీఎం జగన్ నివాసంలోని గోశాలలో ఉగాది వేడుకలు

- తెలుగుదనం ఉట్టిపడేలా కొత్త సంవత్సరం సంబరాలు
- సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించిన సీఎం జగన్
- పరిపాలన బాగుంటుంది.. సమన్యాయంతో ముందుకువెళ్తారన్న పంచాంగ శ్రవణకర్త సుబ్బరాయ సోమయాజులు

సాక్షి, అమరావతి: శోభకృత్ నామ సంవత్సరంలో తెలుగువారందరికీ మంచి జరగాలని, తెలుగు లోగిళ్లు సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో కళకళలాడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం గోశాలలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు సంప్రదాయం, ఆచారాలు ఉట్టిపడేలా సంబరాలను నిర్వహించారు. తిరుమలలోని ఆనంద నిలయం తరహాలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నమూనాతో ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండపంలోని గోడలకు ఏర్పాటు చేసిన దశావతారాల బొమ్మలు ఆకట్టుకున్నాయి.

సీఎం దంపతుల పూజలు

సంప్రదాయ పంచెకట్టులో సతీ సమేతంగా ఉగాది వేడుకలకు ముఖ్యమంత్రి జగన్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీమణి వైఎస్ భారతికి నుదుటున కుంకుమ బొట్టును సీఎం జగన్ దిద్దగా ఆమె కూడా బొట్టు పెట్టారు. అనంతరం ఉగాది వేడుకల ప్రాంగణంలోని శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో సీఎం దంపతులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. టీటీడీ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వేదపండితులు సీఎం దంపతులకు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ముఖ్యమంత్రి జగన్ పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాంగకర్త కప్పగంటి సుబ్బరాయ సోమయాజులు రూపొందించిన పంచాంగాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణం అనంతరం సీఎం జగన్ దంపతులు ఉగాది పచ్చడిని స్వీకరించారు. రాష్ట్రంలో ప్రతి అక్కకు, చెల్లెమ్మకు, ప్రతి సోదరుడికి, స్నేహితుడికి, అవ్వాతాతలకూ నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని, దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని మనసారా ఆకాంక్షిస్తూ సీఎం జగన్ అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

పరిపాలన బాగుంటుంది

ఏపీలో పరిపాలన బాగుంటుందని పంచాంగ శ్రవణంలో సుబ్బరాయ సోమయాజులు చెప్పారు. 'ఈ ఏడాది శ్రామికులు, కర్షకులకు లాభదాయకంగా ఉంటుంది. పశు సంపద, పాడి పరిశ్రమ బాగుంటుంది. ప్రభుత్వ విధానాలు రైతులకు అనుకూలంగా ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రజల మధ్య స్నేహం విలసిల్లి ముందుకు నడుస్తారు. విజయవంతమైన పథకాలను చేపట్టి ముందుకు వెళ్తారు. ప్రజలకు అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తారు. సమన్యాయంతో ముందుకువెళ్తారు. ఈ ఏడాదంతా రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు లభించడానికి అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి'అని పేర్కొన్నారు.

రూ.7.48 కోట్ల బంగారం స్వాధీనం...

నలుగురి అరెస్టు
కస్టమ్స్ అధికారుల విస్తృత దాడులు

సాక్షి, అమరావతి/పటమట (విజయవాడ తూర్పు): విజయవాడ కస్టమ్స్ విభాగం అధికారులు బుధవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న రూ.7.48 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు విజయవాడ రైల్వే స్టేషన్‌లో కస్టమ్స్ అధికారులు 5 కేజీల అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ నిందితులను విచారించి రాబట్టిన సమాచారం ఆధారంగా ఏపీ-తమిళనాడు సరిహద్దుల్లో 30 మంది అధికారుల బృందం విస్తృతంగా దాడులు చేసి కార్లు, స్కూటర్లలో అక్రమంగా తరలిస్తున్న మరో 7.79 కేజీల బంగారాన్ని పట్టుకున్నారు. మొత్తం మీద 15 ప్రాంతాల్లో మొత్తం రూ.7.48 కోట్ల విలువైన 12.97 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. కాగా, 2022-23లో విజయవాడ కస్టమ్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.19.75 కోట్ల విలువైన అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ కమిషనర్ కె.ఇంజనీర్ తెలిపారు.

నేడు స్పెషాలిటీ వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో 5 స్పెషాలిటీల్లో 180 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం గురువారం వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనుంది. విజయవాడలోని పాత జీజీహెచ్ ప్రాంగణంలో ఉన్న డీఎంఈ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో 14 స్పెషాలిటీల్లో 445 పోస్టుల భర్తీకి 23 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పూర్తి వివరాలకు 6301138782 నంబర్‌ను సంప్రదించవచ్చు.



ఆలయం వెలుపల పూల అలంకరణ


శ్రీవారి చెంత వేడుకగా ఉగాది ఆస్థానం

శోభాయమానంగా ఫల, పుష్పాలంకరణ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం వేడుకగా జరిగింది. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశించారు. శ్రీవారి ఉత్సవమూర్తులు బంగారు వాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా సర్వభూపాల వాహనంపై వేంచేపు చేశారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ విష్వక్సేనుల వారిని వేంచేపు చేశారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేసి పంచాంగ శ్రవణం నిర్వహించారు. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకుని టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయం లోపల విభిన్న రకాల పండ్ల గుత్తులు, అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలతో శ్రీవారి ఆలయాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. కాగా, టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల్లో , ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో శ్రీవారి దర్శనమవుతోంది.

రూ.4,411.68 కోట్లతో టీటీడీ బడ్జెట్

- 2023-24 బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం



తిరుమల: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023- 24కి) తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. రూ.4,411.68 కోట్ల బడ్జెట్‌ను ఫిబ్రవరి 15న జరిగిన పాలకమండలి సమావేశం ఆమోదించినట్లు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అప్పుడు ఈ వివరాలు వెల్లడించలేదని తెలిపారు. తిరుమలలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని చెప్పారు. గత నెలలో జరిగిన పాలకమండలి సమావేశంలో కొన్ని పాలనపరమైన నిర్ణయాలు కూడా తీసుకున్నట్లు తెలిపారు. సుబ్బారెడ్డి వెల్లడించిన వివరాలు..

* వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్చినందువల్ల సామాన్య భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ విధానాన్ని కొనసాగిస్తాం.
* కోవిడ్‌కు ముందు ఏడాదికి రూ.1,200 కోట్ల కానుకలు లభించేవి. కోవిడ్ తరువాత హుండీ ఆదాయం ఏడాదికి రూ.1,500 కోట్ల వరకు పెరిగింది.
* కోవిడ్ సమయంలో వర్చువల్ సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో జారీచేశాం. ఈ సేవలు కొనసాగించాలని నిర్ణయించాం.
* వేసవిలో మూడునెలలు భక్తుల రద్దీ బాగా పెరిగే అవకాశం ఉన్నందువల్ల వీఐపీల సిఫారసులు బాగా తగ్గించాలని కోరుతున్నాం. శ్రీవాణి టికెట్ల సంఖ్య కూడా తగ్గించి ఎక్కువమంది సామాన్య భక్తులకు దర్శనం కల్పిస్తాం.

హుండీ ద్వారా రూ.1,591 కోట్ల రాబడి అంచనా

వచ్చే ఆర్థిక సంవత్సరంలో శ్రీవారి హుండీ ద్వారా సుమారు రూ.1,591 కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో టీటీడీ అంచనా వేసింది. 2022-23 బడ్జెట్‌తో పోలిస్తే ఈ బడ్జెట్ రూ.1,315.28 కోట్ల మేర పెరిగింది. టీటీడీ వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన నగదు, బంగారం ద్వారా పెద్ద ఎత్తున వడ్డీ ఆదాయం లభిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.813 కోట్ల వడ్డీ వస్తున్నట్లు అంచనా వేసిన టీటీడీ.. రానున్న ఆర్థిక సంవత్సరంలో వడ్డీ ఆదాయం మరో రూ.177 కోట్లు పెరిగి మొత్తం రూ.990 కోట్లు వస్తాయని పేర్కొంది.

'భగీరథ' ఉద్యోగాల పేరిట మోసం

- పలు జిల్లాల్లో బాధితులు
- రూ.6లక్షలకు పైగా వసూలు చేసిన వైనం
- నిందితుడిని అరెస్ట్ చేసిన కుమురంభీం జిల్లా పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాదిక్ పాషా, ఎస్సై దీకొండ రమేశ్

సిర్పూర్(టి): వివిధ జిల్లాల్లో మిషన్ భగీరథ పథకంలో సూపర్‌వైజర్ తదితర ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి రూ.6లక్షలకు పైగా కాజేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సిర్పూర్ మండలం హుడ్కిలి గ్రామంలోని యువకులకు ఉద్యోగాల ఆశ చూపి గూగుల్‌పే ద్వారా అకౌంట్లోకి డబ్బులు వేయించుకుని మోసం చేయడంతో బాధితులు సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై దీకొండ రమేశ్ కేసు నమోదు చేసి నల్గొండ జిల్లాలోని పర్వేదుల గ్రామంలో నిందితుడిని అరెస్టు చేశారు. బుధవారం సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌటాల సీఐ సాదిక్ పాషా, సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేశ్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

జల్సాలకు అలవాటు పడి..

నల్గొండ జిల్లా పర్వేదుల గ్రామానికి చెందిన ఒర్సు నాగరావు మిషన్ భగీరథ ప్రాజెక్టులో మండల కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోక సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. మిషన్ భగీరథ ప్రాజెక్టులో సైట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నానని పలువురిని నమ్మించాడు. గూగుల్‌లో సెర్చ్ చేసి జిల్లాల వారీగా సర్పంచుల వివరాలు సేకరించాడు. సర్పంచులకు ఫోన్ చేసి మిషన్ భగీరథ పథకంలో ఉద్యోగాలు ఉన్నాయని, రూ.2,500 నుంచి రూ.4,500 వరకు కడితే సూపర్‌వైజర్, డ్రైవర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పాడు. మీ గ్రామంలో యువకులకు ఉద్యోగాలు ఇప్పిస్తే మీకు కూడా పేరొస్తోందని వారిని నమ్మించాడు. ఈ క్రమంలో కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) మండలం హుడ్కిలి గ్రామానికి చెందిన యువకుల నుంచి రూ.49,500, దహెగాం మండలం ఐనం గ్రామానికి చెందిన యువకుల నుంచి రూ.17,200, చౌక గ్రామానికి చెందిన యువకుల నుంచి రూ.15,000, మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నాత్నాయపల్లికి చెందిన యువకుల నుంచి రూ.74,300, నర్సాపూర్ మండలం మద్దూర్‌కు చెందిన వారి నుంచి రూ.9,000, నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామం నుంచి రూ.19,950, చిలుకూరు మండలం పల్లగుట్ట నుంచి రూ.21,100, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం చుక్కాపూర్ నుంచి రూ. 65,500, సదాశివ్‌పేట్ మండలం మల్లేపేట్ నుంచిరూ.19,400,ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల నుంచి రూ.48,000, జైనథ్ మండలం నుంచి రూ.15,000, మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి మండలం నుంచి రూ.48,000, మల్కాజ్‌గిరి మండలం గుల్లపోచం నుంచి రూ.72,500, నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నాడిపల్లి నుంచి రూ. 11,250, సంగారెడ్డి జిల్లా మానూర్ మండలం దోవూర్ నుంచి రూ.14,700, నిర్మల్ జిల్లాలోని యువకుల నుంచి రూ.30,000, మెదక్ జిల్లా నాగులపల్లి గ్రామం నుంచి రూ.7,050 చొప్పున వసూలు చేశాడు. సిర్పూర్(టి) మండలానికి చెందిన పలువురు బాధితులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు గుణపాఠం తప్పదు

- నిజాం చక్కెర పరిశ్రమలు తెరిపించాలి
- టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు
- ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ధర్నా



చక్కెర పరిశ్రమ ఎదుట దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): జిల్లాలోని నిజాం చక్కెర పరిశ్రమను తెరిపించకుంటే వచ్చే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేలకు గుణపాఠం తప్పదని టీపీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు హెచ్చరించారు. ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు చెరుకు రైతులతో కలిసి బుధవారం ధర్నా చేశారు. సీఎం కేసీఆర్, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మలు దహనం చేశారు. అనంతరం కృష్ణారావు మాట్లాడారు. ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ 35 ఏళ్ల తర్వాత తొలిసారి స్వరాష్ట్రంలోని తెలంగాణ ప్రభుత్వ హయాంలో మూతపడడం శోచనీయమన్నారు. దీంతో చెరుకు రైతులు తమ పంటను కామారెడ్డికి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే 100రోజుల్లోనే చక్కెర పరిశ్రమలను స్వాధీనం చేసుకుంటామన్న టీఆర్ఎస్, ఎంపీగా గెలిస్తే సొంత డబ్బు వెచ్చించి ఫ్యాక్టరీ కొనుగోలు చేసి నడుపుతానన్న బీజేపీ ఎంపీ అర్వింద్ తమ హామీలు విస్మరించారని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై ప్రతినెలా 22నవ తేదీన ఒక్కో గ్రామం నుంచి షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర నిర్వహిస్తామని, ఈ ప్రక్రియ వచ్చే అక్టోబర్ వరకు సాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పోతు శేఖర్, రాజిరెడ్డి, బాలసాని ప్రణయ్‌గౌడ్, కడకుంట్ల సాయికుమార్, యాల శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, కాసార భూమక్క, గడ్డం లింగారెడ్డి, అచ్చ రాజేశం, అరుణ్‌రెడ్డి, మగ్గిని నరేశ్, చిన్నఅంజన్న, చింతలపల్లి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు



కుస్తీ పడుతున్న మల్లయోధులు

కుభీర్(ముధోల్): మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. తెలంగాణ, మహారాష్ట్రలోని వివిధ గ్రామాల మల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి నాందేడ్‌కు చెందిన యోగేశ్‌కు రూ.5వేలు, ద్వితీయ బహుమతి బోకర్‌కు చెందిన దిలీప్‌కు రూ.3 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పరశురాం, మాజీ ఎంపీపీ బోయిడి విఠల్, నాయకులు బంక బాబు, వి. నాగేశ్, పి.లింగం, విజయ్, నాగలింగం, తోకల శంకర్, డి.రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం ముందు దివ్యాంగత్వం బలాదూర్

కుభీర్‌లో బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీల్లో మహారాష్ట్రలోని కర్మెల్లి గ్రామానికి చెందిన గణేశ్ అనే దివ్యాంగ మల్లయోధుడు పాల్గొన్నాడు. ఒక చేయి లేనప్పటికీ రెండు పోటీల్లో పాల్గొని రూ.500ల చొప్పున రెండు బహుమతులు సాధించాడు.



సంప్రదాయం ఉట్టిపడేలా.. గుడిపాడువా

ఉగాది పర్వదినం పురస్కరించుకుని గతంలో మహారాష్ట్ర నుంచి వలసవచ్చి స్థానికంగా నివసిస్తున్న మరాఠీలు తమ సంస్కృతిని ప్రతిబింబించేలా ఇంటిపై గుడిపాడువా ఏర్పాటు చేశారు. కొత్త సంవత్సరానికి నాంది పలుకుతూ ఇంటిపైన ఇలా కట్టెను అమర్చి దానికి చెంబు, చీరను కట్టి తమ సంప్రదాయాన్ని చాటుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఇంటింటా కనిపించిన దృశ్యమిది. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్.

పంచెకట్టులో సిరిసిల్ల ఎస్పీ



స్వామివారి దర్శనం అనంతరం సిబ్బందితో ఎస్పీ

సిరిసిల్లక్రైం: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ సిరిసిల్ల పట్టణంలోని వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజ చేసి ఆశీర్వచనం అందించారు. ఈ ఏడాది ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో ఆయురారోగ్యాలతో ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్ కుమార్, ట్రాఫిక్ ఎస్సై రాజకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచు దుప్పటి



బోయినపల్లి(చొప్పదండి): మండల కేంద్రం నుంచి వేములవాడ వెళ్లే దారిలో బుధవారం ఉదయం 7 గంటలు దాటినా పొగమంచు వీడలేదు. కేజీబీవీ, మార్కెట్ యార్డు పరిసరాలు, పంటచేలపై మంచు దుప్పటి పరుచుకుందా అన్నట్లు వాతావరణం కనిపించింది. రోడ్లపై వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్లారు.

వైభవంగా శ్రీరామ నవరాత్రోత్సవాలు ప్రారంభం

- 30న సీతారాముల కల్యాణం



సీతారామచంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ: హరిహర క్షేత్రం వేములవాడ రాజన్న సన్నిధిలో శ్రీసీతారామచంద్రస్వామి నవరాత్రోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సుప్రభాతం, ప్రాతఃకాల పూజ అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. రాజన్న సన్నిధిలో ఈనెల 30న శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ జరిగే రామన్న పెళ్లిలో శివపార్వతులు రాజన్నను కల్యాణమాడటం ప్రత్యేకం. ఈ ఉత్సవాలకు లక్షలాదిగా శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఆలయ ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ ఆధ్వర్యంలో బారికేడ్లను నిర్మిస్తున్నారు. వసంత నవరాత్రోత్సవాలకు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈవో కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డును అందుకుంటున్న పద్మావతి



పద్మావతి

* కళ

సత్యభామ.. శ్రీ కృష్ణుడు.. వేంకటేశ్వరుడు.. పద్మావతి..
దివ్యమైన పాత్రలన్నింటినీ ఆమె ఆహార్యంతో అందంగా రూపుకడుతుంది.
వైకల్యం ఆమె అభిలాషను అడ్డుకోలేకపోయింది.
అడుగు కదపలేదు అనుకున్నవారి అంచనాలను ఆవలకు నెట్టి
పట్టుదలతో అవరోధాల మెట్లను అధిరోహించింది.
రంగస్థల నటిగా గుర్తింపుతో పాటు స్వరమాధురిగానూ పేరొందింది.
కళారంగంలో రాణిస్తూనే దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ
సేవా పెన్నిధిగానూ ప్రశంసలు అందుకుంటోంది.
ఆమె ప్రతిభకు గుర్తింపుగా మూడుసార్లు
రాష్ట్రపతి పురస్కారం వరించింది.
ఖమ్మం జిల్లావాసి అయిన డాక్టర్ పొట్టబత్తిని పద్మావతి కృషి
ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

దివ్యమైన ప్రతిభ

హైదరాబాద్‌లోని తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మునుగనూరులో ఉంటున్నారు డాక్టర్ పద్మావతి. ఆమెకు ఏడాది వయస్సులో పోలియో సోకడంతో రెండు కాళ్ళు చచ్చుబడి పోయాయి. తన పరిస్థితిని చూసి కుటుంబ సభ్యులు ఆమె భవిష్యత్తుపై ఆందోళనకు గురయ్యేవారు. అయితే పద్మావతి ఐదేళ్ల వయస్సులో సెయింట్ మేరీస్ పోలియో పునరావాసం పర్యవేక్షకురాలు ఆస్ట్రేలియాకు చెందిన క్లారా హీటన్‌కు పరిచయం అయ్యారు. క్లారా దత్తత తీసుకోవడంతో పద్మావతి జీవితం కొత్త మలుపు తిరిగింది. క్లారా పర్యవేక్షణలో పద్మావతికి పలు మార్లు శస్త్ర చికిత్స జరిగింది. పాదాలు, నడుము.. భాగాలు శస్త్ర చికిత్సతో సరి చేశారు. అప్పటి వరకు మంచానికే పరిమితమైన ఆమె క్యాలిపర్స్, కర్రలు సహాయంతో క్రమంగా అడుగులు వేయడం మొదలు పెట్టింది. కాలు కదల్చలేని స్థితిలో మంచం మీద ఉండి చదువులో ప్రతిభ కనబరుస్తూ ఎదిగిన తీరు పద్మావతి మాటల్లో మన కళ్ల ముందు కదలాడుతుంది.

సేవాభిలాష

గానం, నాటక రంగంలో ఉన్న ఆసక్తితో పద్మావతి క్యాలిపర్స్ సహాయంతోనే ప్రతిభ కనబరుస్తూ వచ్చారు. సత్యభామ, శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరుడు తదితర పాత్రలను సమర్థంగా పోషించి దేశ వ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చి, ఎన్నో అవార్డులను పొందారు. వేగేశ్న ఫౌండేషన్ ద్వారా సంగీతంలో శిక్షణపొందడంతో పాటు, డిగ్రీ పూర్తి చేసి, ఆ సంస్థలోనే సంగీత ఉపాధ్యాయురాలుగా దివ్యాంగులకు శిక్షణ ఇస్తున్నారు. దివ్యాంగులకు సాయపడాలనే సంకల్పంతో మునుగనూరులో పద్మావతి ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద (డిజ్) ఏబుల్డ్ సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా దివ్యాంగులకు కంప్యూటర్, నృత్యం, సంగీతం, టైలరింగ్.. వంటి వృత్తి విద్యా కోర్స్‌లలో శిక్షణ ఇప్పించి, ఉపాధి కల్పిస్తున్నారు.



శ్రీకృష్ణుని పాత్రలో పద్మావతి

ప్రశంసలు.. పురస్కారాలు

పద్మావతి ప్రతిభకు ఎన్నో పురస్కారాలు ఆమెను వరించాయి. మూడుసార్లు రాష్ట్రపతి అవార్డులు అందుకున్నారు. ఓ వైపు కళలు, మరోవైపు సామాజిక సేవారంగంలో ప్రతిభ చూపుతున్న ఆమెను రాష్ట్ర ప్రభుత్వం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. సెన్సార్ బోర్డు సభ్యురాలుగా, నంది అవార్డు జ్యూరీ కమిటీ మెంబర్‌గా సేవలందించిన పద్మావతి 2017లో రాష్ట్ర ప్రభుత్వం రోల్ మోడల్ అవార్డును అందుకున్నారు.. కళాకారిణిగా ప్రతిభ చూపినందుకు 2009లో రాష్ట్రపతి అవార్డు లభించింది. వైకల్యంతో బాధపడుతున్నా పలు రంగాలలో రాణించినందుకు గాను 2011లో రాష్ట్రపతి చేతులు మీదుగా స్త్రీ శక్తి పురస్కారాన్ని అందుకున్నారు ఆమె. దివ్యాంగులకు చేస్తున్న సేవను గుర్తించి 2022లో రాష్ట్రపతి సర్వశ్రేష్ఠ దివ్యాంగన్ అవార్డుతో సత్కరించారు.

దివ్యాంగులకు సేవచేయాలనే సదాశయంతో నడుపుతున్న ఇన్‌స్టిట్యూట్‌కు చేయూతనందిస్తే మరిన్నో ప్రయోజన కరమైన పనులను చేయగలననే ఆశాభావాన్ని పద్మావతి వ్యక్తపరుస్తున్నారు. తన గమనమే ప్రశ్నార్థకం అవుతుందనుకున్నవారి మాటలను పక్కనపెట్టి, పట్టుదలతో ప్రయత్నించి, గెలుస్తున్న ఆమె జీవితం ఎందరికో ఆదర్శమవుతుంది.

– శ్రీరాం యాదయ్య, హయత్‌నగర్, హైదరాబాద్, సాక్షి

బ్యూటిప్స్

నలుపు మచ్చలు తగ్గాలంటే..



ముఖంపై, కళ్ల కింద లేదా మోచేతుల భాగంలో నలుపు తగ్గాలంటే..



- టీ స్పూన్ నిమ్మరసంలో స్పూన్ నీళ్లు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో దూది ఉండను ముంచి, మచ్చలపై రాయాలి. ఆరిన తర్వాత కడిగేయాలి. రోజూ ఈ విధంగా చేయడం వల్ల మచ్చలు తగ్గుతాయి.



- మచ్చలపై తేనె రాసి, 10–15 నిమిషాల తర్వాత శుభ్రం చేయాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే మచ్చలు క్రమంగా తగ్గిపోతాయి.



- కలబంద జెల్‌ను మచ్చలు ఏర్పడిన చోట రాసి, 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.



- బంగాళదుంప రసాన్ని మచ్చలున్న చోట రాయాలి. లేదంటే, బంగాళ దుంప ముక్కతో మచ్చలున్న చోట రెండు నిమిషాలు మృదువుగా రబ్ చేయాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే మచ్చలు తగ్గుతాయి.



- అవకాడో గుజ్జును మచ్చలున్న చోట మాత్రమే కాదు, ముఖమంతా రాసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. అవకాడోలో ఉన్న సహజ ఔషధ గుణాలు చర్మం పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి.



- రోజ్‌వాటర్‌లో దూది ఉండను ముంచి, మచ్చలున్న చోట రాయాలి. అలాగే శనగ పిండిలో కొన్ని చుక్కల రోజ్‌వాటర్ పోసి, పేస్ట్ చేసి రాయాలి. ఈ విధంగా రోజూ చేస్తూ ఉంటే మచ్చలు క్రమంగా తగ్గిపోతాయి.



- స్ట్రాబెర్రీలో విటమిన్ 'సి' సమృద్ధిగా ఉంటుంది. స్ట్రాబెర్రీ గుజ్జును మచ్చల మీద రాసి, ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.
- నారింజ తొక్కలను ఎండబెట్టి, పొడి చేయాలి. దీంట్లో కొద్దిగా పాలు పోసి, పేస్ట్‌లా తయారు చేయాలి. ఈ మిశ్రమాన్ని మచ్చలున్న చోట రాసి, 20 నిమిషాల తర్వాత శుభ్రం చేయాలి. తగ్గేదాకా ఈ విధంగా చేయాలి.



సందర్భం

బర్ఖాదత్, అపర్ణ పిరమాల్, నందిని సేన్ గుప్తా పుస్తకాలు బెస్ట్-నాన్ ఫిక్షనల్ విభాగంలో అట్ హర్ అవార్డ్-2023 (ఇండియా) గెలుచుకున్నాయి...

పురస్కార పుస్తకాలు

జర్నలిస్ట్‌గా బర్ఖాదత్ రెండు దశాబ్దాలకు పైగా వృత్తి జీవితం ఒక ఎత్తయితే కోవిడ్ సమయంలో చేసిన రిపోర్టింగ్ ఒక ఎత్తు. ఆ సమయంలోనే తండ్రి చనిపోయాడు. దుఃఖాన్ని బయటపడనివ్వకుండా రిపోర్టింగ్ చేయాల్సి వచ్చింది. ఎక్కడ ఏ రూపంలో మృత్యువు పొంచి ఉందో అన్నట్లుగా ఉండే ఆ కాలంలో తాను చూసిన ఎన్నో అనుభవాలకు 'టు హెల్ అండ్ బ్యాక్: హ్యూమన్స్ ఆఫ్ కోవిడ్' రూపంలో అక్షర రూపం ఇచ్చింది బర్ఖాదత్.



బర్ఖాదత్

కోవిడ్ సంక్షోభ కాలానికి అద్దంపట్టిన అక్షరాలు



అపర్ణ పిరమాల్ రాజే

కోవిడ్ సమయంలో కొత్త కొత్త మానసిక సమస్యలు తలెత్తాయి. 'ధైర్యంగా ఉంటారు' అని పేరున్న వారు కూడా ఆ సమయంలో నీరుగారిపోవడం, విచిత్రంగా ప్రవర్తించడం అనేది అన్ని ప్రాంతాల్లోనూ జరిగింది.

అలాంటి చిత్రవిచిత్ర అనుభవాలను 'కెమికల్ కిచిడీ' పుస్తకంలో నిక్షిప్తం చేసింది అపర్ణ పిరమాల్ రాజే. ఈ పుస్తకాన్ని జ్ఞాపకాల సమాహారం అనుకోవచ్చు. ఆనాటి పరిస్థితులకు అద్దం పట్టే రిపోర్టింగ్ అనవచ్చు. హెల్త్‌గైడ్ అనుకోవచ్చు.

పరిపాలనా నైపుణ్యం - సాహసతేజాల కలబోత



నందిని సేన్ గుప్తా

పాండిచ్చేరికి చెందిన రచయిత్రి, జర్నలిస్ట్ నందిని సేన్‌గుప్తా రాసిన 'రాణీ దుర్గావతి: ద ఫర్‌గొటన్ లైఫ్ ఆఫ్ ఏ వారియర్ క్వీన్' చరిత్ర వెలుగును వర్తమానంలోకి తీసుకువచ్చింది. కలింజార్ కోట (ఉత్తర్‌ప్రదేశ్)లో పుట్టిన దుర్గావతి గోండ్వానా రాణిగా చరిత్ర సృష్టించింది.

'రాణి' అనిపించుకోవడం కష్టం కాకపోవచ్చు. రాణిగా తన కిరీటాన్ని నిలుపుకోవడం చాలా కష్టం. అడుగడుగునా తనకు సమస్యలే ఎదురయ్యేవి. బయటి శత్రువులతో పాటు ఇంటి దొంగల నుంచి కూడా రకరకాల కుట్రలు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఆ కుట్రలను చాకచక్యంగా అణచివేసి 'ఉక్కు మహిళ'గా పేరు తెచ్చుకున్న రాణి దుర్గావతి పాలనాపరమైన నైపుణ్యాల నుంచి సాహస ఘట్టాల వరకు ఎన్నో విషయాలను ఈ పుస్తకంలో కళ్లకు కట్టింది నందిని సేన్‌గుప్తా.

ఇంటిప్స్



- నిమ్మనూనెలో రెండు చుక్కల వేపనూనె వేసి రాత్రి పూట దీపం వెలిగిస్తే గదంతా మంచి వాసన రావడంతోపాటు దోమల బెడద వదులుతుంది. అంతే కాదు. ఇది నేచురల్ కావడం వల్ల మస్కిటో రిపెల్లెంట్ల మూలంగా వచ్చే దుష్ఫలితాలు కూడా ఏమీ ఉండవు.

• గెలుపు దారి

యానిమేషన్ క్వీన్

యానిమేషన్‌కు సంబంధించి పెద్ద చదువులు చదివినప్పటికీ చారువీ అగర్వాల్‌కు చిన్న ఉద్యోగమైనా దొరకడం కష్టమైపోయింది. 'నీకు ఉద్యోగం దొరకనప్పుడు సొంతంగా నువ్వే కంపెనీ పెట్టు' అని ఎవరైనా అన్నారో లేదోగాని అగర్వాల్ అక్షరాలా అలాగే చేసింది. ఎంతో మందికి ఉపాధి ఇవ్వడమే కాదు ఆత్మవిశ్వాసం కూడా ఇస్తోంది...

ఫిల్మ్ స్టూడియోలలో మహిళలు తక్కువగా, యానిమేషన్ స్టూడియోలలో మరీ తక్కువగా కనిపించే కాలం అది. అలాంటి కాలంలో తన యానిమేషన్ స్టూడియోలో...

'ఆడవాళ్లు ఏంచేస్తారు. వేరే ఎవరూ లేరా!'

'మీరు చూస్తే చిన్న అమ్మాయిలా కనిపిస్తున్నారు. మీరేం చేయగలరు!'....ఇలాంటి మాటలెన్నో క్లయింట్స్ నుంచి వినిపించాయి.

పురుషాధిపత్య రంగంగా పేరున్న యానిమేషన్ రంగంలో రాణించడం మాట ఎలా ఉన్నా తొలి అడుగు వేయడమే కష్టంగా మారింది.

'నా టైమ్ బాగోలేదు. ఏం చేద్దాం' అనుకుంటే స్టోరీ మరోలా ఉండేది. టైమ్ బాగోలేకపోతే దాన్ని సెట్ చేసుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. అలా ధైర్యం తెచ్చుకుంది అగర్వాల్.

'ఒక్కసారి అవకాశం ఇవ్వండి. ఆ తరువాత మీ ఇష్టం' అనే మాట అగర్వాల్ నోటి నుంచి వచ్చింది.

తాను అలా అడగడం అదే మొదటిసారి.

ఇక ఆ అవసరం ఎప్పుడూ రాలేదు. 'ఒక్కఛాన్స్'తో అగర్వాల్‌లోని ప్రతిభ పదిమందికి తెలిసిపోయింది.

కట్ చేస్తే...

యానిమేషన్ అండ్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇప్పుడు చారువీ అగర్వాల్ అనేది సుపరిచిత పేరు అయింది. చిన్న ఆఫీస్ గదిలో మొదలైన గుర్తింపు ప్రపంచ వ్యాప్తం అయింది.

అగర్వాల్‌లో యానిమేటర్ మాత్రమే కాదు శిల్పి, పెయింటర్ కూడా ఉన్నారు. తనలోని సృజనాత్మక పరిధి విస్తరించడానికి ఇదొక కారణం.

పుట్టింది ఢిల్లీలో అయినా నాన్న ఉద్యోగరీత్యా దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో పెరిగింది. చదువుకుంది. కొత్త వ్యక్తులు, కొత్త సంస్కృతులతో పరిచయం అయింది. ఆ పరిచయం, ప్రభావం అగర్వాల్‌లో సృజనాత్మక బీజాలు పడడానికి కారణం అయ్యాయి.

'నేను ఆర్టిస్ట్ అవుతాను. వేరే ఏ ఉద్యోగం చేయను' అని తండ్రితో చెప్పింది.

ఆర్ట్‌కు సంబంధించిన విషయాల్లో ఎప్పుడూ తనకు అండగా ఉండే తండ్రికి 'ఫుల్‌టైమ్ ఆర్టిస్ట్' అనే మాట నచ్చలేదు.

అయినా సరే అగర్వాల్ మనసు మారలేదు.


తండ్రిని ఒప్పించి ఢిల్లీ యూనివర్శిటీలో ఫైన్ ఆర్ట్స్‌లో చేరింది. ఆ తరువాత కెనడాలో కంప్యూటర్ యానిమేషన్ లో మాస్టర్స్ చేసింది.

చదువు పూర్తికాగానే ముంబైకి చేరింది అగర్వాల్.

చిన్నాపెద్దా తేడా లేకుండా ఎన్నో డిజైనింగ్ స్టూడియోల చుట్టూ తిరిగినా ఉద్యోగం దొరకలేదు.

'యానిమేషన్ స్టూడియోలలో ప్రతి విభాగంలోనూ పురుషులే కనిపించేవారు. అలాంటి సమయంలో నాలాంటి వాళ్లు వచ్చి యానిమేటర్‌గా అవకాశం ఇవ్వండి అని అడగడం వారికి ఆశ్చర్యంగా అనిపించేది. నేను చేసిన పనులు, చదివిన చదువు గురించి ఎంతమాత్రం పట్టించుకునేవారు కాదు. కళ్లలో నిర్లక్ష్యం కనిపించేది' అని ఆ రోజుల్ని గుర్తు చేసుకుంటుంది అగర్వాల్.

ముంబైలో తనకు ఉద్యోగం దొరకడం అనేది ఎడారిలో నీళ్లు దొరకడమంత కష్టం అనిపించింది. ఆ సమయంలో తానే సొంతంగా కంపెనీ మొదలు పెట్టాలనుకుంది. అలా గురుగ్రామ్ కేంద్రంగా చారువీ డిజైన్ ల్యాబ్స్(సిడీఎల్) మొదలు పెట్టింది.



చారువీ అగర్వాల్



'వీళ్లేం చేస్తారులే' అనుకున్న కంపెనీ క్వాలిటీ యానిమేషన్ కంటెంట్‌తో 'వీళ్లు మాత్రమే చేయగలరు' అనిపించుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు అందుకుంది. ఎన్నో అపోహలను బద్దలు కొట్టింది. మహిళలు యానిమేషన్ రంగంపై దృష్టి సారించడానికి స్ఫూర్తి ఇచ్చింది.

'ఆర్ట్ అనేది నాకు నిరంతర స్ఫూర్తి. అండగా నిలిచే శక్తి' అంటోంది చారువీ అగర్వాల్.





ట్రావెలాదాయం

ఉద్యోగానికి సెలవు పెట్టి 'ట్రావెల్' చేయడం అనేది సాధారణం. అయితే యూత్‌లో కొందరు 'ట్రావెలింగ్'నే ఉద్యోగం చేసుకుంటున్నారు. తమ చానల్‌తో వ్యక్తిగత అభిరుచి తీర్చుకోవడంతో పాటు బ్రాండ్లతో కొలాబరేట్ కావడం ద్వారా ఆదాయాన్ని కూడా అర్జిస్తున్నారు...

ఢిల్లీకి చెందిన టాన్యా కనింజో ట్రావెలింగ్ కోసం కార్పొరేట్ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పింది. ఫుల్‌టైమ్ ట్రావెలర్‌గా మారింది. తన ఎగ్జైటింగ్ ట్రావెల్ జర్నీని ఇతరులతో పంచుకోవడానికి వ్లాగింగ్(వీడియో బ్లాగ్) చానల్‌ను ఆరంభించింది.

క్యాంపింగ్, ట్రెక్కింగ్, రకరకాల ఆహారపదార్థాల రుచులు, వివిధ సంస్కృతులకు సంబంధించి ఆసక్తికర విషయాలను పంచుకోవడంతోపాటు ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వీడియోలు చేస్తుంది.

మన ఈశాన్య రాష్ట్రాల నుంచి ఆఫ్రికా వరకు ఎన్నో ప్రదేశాలు తిరిగి వచ్చింది టాన్యా.

ముంబైకి చెందిన కృతిక గోయెల్ ప్రయాణ ఆనందాలను సొంతం చేసుకోవడంతోపాటు బ్రాండ్లతో కొలాబరేట్ కావడం ద్వారా కూడా ఆదాయాన్ని అర్జిస్తుంది.

'మీ చానల్ చూడడం మొదలుపెట్టిన తరువాత ప్రయాణాలపై ఆసక్తి మొదలైంది. ఒంటరిగా ఎన్నో ప్రయాణలు చేశాను' అంటూ ఎంతో మంది మహిళలు చెప్పినప్పుడు తన సంతోషం రెట్టింపు అవుతుంది.

'గ్లామరస్‌గా, ఫన్‌గా ఉండడమే కాదు రకరకాల సవాళ్లు ఎదురవుతుంటాయి' అని తన ప్రయాణ అనుభవాల గురించి చెబుతుంది కృతిక.

'ప్రయాణాలు నాలో ఎంతో మార్పు తీసుకువచ్చాయి. ఓపెన్ మైండ్‌తో ఆలోచించడం అలవాటు అయింది. అంతకుముందు పెద్ద సమస్యలు అనుకున్నవి ఇప్పుడు చాలా చిన్న సమస్యలుగా కనిపిస్తున్నాయి' అంటుంది కృతిక.

ట్రావెల్ కంటెంట్ క్రియేటర్‌గా పెద్ద పేరే తెచ్చుకుంది లారిసా.


చిన్నప్పుడు కుటుంబసభ్యులతో పాటు దేశంలోని ఎన్నో ప్రాంతాలకు వెళ్లిన లారిసాకు ప్రయాణలపై అలా ఆసక్తి మొదలైంది.

'ప్రయాణం ఇచ్చిన జ్ఞానం మరేదీ ఇవ్వదు. ప్రయాణం సంతోషం ఇవ్వడమే కాదు సహనాన్ని కూడా అలవాటు చేస్తుంది' అంటుంది లారిసా.

ప్రయాణాలు చేయడం ఒక ఎత్తయితే, సాంకేతిక విషయాలపై అవగాహన పెంచుకోవడం అనేది మరో ఎత్తు. తమ చానల్స్ కోసం యు కట్, వీడియో గురు, వైవా... మొదలైన వీడియో ఎడిటర్‌లను ఉపయోగించడంలో ప్రావీణ్యం సంపాదిస్తున్నారు.



టాన్యా కనింజో



లారిసా

'ప్రయాణం ఇచ్చిన జ్ఞానం మరేదీ ఇవ్వదు. ప్రయాణం సంతోషం ఇవ్వడమే కాదు సహనాన్ని కూడా అలవాటు చేస్తుంది' అంటుంది లారిసా.

మొదట్లో నాణ్యమైన వీడియోలు తీసే స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు అనుకున్నవారు ఇప్పుడు డ్రోన్ కెమెరాలపై దృష్టి పెడుతున్నారు. డ్రోన్ కెమెరాలు మన మార్కెట్‌లోకి వచ్చిన కొత్తలో ధరలు ఆకాశంలో ఉండేవి. అయితే ఇప్పుడు అందుబాటుధరల్లో ఉపయోగించే ఫ్లైయింగ్ డ్రోన్ కెమెరాలు కూడా రావడంతో వాటిపై ఆసక్తి మొదలైంది.

తమ కంటెంట్‌కు డ్రోన్ కెమెరాలు 'వావ్ టచ్' ఇస్తాయని బలంగా నమ్ముతున్నారు.

తేలికపాటి బరువుతో కూడిన ఫోల్డబుల్ డ్రోన్ కెమెరా, డ్యూయల్ డ్రోన్ కెమెరా, 4కే ఆడ్జస్టబుల్ లెన్స్, జీపీఎస్ లొకేషన్‌లతో కూడిన సూపర్ టాయ్ డ్రోన్ కెమెరా... ఇలా ఎన్నో ఉన్నాయి. ఇక ఆరంభ స్థాయిలో ఉన్నవారి కోసం లారియో వై-ఫై హెచ్‌డీ డ్రోన్ కెమెరాలాంటివి ఉన్నాయి.

ప్రయాణం అనేది ఒకప్పుడు వ్యక్తిగత అనుభూతుల సమాహారం మాత్రమే. అయితే సోషల్ మీడియా విస్తృతి పెరిగాక 'ట్రావెలింగ్'కు మంచి మార్కెట్ ఏర్పడింది. ఆ మార్కెట్ డైనమిక్స్‌ను సరిగ్గా అర్థం చేసుకుంటే ప్రయాణ దాహం తీరడమే కాదు, నాలుగు డబ్బులు కూడా సంపాదించవచ్చని యువతరంలో ఎంతోమంది సృజనాత్మకంగా నిరూపిస్తున్నారు.



సిరాజ్ చేజారిన 'టాప్' ర్యాంక్...

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ తన టాప్ ర్యాంక్‌ను కోల్పోయి మూడో స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో 3 వికెట్లు తీసిన సిరాజ్, రెండో వన్డేలో మాత్రం 3 ఓవర్లలో 37 పరుగులిచ్చాడు. ఈ ప్రదర్శనే సిరాజ్ ర్యాంక్‌పై ప్రభావం చూపింది. సిరాజ్ ఖాతాలో 702 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియా పేసర్ హాజల్‌వుడ్ 713 పాయింట్లతో టాప్ ర్యాంక్‌కు చేరుకోగా... ట్రెంట్ బౌల్ట్ (న్యూజిలాండ్) 708 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు.

టెక్సస్ సూపర్ కింగ్స్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్



అమెరికాలో జూలైలో జరగనున్న మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) టి20 టోర్నీలో పాల్గొనే టెక్సస్ సూపర్ కింగ్స్ జట్టు కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వ్యవహరిస్తాడు. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు ఫ్లెమింగ్ హెడ్ కోచ్‌గా ఉన్నాడు. ఫ్లెమింగ్ శిక్షణలో సీఎస్‌కే నాలుగుసార్లు ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచింది. ఎంఎల్‌సీలో ఆరు జట్లు బరిలో ఉండగా, నాలుగు జట్లను ఐపీఎల్ యాజమాన్యాలే కొనుగోలు చేశాయి.

సిరీస్ సమర్పయామి

నాలుగేళ్ల క్రితం ఆస్ట్రేలియా జట్టు భారత పర్యటనలో వన్డే సిరీస్‌లో ఒకదశలో 0-2తో వెనుకబడింది. కానీ చివరకు 3-2తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు కూడా దాదాపు అదే తరహాలో వెనుకబడినా కూడా పుంజుకొని కంగారూ టీమ్ భారత గడ్డపై మరో వన్డే సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకుంది. తొలి రెండు వన్డేల్లో పేస్, స్వింగ్ బౌలింగ్‌ను ఆడలేక తడబడిన టీమిండియా తుదిపోరులో స్పిన్‌కు బోల్తా పడింది. ఒక్కరు కూడా అర్ధ సెంచరీ చేయకపోయినా అంతా తలా ఓ చేయి వేయడంతో ఆసీస్ ముందుగా 269 పరుగులు సాధించింది. ఊహించినట్లుగా స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై మన బ్యాటర్లు తడబడ్డారు. రోహిత్, గిల్ ఇచ్చిన మెరుపు ఓపెనింగ్ భాగస్వామ్యం, ఆ తర్వాత కోహ్లి, రాహుల్ అర్ధ సెంచరీ పార్ట్‌నర్‌షిప్‌తో ఒకదశలో టీమిండియా విజయం దిశగా సాగుతున్నట్లు అనిపించింది. అయితే 39 పరుగుల వ్యవధిలో నాలుగు కీలక వికెట్లు కోల్పోయి జట్టు ఓటమిని ఆహ్వానించింది. టెస్టు సిరీస్ కోల్పోయినా ఒక మ్యాచ్ నెగ్గిన ఆసీస్ బృందం, ఇప్పుడు వన్డే సిరీస్‌తో సంతృప్తిగా స్వదేశం వెళ్లనుంది.



రోహిత్ శర్మ

- చివరి వన్డేలో ఓడిన భారత్
- 2-1తో సిరీస్ ఆస్ట్రేలియా సొంతం
- ఆసీస్‌ను గెలిపించిన స్పిన్నర్లు
- టీమిండియా సమష్టి వైఫల్యం



చెన్నై: స్టీవ్ స్మిత్ సారథ్యంలోని ఆస్ట్రేలియా స్ఫూర్తిదాయక ప్రదర్శనతో వన్డే సిరీస్‌ను గెలుచుకుంది. బుధవారం జరిగిన చివరి మ్యాచ్‌లో ఆసీస్ 21 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. తొలి మ్యాచ్‌లో ఓడి రెండో వన్డేలో నెగ్గిన కంగారూ బృందం 2–1తో సిరీస్‌ను దక్కించుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 49 ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (47 బంతుల్లో 47; 8 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... పాండ్యా, కుల్దీప్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 49.1 ఓవర్లలో 248 పరుగులకే ఆలౌటైంది. కోహ్లి (72 బంతుల్లో 54; 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా, హార్దిక్ పాండ్యా (40 బంతుల్లో 40; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆడమ్ జంపా (4/45) భారత్‌ను దెబ్బ తీశాడు. మెరుపు వేగంతో ఈ సిరీస్‌లో 194 పరుగులు చేసిన మిచెల్ మార్ష్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యాడు.

ఆసీస్ శుభారంభం...

గత మ్యాచ్‌ల తరహాలోనే ఆసీస్‌కు ఓపెనర్లు హెడ్ (31 బంతుల్లో 33; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్ష్ శుభారంభం అందించారు. వీరిద్దరు తొలి 10 ఓవర్లలో 61 పరుగులు జత చేశారు. పిచ్‌పై స్పిన్‌కు అనుకూలిస్తున్నట్లు కనిపించడంతో ఆరో ఓవర్లోనే భారత్ అక్షర్‌తో బౌలింగ్ చేయించింది. అయితే పాండ్యా బౌలింగ్‌కు దిగి మ్యాచ్ పరిస్థితిని మార్చాడు. తన తొలి మూడు ఓవర్లలో అతను హెడ్, స్మిత్ (0), మార్ష్‌లను పెవిలియన్ పంపించాడు. ఈ దశలో వార్నర్ (23), లబుషేన్ (28) కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరిని కుల్దీప్ అవుట్ చేయడంతో స్కోరు 138/5 వద్ద నిలిచింది. ఈ సమయంలో క్యారీ (46 బంతుల్లో 38; 2 ఫోర్లు, 1 సిక్స్), స్టొయినిస్ (25) భాగస్వామ్యం జట్టు ఇన్నింగ్స్‌ను నడిపించింది. వీరిద్దరు 58 పరుగులు జత చేశారు. భారత బౌలర్లు మళ్లీ దెబ్బ కొట్టడంతో ఆసీస్ స్కోరు 203/7కు చేరింది. సరిగ్గా ఇక్కడే భారత్ పట్టు కోల్పోయింది. లోయర్ ఆర్డర్ అండతో చివరి మూడు వికెట్లకు ఆసీస్ 66 పరుగులు జత చేయడం విశేషం.

రాణించిన పాండ్యా...

ఛేదనను ఓపెనర్లు రోహిత్ శర్మ (17 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (49 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ప్రారంభించారు. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై ఎదురుదాడినే నమ్ముకున్నారు. అయితే 12 పరుగుల వ్యవధిలో వీరిద్దరిని ఆసీస్ వెనక్కి పంపించింది. ఈ దశలో కోహ్లి, రాహుల్ (50 బంతుల్లో 32; 2 ఫోర్లు, 1 సిక్స్) జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 69 పరుగులు జత చేశారు. అయితే మరీ నెమ్మదిగా ఆడిన రాహుల్‌తో పాటు అక్షర్ (2) కూడా నిష్క్రమించారు. కోహ్లి, పాండ్యా ఉన్నంత వరకు భారత్‌కు గెలుపు ఆశలు ఉన్నాయి. 61 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లి పేలవ షాట్‌కు వెనుదిరగడంతో ఆసీస్ ఒత్తిడి పెంచింది. సూర్యకుమార్ (0) విఫలం కాగా, పాండ్యాను అవుట్ చేసి జంపా దెబ్బ కొట్టాడు. రవీంద్ర జడేజా (33 బంతుల్లో 18; 1 ఫోర్) ఆశించిన స్థాయిలో వేగంగా ఆడలేకపోవడంతో లక్ష్యం మరీ కష్టంగా మారిపోయింది. మరింత కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన ఆసీస్ భారత బ్యాటర్లను కట్టడి చేయడంతో చివరకు ఓటమి తప్పలేదు.

సూర్యకుమార్ 'హ్యాట్రిక్ గోల్డెన్ డక్'

పాపం సూర్యకుమార్ యాదవ్... టి20ల్లో విధ్వంసకర బ్యాటింగ్‌తో నంబర్‌వన్‌గా ఎదిగిన అతను వన్డేల్లో మాత్రం 'బంబే డక్'గా మారిపోయాడు. ఈ సిరీస్‌కు ముందు కూడా వన్డేల్లో గొప్ప రికార్డేమీ లేకపోయినా ఈసారి ప్రదర్శన మాత్రం అయ్యో అనిపించేదే. సిరీస్‌లో ఆడిన మూడు వన్డేల్లోనూ తొలి బంతికే వెనుదిరిగి 0, 0, 0తో 'హ్యాట్రిక్ గోల్డెన్ డక్'ను నమోదు చేశాడు. గతంలో భారత ఆటగాళ్లు వరుసగా మూడు వన్డేల్లో డకౌటైనా, ఇలా మూడుసార్లు తొలి బంతికే ఎవరూ వెనుదిరగలేదు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (సి) కుల్దీప్ (బి) పాండ్యా 33; మార్ష్ (బి) పాండ్యా 47; స్మిత్ (సి) రాహుల్ (బి) పాండ్యా 0; వార్నర్ (సి) పాండ్యా (బి) కుల్దీప్ 23; లబుషేన్ (సి) గిల్ (బి) కుల్దీప్ 28; క్యారీ (బి) కుల్దీప్ 38; స్టొయినిస్ (సి) గిల్ (బి) అక్షర్ 25; అబాట్ (బి) అక్షర్ 26; అగర్ (సి) అక్షర్ (బి) సిరాజ్ 17; స్టార్క్ (సి) జడేజా (బి) సిరాజ్ 10; జంపా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (49 ఓవర్లలో ఆలౌట్) 269. వికెట్ల పతనం**: 1-68, 2-74, 3-85, 4-125, 5-138, 6-196, 7-203, 8-245, 9-247, 10-269. **బౌలింగ్:** షమీ 6-0-37-0, సిరాజ్ 7-1-37-2, అక్షర్ 8-0-57-2, పాండ్యా 8-0-44-3, జడేజా 10-0-34-0, కుల్దీప్ 10-1-56-3.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) స్టార్క్ (బి) అబాట్ 30; గిల్ (ఎల్బీ) (బి) జంపా 37; కోహ్లి (సి) వార్నర్ (బి) అగర్ 54; రాహుల్ (సి) అబాట్ (బి) జంపా 32; అక్షర్ (రనౌట్) 2; పాండ్యా (సి) స్మిత్ (బి) జంపా 40; సూర్యకుమార్ (బి) అగర్ 0; జడేజా (సి) స్టొయినిస్ (బి) జంపా 18; కుల్దీప్ (రనౌట్) 6; షమీ (బి) స్టొయినిస్ 14; సిరాజ్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (49.1 ఓవర్లలో ఆలౌట్) 248. వికెట్ల పతనం:** 1-65, 2-77, 3-146, 4-151, 5-185, 6-185, 7-218, 8-225, 9-243, 10-248. **బౌలింగ్:** స్టార్క్ 10-0-67-0, స్టొయినిస్ 9.1-0-43-1, అబాట్ 10-0-50-1, జంపా 10-0-45-4, అగర్ 10-0-41-2.

నిఖత్‌కు పతకం ఖాయం

సెమీఫైనల్లో భారత స్టార్ బాక్సర్ • నీతూ, స్వీటీ, లవ్లీనాలకు కూడా పతకాలు



నిఖత్

న్యూఢిల్లీ: ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు నాలుగు పతకాలు ఖాయమయ్యాయి. డిఫెండింగ్ చాంపియన్, తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ (50 కేజీలు)తోపాటు నీతూ (48 కేజీలు), లవ్లీనా బొర్గోహైన్ (75 కేజీలు), స్వీటీ బూరా (81 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాలను ఖరారు చేసుకున్నారు. భారత్‌కే చెందిన సాక్షి చౌదరీ (52 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు), జాస్మిన్ (60 కేజీలు), నుపుర్ (ప్లస్ 81 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో నిఖత్ 5–2తో చుథామట్ రక్సాట్ (థాయ్‌లాండ్)పై, లవ్లీనా 5–0తో అడోసిండా (మొజాంబిక్)పై, స్వీటీ 5–0తో విక్టోరియా కెబికావా (బెలారస్)పై గెలుపొందారు. మరో బౌట్‌లో నీతూ పంచ్‌ల ధాటికి ఆమె ప్రత్యర్థి మదోక వాడా (జపాన్) తట్టుకోలేకపోవడంతో రిఫరీ రెండో రౌండ్‌లోనే బౌట్‌ను నిలిపి వేసి నీతూను విజేతగా ప్రకటించారు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో సాక్షి 0–5తో యు వూ (చైనా) చేతిలో, మనీషా 1–4తో అమీనా జిదాని (ఫ్రాన్స్) చేతిలో, జాస్మిన్ 0–5తో పాలో వాల్డెజ్ (కొలంబియా) చేతిలో, నుపుర్ 3–4తో లజత్ కుంగెబయేవా (కజకిస్తాన్) చేతిలో ఓటమి చవిచూశారు.

సరబ్‌జ్యోత్ 'పసిడి' గురి

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ



భోపాల్: సొంతగడ్డపై బుధవారం మొదలైన ప్రపంచ కప్ పిస్టల్, రైఫిల్ షూటింగ్ టోర్నీలో తొలి రోజు భారత షూటర్లు రెండు పతకాలతో మెరిశారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సరబ్‌జ్యోత్ సింగ్ స్వర్ణ పతకం సాధించగా... వరుణ్ తోమర్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో 21 ఏళ్ల సరబ్‌జ్యోత్ ఫైనల్లో 16–0తో రుస్లాన్ లునెవ్ (అజర్‌బైజాన్)పై గెలుపొందాడు. క్వాలిఫయింగ్‌లో సరబ్‌జ్యోత్ 585 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా... వరుణ్ 579 పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌లో నిలిచి ర్యాంకింగ్ రౌండ్‌కు అర్హత పొందారు. ఎనిమిది మంది పాల్గొన్న ర్యాంకింగ్ రౌండ్‌లో సరబ్‌జ్యోత్ 253.2 పాయింట్లు, రుస్లాన్ 251.9 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించారు. 250.3 పాయింట్లతో వరుణ్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు.

శ్రీకాంత్ శుభారంభం




బాసెల్: స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 21–16, 15–21, 21–18తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)పై గెలిచి ప్రీక్వార్టర్ ఫైనల్ చేరాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–ఆరతి (భారత్) 12–21, 14–21తో సయాక హొబారా-యు సుజు (జపాన్) చేతిలో... పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) 14–21, 14–21తో అప్రియాని–సితి ఫాదియా (ఇండోనేసియా) చేతిలో... మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–రోహన్ (భారత్) 22–20, 19–21, 15–21తో హీ యోంగ్ కాయ్ టెరీ–తాన్ వె హాన్ జెసికా (సింగపూర్) చేతిలో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం 21–15, 21–18తో జిన్ యువాన్ బూన్–తియెన్ సి హోంగ్ (మలేసియా) జోడీని ఓడించింది.

సినిమా

పోస్టర్ చూద్దాం

పండగ చేద్దాం.. పోస్టర్ చూద్దాం అన్నట్లు ఉగాది సందర్భంగా బోలెడన్ని కొత్త పోస్టర్లు రిలీజ్ అయ్యాయి. వాటిలో కొన్ని పోస్టర్లను చూద్దాం.

- వెంకటేశ్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెడికల్ మాఫియా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోందనే టాక్ వినిపిస్తోంది.
- పల్లకి మోస్తున్నారు గోపీచంద్. 'లక్ష్యం', 'లౌక్యం' చిత్రాల తర్వాత హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'రామబాణం'. ఈ చిత్రంలో డింపుల్ హయతి హీరోయిన్. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న ఈ సినిమా మే 5న విడుదల కానుంది.
- నాగచైతన్య పోలీస్‌గా నటిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'కస్టడీ'. కృతీ శెట్టి హీరోయిన్. వెంకట్ ప్రభు దర్శకత్వంలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రం మే 12న రిలీజవుతుంది.
- కల్యాణ్ రామ్ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'డెవిల్: ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్'. నవీన్ మేడారం దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడికల్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సినిమాను అభిషేక్ నామా నిర్మిస్తున్నారు.
- 'మామా మశ్చీంద్ర' చిత్రంలో ట్రిపుల్ క్యారెక్టర్స్ చేస్తున్నారు సుధీర్‌బాబు. దర్శక-నటుడు హర్షవర్ధన్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో దుర్గ, పరశురామ్, డీజే పాత్రల్లో కనిపిస్తారు సుధీర్ బాబు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
- సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న మిస్టిక్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సంయుక్తా మీనన్ హీరోయిన్. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 21న విడుదల కానుంది.
- వరుణ్ తేజ్ తాజా చిత్రం 'అర్జునదారి గాండీవ'. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.
- కార్తికేయ హీరోగా నటించిన తాజా చిత్రం 'బెదురులంక 2012'. 2012 యుగాంతం కాన్సెప్ట్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు క్లాక్స్ దర్శకత్వం వహించారు. నేహా శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రానికి ముప్పానేని రవీంద్ర బెనర్జీ నిర్మాత.
- పోలీసాఫీసర్‌గా కిరణ్ అబ్బవరం నటించిన చిత్రం 'మీటర్'. అతుల్యా రవి హీరోయిన్‌గా నటించారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌ల సమర్పణలో చెర్రీ (చిరంజీవి), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది.
- దగ్గుబాటి అభిరామ్‌ను హీరోగా పరిచయం చేస్తూ దర్శకుడు తేజ తెరకెక్కించిన చిత్రం 'అహింస'. గీతికా తివారి ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించారు. పి. కిరణ్ నిర్మించారు. ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది.
- 'రౌడీబాయ్స్' ఫేమ్ ఆశిష్ హీరోగా రూపొందుతున్న ద్వితీయ చిత్రం 'సెల్ఫిష్'. ఈ చిత్రానికి విశాల్ కాశి దర్శకత్వం వహిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్, సుకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, అశోక్ బండ్రెడ్డి సహనిర్మాతలు.
- రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'జనతా బార్'. రమణ మొగిలి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. వచ్చే నెలలో విడుదల కానున్న ఈ సినిమాను రమణ మొగిలి, తిరుపతిరెడ్డి బీరం నిర్మించారు. ''స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకున్న మహిళలపై ఆ స్పోర్ట్స్ ఉన్నతాధికారులు తమ అధికారాన్ని అడ్డు పెట్టుకుని చేస్తున్న సెక్సువల్ హెరాస్‌మెంట్‌కు చరమగీతం పాడటానికి పోరాడిన ఓ మహిళ కథ ఇది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



సాయిధరమ్



రాయ్ లక్ష్మి



వెంకటేశ్



జగపతిబాబు, గోపీచంద్



నాగచైతన్య, కృతీ శెట్టి



సాక్షీ వైద్య, వరుణ్ తేజ్



ఆశిష్

కామెడీ ఎంటర్‌టైనర్ షురూ



సురేష్‌బాబు, 'అల్లరి' నరేశ్, ఫరియా

'అల్లరి' నరేశ్ హీరోగా కొత్త సినిమా ఆరంభమైంది. మల్లి అంకం దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి డైరెక్టర్ తరుణ్ భాస్కర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సురేష్‌బాబు క్లాప్ ఇచ్చారు. డైరెక్టర్ నాగ్ అశ్విన్ గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాతలు కిరణ్, శరత్ మరార్‌లు యూనిట్‌కి స్క్రిప్ట్ అందజేశారు. ''మంచి కామెడీ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు 'అల్లరి' నరేశ్. ''మల్లిగారితో సినిమా చేస్తానని పదేళ్ల క్రితమే చెప్పాను. ఇప్పుడు తీస్తున్నాను'' అన్నారు రాజీవ్ చిలక. ''అందరూ గర్వపడే సినిమా చేస్తాననే నమ్మకం ఉంది'' అన్నారు మల్లి అంకం.

రెండోసారి

హీరో నితిన్, హీరోయిన్ రష్మికా మందన్నా, డైరెక్టర్ వెంకీ కుడుముల రెండోసారి కలిసి పని చేయనున్నారు. వీరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి చిత్రం 'భీష్మ' (2020) మంచి హిట్ అయింది. ఈ ముగ్గురి కాంబినేషన్లో మరో కొత్త చిత్రం రానున్నట్లు ఉగాది సందర్భంగా ఒక వీడియో ద్వారా ఈ చిత్రాన్ని ప్రకటించారు మేకర్స్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమా నిర్మించనున్నారు. ''వినోదాత్మకంగా, అడ్వంచరస్‌గా ఈ మూవీ ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్.



వెంకీ, నితిన్, రష్మిక

గ్రామీణ రంగబలి

నాగశౌర్య హీరోగా పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'రంగబలి' టైటిల్ ఖరారు చేశారు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఉగాది సందర్భంగా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే వినూత్నమైన కథ ఇది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పవన్ సీహెచ్, కెమెరా: దివాకర్‌మణి.



నాగశౌర్య

వేసవిలో సామజవరగమన

శ్రీ విష్ణు, రెబా మోనికా జాన్ జంటగా నటించిన చిత్రం 'సామజవరగమన'. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ సినిమాను మే 18న రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్.



'సామజవరగమన'లో ఓ దృశ్యం

పాటల సందడి



రవితేజ

ఉగాది పండగని పురస్కరించుకుని పలు సినిమాల నుంచి పాటలు విడుదలయ్యాయి. ఆ పాటల సందడి విశేషాలు చూద్దాం..

- రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ సినిమా నుంచి 'డిక్కా డిష్యూం..' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని స్వాతి రెడ్డి యుఖే, భీమ్స్, నరేష్ మామిండ్ల ఆలపించారు.
- శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తీ సురేష్ జంటగా నటించిన 'దసరా' ఈ నెల 30న రిలీజ్ కానుంది. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమాకి సంతోష్ నారాయణన్ స్వరపరచిన 'ధూం ధాం దోస్తాన్..' అనే వీడియో సాంగ్‌ని రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్, కనకవ్వ, గన్నోర దాసు లక్ష్మి, పాలమూరు జంగిరెడ్డి, నర్సన్న, కాసర్ల శ్యామ్ పాడారు.
- అనుష్క శెట్టి, నవీన్ పోలిశెట్టి నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. పి. మహేష్ కుమార్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించారు. ఈ సినిమా నుంచి 'పుత్తడి బొమ్మ కోవెల కొమ్మ..' అనే తొలి లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. రధన్ సంగీతం అందించిన ఈ పాటను అనంత్ శ్రీరామ్ రాయగా, ఎమ్ఎమ్ మానసి పాడారు.
- రాఘవ లారెన్స్ హీరోగా నటించిన చిత్రం 'రుద్రుడు'. కదిరేశన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నిర్మాత 'ఠాగూర్' మధు తెలుగులో ఏప్రిల్ 14న విడుదల చేస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'భగ భగ రగలరా..' పాటని రిలీజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటని పృథ్వీ చంద్ర పాడారు.
- యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వం వహించిన చిత్రం 'పరారి'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ 30న రిలీజవుతోంది. ఈ చిత్రం కోసం మహిత్ నారాయణ్ స్వరాలు సమకూర్చి, రాసిన 'ఏమో ఏమో..' పాటని నటి విజయశాంతి రిలీజ్ చేశారు. ఈ పాటను సాయి చరణ్, సురభి శ్రావణి పాడారు.



నాని



లారెన్స్



అనుష్క



యోగేశ్వర్, అతిథి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
140	44
58,215	17,152

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,872	▲ 11
డోజోన్స్	32,478	▼ 68
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,567	▲ 31
డాక్స్	15,216	▲ 21
షాంఘై	3,265	▲ 10
నికాయ్	27,467	▲ 521

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

హీరో వాహనాలు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ కంపెనీ హీరో మోటోకార్ప్ మోటార్‌సైకిల్స్, స్కూటర్ల ధరలను సుమారు 2 శాతం పెంచుతోంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ధరలు వర్తించనున్నాయి. వచ్చే నెల నుంచి అమలులోకి రానున్న నూతన ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా వాహనాల తయారీ చేపట్టడంతో వ్యయం పెరిగింది. దీంతో ధరలు సవరించాల్సి వచ్చిందని కంపెనీ బుధవారం ప్రకటించింది. వెలువడే కాలుష్య స్థాయిని తెలిపే పరికరం ప్రతి వాహనానికి తప్పనిసరి.

రూ.1,000 కోట్ల పెట్టుబడులు: కోరమాండల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ సస్యరక్షణ రసాయనాల విభాగంలో కార్యకలాపాలను విస్తరించాలని నిర్ణయించింది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంవో) వ్యాపారంలోకి ప్రవేశించాలన్న ప్రణాళికను బుధవారం సమావేశమైన కంపెనీ బోర్డు ఆమోదించింది. ప్రత్యేక, పారిశ్రామిక రసాయనాల తయారీలోకి సైతం ఎంట్రీ ఇవ్వనుంది. ఈ విభాగాల్లో వచ్చే రెండేళ్లలో రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టాలన్నది కోరమాండల్ ప్రణాళిక. ఈ వ్యాపారాలు గణనీయమైన వృద్ధి అవకాశాలను అందిస్తాయని కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-3-2023	
విశాఖ	450-00
చిత్తూరు	473-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438-00
విజయవాడ	438-00
రిటైల్ ధర (డజను)	66.00
22-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.95

కుబేరుల్లో ఒకే ఒక్కడు అంబానీ!

- హురున్ టాప్-10 సంపన్నుల్లో ఏకైక భారతీయుడు; 9వ ర్యాంకు
- 23వ స్థానానికి అదానీ



ముకేశ్ అంబానీ | గౌతమ్ అదానీ | సైరస్ పూనావాలా

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వ్యవహారంతో పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీ సంపద భారీగా కరిగిపోవడంతో.. అంతర్జాతీయంగా టాప్ 10 కుబేరుల్లో భారత్ నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ఒక్కరే చోటు దక్కించుకున్నారు. 82 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన తొమ్మిదో స్థానంలో నిలవగా 53 బిలియన్ డాలర్ల సంపదతో అదానీ 23వ స్థానానికి పరిమితమయ్యారు. డాలర్ల మారకంలో సంపదను లెక్కిస్తూ రీసెర్చ్ సంస్థ హురున్, రియల్ ఎస్టేట్ గ్రూప్ ఎం3ఎం కలిసి రూపొందించిన '2023 గ్లోబల్ రిచ్ లిస్ట్' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఆసియాలోనే అత్యంత సంపన్నుడిగా అంబానీ మూడోసారి టైటిల్ నిలబెట్టుకున్నారు. వ్యాపారవేత్తల దృష్టి కోణం నుంచి ప్రస్తుత ప్రపంచ ఎకానమీ పరిస్థితులను ఆవిష్కరించేలా ఈ జాబితా ఉందని హురున్ ఇండియా ఎండీ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు.

క్షీణతలో బెజోస్ టాప్..

ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్.. అత్యధికంగా సంపద పోగొట్టుకున్న వారి లిస్టులో టాప్‌లో నిల్చారు. ఆయన సంపద 70 బిలియన్ డాలర్లు పడిపోయి 118 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. అంబానీ, అదానీ కలిసి పోగొట్టుకున్న సంపద కన్నా ఇది ఎక్కువ కావడం గమనార్హం. హురున్ రిపోర్ట్ ప్రకారం ఇలా భారీగా పోగొట్టుకున్న వారి లిస్టులో బెజోస్ అగ్రస్థానంలో ఉండగా.. అదానీ 6, అంబానీ 7వ ర్యాంకుల్లో నిల్చారు. 2022-23లో అదానీ సంపద 35 శాతం పడిపోయింది. 28 బిలియన్ డాలర్ల మేర (రోజుకు రూ. 3,000 కోట్లు చొప్పున) క్షీణించి మార్చి మధ్య నాటికి 53 బిలియన్ డాలర్లకు తగ్గింది. అంబానీ సంపద కూడా క్షీణించినప్పటికీ తగ్గుదల 20 శాతానికే పరిమితమైంది. అదానీ గ్రూప్ సంస్థల ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణల తదనంతర పరిణామాలతో గౌతమ్ అదానీ సంపద భారీగా కరిగిపోయిన సంగతి తెలిసిందే.

టాప్ 100లో మనోళ్లు..

పేరు	ర్యాంకు	సంపద (బి.డాలర్లలో)
ముకేశ్ అంబానీ	9	82
గౌతమ్ అదానీ కుటుంబం	23	53
సైరస్ పూనావాలా	46	27
శివ్ నాడార్ కుటుంబం	50	26
లక్ష్మీ ఎన్ మిట్టల్	76	20
ఎస్‌పీహిందుజా కుటుంబం	76	20
దిలీప్ సంఘ్వీ కుటుంబం	98	17

మరిన్ని విశేషాలు..

- 2023 గ్లోబల్ రిచ్ లిస్ట్‌లో సంపన్నుల సంఖ్య 3,112కు తగ్గింది. గతేడాది ఇది 3,384గా ఉంది. వారి మొత్తం సంపద 10 శాతం తగ్గి 13.7 లక్షల కోట్ల డాలర్లకు పరిమితమైంది.
- గతేడాదితో పోలిస్తే భారత్‌లో బిలియనీర్ల సంఖ్య 28 తగ్గి 187కి చేరింది. ముంబైలో అత్యధికంగా 66 మంది ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులను పరిగణనలోకి తీసుకుంటే బిలియనీర్ల సంఖ్య 217గా ఉంది. మొత్తం కుబేరుల సంపదలో భారత్ వాటా 5 శాతంగా ఉంది. కాగా, అమెరికా వాటా అత్యధికంగా 32 శాతంగా ఉంది. భారత్‌తో పోలిస్తే చైనాలో బిలియనీర్ల సంఖ్య అయిదు రెట్లు అధికంగా ఉండటం గమనార్హం.
- భారత్‌లో 10 మంది మహిళా బిలియనీర్లు ఉన్నారు. సాఫ్ట్‌వేర్, సర్వీసుల విభాగంలో స్వయంకృషితో బిలియనీరుగా ఎదిగిన వారిలో 4 బిలియన్ డాలర్ల సంపదతో రాధా వెంబు రెండో స్థానంలో నిల్చారు. దివంగత ఇన్వెస్ట్‌మెంట్ గురు రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా సతీమణి రేఖా ఈసారి కుబేరుల లిస్టులో స్థానం దక్కించుకున్నారు.

పద్మభూషణ్ స్వీకరించిన కుమార మంగళం బిర్లా



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా బుధవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి పద్మభూషణ్ అవార్డును స్వీకరించారు. దీనితో బిర్లా కుటుంబంలో దేశ అత్యున్నత పౌర పురస్కారం అందుకున్న నాల్గవ వ్యక్తిగా నిలిచారు. ఆయన ముత్తాత జీడీ బిర్లా 1957లో పద్మవిభూషణ్ గ్రహీత. తల్లి రాజశ్రీ బిర్లా 2011లో పద్మభూషణ్ పురస్కారం పొందారు. కుమార మంగళం బిర్లా తాత బీకే బిర్లా బంధువు జీపీ బిర్లా 2006లో పద్మభూషణ్‌ను అందుకున్నారు. ఆయన 28 ఏళ్ల సుదీర్ఘ వాణిజ్య అనుభవంలో గ్రూప్ టర్నోవర్ 30 రెట్లు పెరిగి 60 బిలియన్ డాలర్లకు చేరింది. ''ఉన్నత లక్ష్యానికి వ్యాపారం దోహదపడుతూ, జీవితాలను సుసంపన్నం చేయాలన్న ఆదిత్య బిర్లా గ్రూప్ సంకల్పానికి ఈ అవార్డు ఒక గుర్తింపు'' అని కుమార మంగళం బిర్లా పేర్కొన్నారు. ఈ ఏడాది మరణానంతర పద్మశ్రీ అవార్డులు లభించిన వారిలో ప్రముఖ శీతల పానీయాల బ్రాండ్ రస్నా వ్యవస్థాపకుడు, దివంగత అరీజ్ ఖంబట్టా, దిగ్గజ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్‌ఝున్‌వాలా ఉన్నారు.

ఫెడ్ 0.25 శాతం వడ్డీ పెంపు

4.75-5 శాతానికి ఫండ్స్ రేటు



న్యూయార్క్: అంచనాలకు అనుగుణంగా యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటును 0.25 శాతం పెంచింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేటు 4.75-5 శాతానికి చేరింది. నిజానికి కొద్ది నెలలుగా ద్రవ్యోల్బణ అదుపునకే అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్న ఫెడ్.. వడ్డీ రేట్లను వేగంగా పెంచుతూ వస్తోంది. దీంతో 2022 మార్చి నుంచి 2023 ఫిబ్రవరి 01 వరకూ దశలవారీగా 4.5 శాతం వడ్డీ రేటును పెంచింది. వెరసి 2022 ఫిబ్రవరిలో 0-0.25 శాతంగా ఉన్న ఫండ్స్ రేటు తాజాగా 5 శాతానికి ఎగసింది. ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ అంచనాలను మించి వడ్డీ రేట్లు పెరిగే వీలున్నట్లు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొద్ది రోజులుగా అమెరికా, యూరప్ బ్యాంకింగ్ రంగాలలో సంక్షోభ పరిస్థితులు తలెత్తడంతో ఫెడ్ పాలసీ సమీక్షకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. యూఎస్‌లో సిల్వర్‌గేట్ క్యాపిటల్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్ ఇప్పటికే విఫలంకాగా.. ప్రస్తుతం ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంకు సంక్షోభంలో ఉంది. మరోవైపు క్రెడిట్ స్వీస్ దివాలా స్థితికి చేరడంతో యూరప్ బ్యాంకింగ్ రంగంలోనూ ప్రకంపనలు పుడుతున్నాయి. స్విస్ కేంద్ర బ్యాంకు కల్పించుకుని యూబీఎస్‌ను రంగంలోకి దించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపు వేగానికి బ్రేక్ పడనున్నట్లు పలువురు విశ్లేషకులు భావిస్తూ వచ్చారు.

ట్యాక్స్‌పేయర్ల కోసం ఐటీ శాఖ యాప్

న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారుల కోసం ఆదాయ పన్ను శాఖ తాజాగా ఏఐఎస్ ట్యాక్స్‌పేయర్ పేరిట మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఇది వారి టీడీఎస్/టీసీఎస్, వడ్డీ, డివిడెండ్లు, షేర్ల లావాదేవీలు మొదలైన వాటి సమగ్ర సమాచారాన్ని ఒకే దగ్గర చూసుకునేందుకు, ఫీడ్‌బ్యాక్ ఇచ్చేందుకు ఉపయోగపడుతుంది. గూగుల్ ప్లే, యాప్ స్టోర్‌లో ఈ ఉచిత యాప్ అందుబాటులో ఉంటుందని కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఒక ప్రకటనలో తెలిపింది. తమ పాన్ నంబర్ ద్వారా ఈ యాప్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు.

సూచీలకు స్వల్పలాభాలు

- ఫెడ్ ప్రకటనకు ముందు అప్రమత్తత
- సెన్సెక్స్ లాభం 140 పాయింట్లు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో కదలాడిన స్టాక్ సూచీలు బుధవారం స్వల్పలాభాలతో గట్టెక్కాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న దేశీయ సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 170 పాయింట్లు పెరిగి 58,245 వద్ద, నిఫ్టీ 71 పాయింట్లు లాభంతో 17,177 వద్ద ప్రారంభమయ్యాయి. తొలి దశలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 344 పాయింట్లు ఎగసి 58,418 వద్ద, నిఫ్టీ 100 పాయింట్లు బలపడి 17,207 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. అయితే దేశీయ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగుతుండటంతో సూచీలు ఆరంభ లాభాల్ని కోల్పోయాయి. ఫలితంగా సెన్సెక్స్ 140 పాయింట్ల స్వల్పలాభంతో 58,215 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 44 పాయింట్లు పెరిగి 17,152 వద్ద నిలిచింది. ఫార్మా, ఫైనాన్స్, బ్యాంకింగ్, ఐటీ కమోడిటీ షేర్లు రాణించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.50%, 0.18 శాతం చొప్పున లాభపడ్డాయి. మెటల్, మీడియా, రియల్టీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023

ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023(ఏపీ ఐసెట్) నోటిఫికేషన్ విడుదలైంది. ఈ పరీక్షను అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్‌కేయూ) నిర్వహించనుంది. ఏపీ ఐసెట్‌లో ర్యాంకు ద్వారా 2023 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, అఫిలియేటెడ్ కళాశాలల్లో ఫుల్‌టైం ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

» **కోర్సులు:** మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ)/మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(ఎంసీఏ).
» **అర్హత:** ఎంబీఏ కోర్సుకు బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం, బీసీఏ, బీఈ, బీటెక్, బీఫార్మసీ; ఎంసీఏ కోర్సుకు బీసీఏ, డిగ్రీ(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్), బీఎస్సీ, బీకాం, బీఏ(ఇంటర్/డిగ్రీ స్థాయిలో గణితం సబ్జెక్టు చదివి ఉండాలి) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** కనీస వయస్సు 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయసు పరిమితి లేదు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** మార్చి 20న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై ఏప్రిల్ 19తో ముగుస్తుంది.
» **పరీక్షల తేది:** మే 24, 25 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి.
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

ఏపీ పీజీఈసెట్-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2023(ఏపీ పీజీఈసెట్) నోటిఫికేషన్‌ను విడుదలచేసింది.

» **కోర్సులు:** ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మ్ డీ.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీటెక్/బీఫార్మసీ ఉత్తీర్ణత పొందిన/చివరి ఏడాది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» గేట్/జీప్యాట్ అర్హత సాధించిన అభ్యర్థులకు విడిగా నోటిఫికేషన్ విడుదలచేస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.04.2023
» **పరీక్ష తేది:** 28.05.2023 నుంచి 30.05.2023
» **వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కర్ణాటకలో 50 టీచింగ్ పోస్టులు

కలబురగిలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ కర్ణాటక.. వివిధ సబ్జెక్టుల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-18, అసోసియేట్ ప్రొఫెసర్-32.
» **సబ్జెక్టులు:** హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, సైకాలజీ, కామర్స్, సోషల్ వర్క్, జియాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఎడ్యుకేషన్, లా తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు బోధన/పరిశోధన/పారిశ్రామిక రంగంలో పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**17.04.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 25.04.2023.
» **వెబ్‌సైట్:** www.cuk.ac.in

ఎస్వీనిట్, సూరత్‌లో 50 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

సూరత్(గుజరాత్)లోని సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్వీనిట్).. వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
» **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మ్యాథమేటిక్స్ అండ్ హ్యూమానిటీస్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధన, పరిశోధన అనుభవం ఉండాలి. వయసు: 60 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,01,500 నుంచి రూ.1,67,400 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ప్రజంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.04.2023
» **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 04.05.2023
» **వెబ్‌సైట్:** www.svnit.ac.in

న్యాయం చేసే 'లా'

న్యాయం చేసే 'లా' కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే విద్యార్థులకు గుడ్‌న్యూస్. న్యాయశాస్త్ర నైపుణ్యాలను అందించే కోర్సు ఎల్‌ఎల్‌బీ. ఇందులో ప్రవేశానికి నిర్వహించే లాసెట్‌కు.. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్ష తేదీలను కూడా ప్రకటించింది. ఈ ఎంట్రన్స్ ద్వారా మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. టీఎస్ లాసెట్-2023 వివరాలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..

» టీఎస్ లాసెట్-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీల్లో ప్రవేశం
» భవిష్యత్తు లీగల్ ప్రొఫెషనల్స్‌ను తీర్చిదిద్దే ఎల్‌ఎల్‌బీ కోర్సు
» పీజీ లా సెట్‌కు కూడా నోటిఫికేషన్ విడుదల



టీఎస్ లాసెట్ 2023

ఇటీవల కాలంలో న్యాయ శాస్త్రం కొత్త పుంతలు తొక్కుతోంది. లా గ్రాడ్యుయేట్‌లకు న్యాయవాద వృత్తి మాత్రమే కాకుండా.. కార్పొరేట్ రంగంలోనూ డిమాండ్ నెలకొంది. అందుకే ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగావకాశాలు, ఉపాధి మార్గాల విషయంలో ఎలాంటి ఢోకా లేదు అంటున్నారు నిపుణులు.

'లా'సెట్ ద్వారా ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీ కళాశాలలు, అనుబంధ కాలేజీల్లో ఎల్‌ఎల్‌బీ కోర్సులో ప్రవేశానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి 'లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (లాసెట్)'ను నిర్వహిస్తుంది. ఇందులో పొందిన ర్యాంకు ఆధారంగా.. మూడేళ్లు, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హతలు

- మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో ప్రవేశానికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఓసీ, బీసీ కేటగిరీ అభ్యర్థులు 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఓబీసీ వర్గాల వారు 42 శాతంతో, ఎస్‌సీ/ఎస్టీ వర్గాల వారు 40 శాతం మార్కులతో ఉతీర్ణత సాధించాలి.
- అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీ కోర్సుకు ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 45 శాతం మార్కులతో(ఓసీ, బీసీ) ఉత్తీర్ణత సాధించాలి. ఓబీసీ విద్యార్థులు 42 శాతంతో, ఎస్‌సీ,ఎస్టీ విద్యార్థులు 40 శాతంతో ఉత్తీర్ణత పొందాలి.
- ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు విభాగాలు.. 120 మార్కులు

- టీఎస్ 'లా' సెట్ పరీక్షను మొత్తం మూడు విభాగాల్లో 120 మార్కులకు నిర్వహిస్తారు.
- జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ విభాగం నుంచి 30 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్ విభాగం నుంచి 30 ప్రశ్నలు, ఆప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా విభాగం నుంచి 60 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- ఆప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా విభాగంలోని 60 ప్రశ్నల్లో 10 ప్రశ్నలు కాంప్రహెన్షన్ విధానంలో ఉంటాయి. న్యాయ సంబంధ అంశాలతో కూడిన ప్యాసేజ్‌లు ఇచ్చి.. వాటి ఆధారంగా సమాధానాలు ఇవ్వాల్సిన విధంగా ప్రశ్నల అడుగుతారు.
- మూడేళ్లు, అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ.. ఈ రెండు కోర్సులకు ఎంట్రన్స్ ఒకే మాదిరిగా ఉంటుంది. కాని ప్రశ్నల క్లిష్టత మూడేళ్ల కోర్సుకు డిగ్రీ స్థాయిలో, అయిదేళ్ల కోర్సుకు ఇంటర్మీడియెట్ స్థాయిలో ఉంటుంది.
- ఎంట్రన్స్ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది. మూడేళ్ల లాసెట్‌ను రెండు సెషన్లలో నిర్వహిస్తారు.

బెస్ట్ ర్యాంకు సాధించేలా

మొత్తం మూడు విభాగాల్లో నిర్వహించే లాసెట్‌లో మంచి ర్యాంకు పొందాలంటే.. నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి.

జనరల్ నాలెడ్జ్ అండ్ మెంటల్ ఎబిలిటీ

- ఈ విభాగంలో అభ్యర్థులు స్టాక్ జీకే అంశాలకు కొంత ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా చరిత్ర, వార్తల్లోని వ్యక్తులు, ముఖ్యమైన ప్రదేశాలు, సదస్సులు, చారిత్రక కట్టడాలు, స్వాతంత్ర్యం అనంతర కాలంలో జరిగిన ముఖ్యమైన సంఘటనల గురించి తెలుసుకోవాలి. కళలు, సంస్కృతి, జాతీయ ప్రాధాన్యత కలిగిన చారిత్రక అంశాలపై దృష్టి పెట్టాలి. ప్రధానంగా జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగానికి సంబంధించి రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అన్నీ తెలుసుకోవాలి.
- అదే విధంగా మెంటల్ ఎబిలిటీలో వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. బ్లడ్ రిలేషన్స్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, కోడింగ్, డీ-కోడింగ్, గ్రాఫ్స్, ఫ్లోచార్ట్స్ విశ్లేషణ వంటి అంశాలను ప్రాక్టీస్ చేయాలి.

కరెంట్ అఫైర్స్

కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సులు, జాతీయ పరిణామాలు, ప్రాంతీయ సమకాలీన అంశాలు, వార్తల్లో వ్యక్తులు, ముఖ్యమైన సంఘటనలు తదితరాల గురించి పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రామాణిక జనరల్ నాలెడ్జ్ పుస్తకాలతోపాటు, ప్రతిరోజు దిన పత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలి.

అప్టిట్యూడ్ ఫర్ స్టడీ ఆఫ్ లా

ఈ విభాగంలో న్యాయ విద్య అభ్యసించడంపై అభ్యర్థులకున్న ఆసక్తిని పరిశీలించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. ఇందులో మంచి మార్కులు సాధించాలంటే..న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరిశీలించే నైపుణ్యాలు అవసరం. నిర్దిష్టంగా ఒక సంఘటన, వివాదాన్ని పరిష్కరించేందుకు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి ఇటీవల కాలంలో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ఇటీవల కాలంలో వెలువడిన కీలక తీర్పులు, వాటి పరిణామాలు-ప్రభావం వంటి తాజా అంశాలపైనా దృష్టి పెట్టాలి.

ఉపాధి అవకాశాలు

ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసుకుంటే.. ఉజ్వల కెరీర్స్ సొంతమవడం ఖాయం. న్యాయవాద వృత్తితోపాటు కార్పొరేట్ కొలువులు కూడా దక్కించుకోవచ్చు. ప్రస్తుతం ప్రతి సంస్థ కూడా తమకంటూ ఒక ప్రత్యేక న్యాయ విభాగం ఉండాలని, వాటి ద్వారా కార్పొరేట్ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా కార్యకలాపాలు నిర్వహించి, ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగాలని భావిస్తోంది. అందుకోసం లా కోర్సులు పూర్తి చేసిన వారిని నియమించుకుంటున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు, ఆర్ అండ్ డీ సంస్థలు, బ్యాంకులు వీరికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ప్రతి ఏటా క్యాంపస్ నియామకాలు చేపడుతున్నాయి. పీజీ స్థాయిలో కార్పొరేట్ లా, సైబర్ లా, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, ఇంటర్నేషనల్ లా వంటి స్పెషలైజేషన్స్ పూర్తి చేసుకుంటే.. బహుళ జాతి సంస్థల్లో సైతం అవకాశాలు అందుకోవచ్చు.

అయిదు వేలకు పైగా సీట్లు

టీఎస్ లాసెట్ ద్వారా భర్తీ చేసే ఎల్‌ఎల్‌బీ, ఇంటిగ్రేటెడ్ ఎల్‌ఎల్‌బీకి సంబంధించి గత ఏడాది కౌన్సెలింగ్ గణాంకాల ప్రకారం-మూడేళ్ల లా కోర్సులో 3,597, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సులో 1,580 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎల్‌ఎల్‌ఎంకు సంబంధించి 620 సీట్లు ఉన్నాయి.

పీజీ లాసెట్ ఇలా

- ఎల్‌ఎల్‌బీ అర్హతగా.. ఎల్‌ఎల్‌ఎం కోర్సులో ప్రవేశానికి పీజీ లాసెట్ నిర్వహిస్తారు. -పీజీ లాసెట్ రెండు విభాగాలుగా 120 మార్కులకు ఉంటుంది.
- పార్ట్-ఎలో.. జ్యూరిస్ప్రుడెన్స్ నుంచి 20 ప్రశ్నలు, కాన్‌స్టిట్యూషనల్ లా నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి.
- పార్ట్-బిలో.. పబ్లిక్ ఇంటర్నేషనల్ లా నుంచి 16 ప్రశ్నలు; మర్కంటైల్ లా నుంచి 16 ప్రశ్నలు; లేబర్ లా నుంచి 16 ప్రశ్నలు; క్రైమ్స్ అండ్ టార్ట్స్ నుంచి 16 ప్రశ్నలు; అదర్ 'లా'స్ నుంచి 16 ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** మార్చి 2 - ఏప్రిల్ 6, 2023
- రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 12 వరకు; రూ.1000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 19 వరకు, రూ.2,000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 26 వరకు; రూ.4,000 ఆలస్య రుసుముతో మే 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** దమే 16 నుంచి
- **లాసెట్ పరీక్ష తేదీ:** మే 25, 2023
- **వివరాలకు వెబ్‌సైట్:** lawcet.tsche.ac.in

క్లుప్తంగా...



పంట రక్షణ కోసం.. గార్డియన్-2

అటవీ జంతువుల నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ఈ క్రమంలో ఆదిలాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సోమవారం ప్రయోగాత్మకంగా గార్డియన్-2 పరికరాన్ని అందుబాటులోకి తెచ్చారు. రూ.45 వేల విలువ గల ఈ పరికరాన్ని ఢిల్లీ నుంచి తీసుకువచ్చారు. ఎల్పీజీతో దీన్ని అనుసంధానం చేశారు. ప్రతి ఐదు నిమిషాలకోసారి దీని ద్వారా ప్రత్యేకమైన శబ్దం వస్తుంది. దీంతో పక్షులు, అటవీ జంతువులు చేలల్లో సంచరించకుండా ఉంటుంది. పరిశోధన కేంద్రంలో సాగు చేస్తున్న పంటలకు ఈ పరికరాన్ని ఏర్పాటు చేయగా సత్ఫలితాలిస్తున్నాయి. శాస్త్రవేత్తలు దత్తత తీసుకున్న ఆయా గ్రామాల రైతులకు వీటిపై అవగాహన కల్పిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం

ఐఎస్‌బీ–క్రొయేషియా మధ్య ఒప్పందం



కార్యక్రమంలో క్రొయేషియా ప్రతినిధి మాటోన్జావ్రో, మాజీ అధ్యక్షురాలు కిటారోవిక్, ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల

రాయదుర్గం(హైదరాబాద్):గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)ని క్రొయేషియా దేశం మధ్య విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం అవసరమని ఆ దేశ మాజీ అధ్యక్షురాలు కోలిందా గ్రాబర్ కిటారోవిక్ పేర్కొన్నారు. బుధవారం ఆమె ఐఎస్‌బీని సందర్శించగా..సంస్థ డీన్ ప్రొఫెసర్ మదన్‌పిల్లుట్ల నాయకత్వంలోని ఐఎస్‌బీ బృందం సాదర స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో విద్య పరిశోధన రంగాల్లో పరస్పర సహకారం అందించుకునేందుకు కిటారోవిక్ సమక్షంలో క్రొయేషియాలోని జాగ్రెబ్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ మేనేజ్‌మెంట్‌తో ఐఎస్‌బీ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పంద పత్రాలపై రెండు సంస్థలకు చెందిన ప్రతినిధులు జాగ్రెబ్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, అండ్ మేనేజ్‌మెంట్ డీన్ డాక్టర్ మాటోన్జావ్రో, ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్‌పిల్లుట్ల సంతకాలు చేశారు. కిటారోవిక్‌తోపాటు క్రొయేషియాలోని భారత రాయబారి రాజ్‌శ్రీవాత్సవ ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిటారోవిక్ మాట్లాడుతూ...డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, గ్రీన్ ట్రాన్సిషన్ రంగాలలో భారత్– క్రొయేషియా మధ్య భాగస్వామ్యానికి ఇరు దేశాలు నాయకత్వం వహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మదన్ పిల్లుట్ల మాట్లాడుతూ.. 32 దేశాల విద్యార్థుల మార్పిడి ప్రోగ్రామ్ నెట్‌వర్క్‌లో క్రొయేషియాను చేర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు.

కొత్తగా 17 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 2,748 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 17 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కేసుల సంఖ్య 8.42 లక్షలకు చేరింది.

ఆగ'మేఘాల' ఘుమ ఘుమలు



ఏమిటీ క్లౌడ్ కిచెన్..?

- ఓ వంటిల్లు.. వందలాది కస్టమర్లు
- క్లౌడ్ కిచెన్‌లకు పెరుగుతున్న ఆదరణ
- పెట్టుబడి తక్కువ..లాభాలు ఎక్కువ
- రెస్టారెంట్ వ్యాపారానికి దీటుగా ఎదుగుదల

సాక్షి, హైదరాబాద్: ఆకర్షణీయమైన పరిసరాలు.. అద్భుతమైన ఆహ్వానం.. అభిరుచికి తగిన ఆహారం .. అతిథి దేవోభవ అనిపించే సేవలు.. భోజన ప్రియుల్ని ఆకర్షించేందుకు రెస్టారెంట్లు పడే తాపత్రయం అంతాఇంతా కాదు. గతంలో హోటల్‌కు వెళ్లి తినడాన్ని జనం అంతగా ఇష్టపడేవారు కాదు. కొందరు అదేదో లగ్జరీగా భావించేవారు. ఇప్పుడు వీకెండ్‌లో కుటుంబంతో సహా రెస్టారెంట్‌కు వెళ్లడం సాధారణంగా మారిపోయింది. ఆన్‌లైన్ డెలివరీలు పెరిగిన నేపథ్యంలో.. వారంలో రెండు మూడుసార్లన్నా బయట ఆర్డర్ చేసి తెప్పించుకోవడమూ పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో ఫుడ్ బిజినెస్ లాభదాయకమనే భావన ఉన్నప్పటికీ..ఆశించిన ఆదరణ లభించకపోతే భారీ నష్టాన్ని మూటగట్టుకోవడం మాత్రం ఖాయం. ఈ నేపథ్యంలోనే ఫుడ్ బిజినెస్‌కు సంబంధించి ఓ సరికొత్త ట్రెండ్ మొదలైంది. అదే క్లౌడ్ కిచెన్. దేశ, విదేశాల్లో ఎప్పట్నుంచో ఉన్న ఈ క్లౌడ్ కిచెన్‌లు ఇప్పుడు హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లోనూ ప్రారంభమవుతూ ఆదరణ పొందుతున్నాయి.

ఒక వంటిల్లు.. వందలాది కస్టమర్లు అన్నట్టుగా క్లౌడ్ కిచెన్‌ల హవా సాగుతోంది. కరోనా సమయంలో ఇవి ఎక్కువగా పుంజుకున్నాయి. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో పాతిక మించి లేని క్లౌడ్ కిచెన్లు ఇప్పుడు వందల సంఖ్యకు చేరాయి. విలాసవంతమైన రెస్టారెంట్లు..లేదు లేదు అసలు రెస్టారెంట్ అన్న భావనకు ఇది పూర్తిగా భిన్నం. హంగూ ఆర్భాటాలు ఏమీ ఉండవు. రెస్టారెంట్ వ్యాపారాన్ని ప్రారంభించడానికి అవసరమైన పెట్టుబడిలో 1/3 వంతు సరిపోతుంది. తక్కువ పెట్టుబడి, తక్కువ సిబ్బంది, తక్కువ వ్యయ ప్రయాసలు..స్పష్టంగా చెప్పాలంటే ఒక్క వంటిల్లు మాత్రమే ఉంటుంది. నో డైన్ ఇన్..ఓన్లీ డెలివరీ. కూర్చుని తినడానికి వీలుండదు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే సప్లై చేస్తారు..అంతే. క్లిక్ అయితే ఎక్కువ లాభాలు. ఆదరణ లభించకపోయినా అంతంత మాత్రంగానే నష్టం..ఇదే క్లౌడ్ కిచెన్ మూల సూత్రం.

షార్ట్ టైమ్.. ఫుల్ పికప్..

జొమాటో, స్విగ్గీ తదితర ఫుడ్ డెలివరీ యాప్స్ సృష్టించిన ఈ ట్రెండ్ కరోనా విజృంభణ సమయంలో పట్టును దక్కించుకుంది. ఇంటర్నెట్ విస్తృత వ్యాప్తి, వ్యాపారంలో సాంకేతికత, ప్రత్యేక యాప్‌ల పెరుగుదల ఇందుకు దోహదపడింది. పెరుగుతున్న యువ జనాభా ఆదాయం, మారుతున్న జీవనశైలి, సులభమైన.. సురక్షితమైన చెల్లింపు మార్గాలు, వంటింట్లో బిజీబిజీ పరిస్థితి నుంచి కాస్త ఉపశమనం ఇత్యాదివన్నీ కూడా వీటికి ఆదరణ పెరగడానికి కారణాలుగా పేర్కొనవచ్చు. ఇంట్లో వండినట్టుండే ఆహారం నుంచి స్పెషాలిటీ లగ్జరీ డిన్నర్‌ల వరకు ప్రతిదానిని అందించడం ద్వారా క్లౌడ్ కిచెన్‌లు ఈ రంగంలో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. తక్కువ రేటుతో, నాణ్యమైన భోజనం, నిమిషాల్లో ఇంటి ముందు ప్రత్యక్షమవుతుండటంతో నానాటికీ వీటికి ఆదరణ పెరుగుతోంది. 2019లో దేశంలో 400 మిలియన్ల డాలర్లుగా ఉన్న క్లౌడ్ కిచెన్‌ల వ్యాపారం 2024 నాటికి 2 బిలియన్ల డాలర్లకు చేరుతుందని ఎఫ్ అండ్ బీ (ఫుడ్ అండ్ బివరేజెస్) పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తుండటం గమనార్హం.

దూకుడు పెరగడం ఖాయం



మొదట్లో కొన్ని ఐటమ్స్‌కే పరిమితమైనా ఇప్పుడు రెస్టారెంట్‌లో దొరికే వెరైటీలన్నీ అందిస్తున్నాయి. బిర్యానీల కోసం ఒకటి, పరోటాల కోసం ఒకటి, బర్గర్స్, పిజ్జాల కోసం, స్వీట్స్, పేస్ట్రీల కోసం.. ఇలా దేనికదే ప్రత్యేక కిచెన్స్ వచ్చేశాయి. అపరిమితమైన కస్టమర్స్ బేస్ అవకాశాల వల్ల వీటి దూకుడు ఇంకా పెరగడం తథ్యం.

–సంకల్ప్, హైదరాబాద్ ఫుడీస్ క్లబ్

ఒకేచోట 100కు పైగా..



శాకాహార, ఆరోగ్యకరమైన వంటకాలు, ప్రాంతీయ రుచికరమైన వంటకాలు వంటివి అందించే ఆఫ్‌లైన్ రెస్టారెంట్‌ల సంఖ్య పెరగడాన్ని.. అలాగే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ క్లౌడ్ కిచెన్‌ల ఏర్పాటును ఈ ఏడాది చూడవచ్చునని నిపుణులు అంటున్నారు. స్విగ్గీ, జొమాటో వంటివి..క్లౌడ్ కిచెన్‌లకు ఆధారంగా ఉన్నప్పటికీ, భారీ కమీషన్ల ఫలితంగా, కొన్ని క్లౌడ్ కిచెన్‌లు తమ సొంత యాప్‌లు, సెల్ఫ్ డెలివరీ ప్రయోగాలు కూడా చేస్తున్నాయి. నాగచైతన్య వంటి సినిమా తారలను సైతం ఈ క్లౌడ్ కిచెన్స్ ఆకర్షిస్తున్నాయి. నగరంలోని డీఎల్‌ఎఫ్ ఏరియా లాంటి ఒకేచోట 100కు పైగా క్లౌడ్ కిచెన్‌లు ఉన్నాయంటే వీటికి లభిస్తున్న ఆదరణను అర్థం చేసుకోవచ్చు. సినీహీరో నాగచైతన్య ఏర్పాటు చేసిన 'షోయు' ఇప్పటికే బాగా ట్రెండింగ్‌లో ఉంది.

హైదరాబాద్ టాప్...



గత కొంత కాలంగా రెస్టారెంట్ వ్యాపారంలో ఉన్న మేం లగ్జరీ డైనింగ్‌ను కెఫెల ద్వారా అందిస్తున్నాం. మా బ్రాండ్‌కు ముంబయి, బెంగళూరు, చెన్నై సహా ప్రతిచోటా క్లౌడ్ కిచెన్స్ కూడా ఉన్నాయి. అయితే హైదరాబాద్‌లో మాకు ఆదరణ చాలా స్పీడ్‌గా పెరిగింది. బంజారాహిల్స్, గచ్చిబౌలి, ఎల్బీనగర్... ఇలా 4 చోట్ల మా కిచెన్స్ నిర్వహిస్తున్నాం.

–భాను, లూయిస్ బర్గర్స్



ట్రెండ్‌ను మేం ముందే ఊహించాం..

–పి.అభిషేక్‌రెడ్డి, సహదేవ్‌రెడ్డి టిఫిన్స్

పాతికేళ్లుగా మేం మిఠాయిల తయారీలో ఉన్నాం. ఈ ట్రెండ్‌ని ముందే ఊహించి సహదేవ్‌రెడ్డి టిఫిన్స్ పేరుతో క్లౌడ్ కిచెన్ అందరికీ తెలిసే సమయానికే మేం ప్రారంభించాం. సౌత్ ఇండియన్ బ్రేక్ ఫాస్ట్, చాట్ వంటివన్నీ డెలివరీ చేస్తాం. మా కిచెన్ దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంది. తెల్లవారుజాము 4 గంటలకే స్టార్ట్ చేసి అర్ధరాత్రి ఒంటిగంట వరకూ నిర్వహిస్తాం. సిటీలోని అన్ని ప్రాంతాల నుంచీ ఆర్డర్స్ వస్తున్నాయి. వ్యయ ప్రయాసల పరంగా చూస్తే ఇది చాలా మంచి వ్యాపారం. గృహిణులు, యువత దీన్ని బాగా అందిపుచ్చుకుంటున్నారు.

తెలుగు పద్మాలకు పురస్కారాల ప్రదానం

- పద్మశ్రీ అందుకున్న పలువురు తెలుగు ప్రముఖులు
- పురస్కారాలు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ, నందిగామ



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి అవార్డులు స్వీకరిస్తున్న (ఎడమ నుంచి) డాక్టర్ మోదడుగు విజయ గుప్త, డాక్టర్ పసుపులేటి హనుమంతరావు, బి.రామకృష్ణారెడ్డి, కమలేష్ డి పటేల్



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి అవార్డులు స్వీకరిస్తున్న (ఎడమ నుంచి) సంకురాత్రి చంద్రశేఖర్, కోట సచ్చిదానంద శాస్త్రి , ప్రొఫెసర్ ప్రకాశ్ చంద్ర సూద్, చింతపాటి వెంకటపతి రాజు

పద్మ అవార్డుల ప్రదానోత్సవం రాష్ట్రపతి భవన్‌లో వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో విశిష్టసేవలందించిన 106 మందికి జనవరి 25న కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులు ప్రకటించిన విషయం విదితమే. బుధవారం తొలివిడత ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా పలువురికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అవార్డులు అందజేశారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎం.కృష్ణకు పద్మ విభూషణ్ అందజేశారు. కుమార మంగళం బిర్లా (ట్రేడ్ ఇండస్ట్రీ), సుమన్ కల్యాణ్‌పూర్ (ఆర్ట్) , కపిల్ కపూర్ (లిటరేచర్, ఎడ్యుకేషన్), ధ్యాన గురువు కమలేష్ డి పటేల్ (ఆధ్యాత్మికం) పద్మభూషణ్ అందుకున్నారు. పద్మశ్రీ విభాగంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన డాక్టర్ మోదడుగు విజయగుప్త(సైన్స్, ఇంజనీరింగ్, తెలంగాణ) పుసుపులేటి హనుమంతరావు(చికిత్స పీడియాట్రిక్స్, తెలంగాణ), బండి రామకృష్ణారెడ్డి (లిటరేచర్, ఎడ్యుకేషన్–తెలంగాణ), సంకురాత్రి చంద్రశేఖర్ (సమాజ సేవ, ఆంధ్రప్రదేశ్), చింతపాటి వెంకటపతి రాజు (కళ, ఆంధ్రప్రదేశ్), కోట సచ్చిదానంద శాస్త్రి (కళ, హరికథ– ఆంధ్రప్రదేశ్), ప్రొఫెసర్ ప్రకాశ్ చంద్ర సూద్ (సాహిత్యం– ఆంధ్రప్రదేశ్) పద్మశ్రీ అందుకున్నారు.

'ట్రూఅప్'పై తేలేది నేడే..!

రూ.16,107 కోట్ల చార్జీల వసూలుకు డిస్కంల ప్రతిపాదనలు

- గత నెలలోనే ముగిసిన అభిప్రాయ సేకరణ
- నేడు నిర్ణయం వెలువరించనున్న ఈఆర్సీ
- విద్యుత్ టారిఫ్‌లో మార్పులు లేనట్టే..!



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ వినియోగదారుల నుంచి మొత్తం రూ.16,107 కోట్ల ట్రూఅప్ చార్జీల వసూళ్లకు అనుమతి కోరుతూ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సమర్పించిన ప్రతిపాదనలపై తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) గురువారం తన నిర్ణయాన్ని ప్రకటించనుంది. 2016–17 నుంచి 2022–23 మధ్య కాలానికి సంబంధించి రూ.12,015 కోట్ల విద్యుత్ కొనుగోలు ట్రూఅప్ చార్జీలతో పాటు 2006–07 నుంచి 2020–21 మధ్యకాలానికి సంబంధించి రూ.4,092 కోట్ల డిస్ట్రిబ్యూషన్ ట్రూఅప్ చార్జీల వసూళ్లు ఆ ప్రతిపాదనల్లో ఉన్నాయి. విద్యుత్ చట్టం 2003, విద్యుత్ టారిఫ్ నిబంధనల ప్రకారం.. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ 1 తేదీ నుంచి కొత్త టారిఫ్ ఉత్తర్వులను అమలు చేయాల్సి ఉంది. దీనికి కనీసం వారం రోజుల ముందు టారిఫ్ ఉత్తర్వులను ఈఆర్సీ ప్రకటించాలి. ఈ నేపథ్యంలో గురువారం 2023–24కి సంబంధించిన వార్షిక టారిఫ్ ఉత్తర్వులతో పాటు ట్రూఅప్ చార్జీలపై ఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేయనుందని ఇంధన శాఖ వర్గాలు తెలిపాయి.

ట్రూఅప్ చార్జీలపైనే ఉత్కంఠ

ప్రస్తుత విద్యుత్ టారిఫ్ 2023–24లోనూ యథాతథంగా కొనసాగించాలని వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్ఆర్) నివేదికలో డిస్కంలు ప్రతిపాదించిన నేపథ్యంలో విద్యుత్ టారిఫ్‌లో మార్పులు ఉండే అవకాశాలు లేవు. అయితే రూ.16,107 కోట్ల ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలపై ఈఆర్సీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23)లో రూ.5,986 కోట్ల మేర విద్యుత్ చార్జీలను పెంచిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో వినియోగదారులపై పడే భారాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.16,107 కోట్ల ట్రూఅప్ చార్జీల్లో ఎంత మేరకు వినియోగదారుల నుంచి వసూలు చేయాలి? ఎంత కాల వ్యవధిలో వసూలు చేయాలి? అన్న అంశాలపై ఈఆర్సీ నిర్ణయాన్ని ప్రకటించనుంది.

పారిశ్రామిక, వినియోగదారుల సంఘాల వ్యతిరేకత

ఏఆర్ఆర్‌తో పాటు ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలపై గత నెలలో ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించి అన్ని వర్గాల వినియోగదారుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. డిస్కంలు 2019–20, 2020–21, 2021–22 సంవత్సరాలకు సంబంధించిన ఏఆర్ఆర్ నివేదిక, టారిఫ్ ప్రతిపాదనలను సమర్పించలేదని, నిబంధనల మేరకు ఈ సంవత్సరాలకు సంబంధించిన ట్రూఅప్ చార్జీల వసూళ్లకు అనుమతి ఉండదని బహిరంగ విచారణలో విద్యుత్ రంగ నిపుణులు, పారిశ్రామిక సంఘాలు వాదనలు వినిపించాయి.

ట్రూఅప్ చార్జీలు అంటే..?

ఒక ఆర్థిక సంవత్సరంలో అయ్యే విద్యుత్ పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) వ్యయం, విద్యుత్ కొనుగోలు వ్యయ అంచనాలను ఈఆర్సీ ముందస్తుగా ఆమోదిస్తుంది. దీనికి తగినట్టుగా కరెంట్ బిల్లుల వసూళ్లకు అనుమతిస్తుంది. ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత లెక్క తేల్చిన వాస్తవ వ్యయంలో ఉండే హెచ్చుతగ్గులను ట్రూఅప్/ ట్రూడౌన్ చేయాల్సి ఉంటుంది. అంటే ముందస్తుగా అనుమతించిన వ్యయం కన్నా అధిక వ్యయం జరిగితే, ఆ మేరకు వ్యత్యాసాన్ని ఆ తర్వాత కాలంలో ట్రూఅప్ చార్జీల పేరుతో వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. ఒక వేళ తక్కువ వ్యయం జరిగితే ఆ తర్వాత కాలంలో విద్యుత్ చార్జీలను తగ్గించి ట్రూడౌన్ చేయాల్సి ఉంటుంది.

ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా కంపెనీల ఆసక్తి

అమెరికాతో వాణిజ్య బంధానికి యూఎస్ కాన్సులేట్ కీలక పాత్ర

- అమెరికా ఫారెన్ పాలసీ బ్రీఫింగ్‌లో హైదరాబాద్ కాన్సులేట్ ప్రస్తావన
- వైట్ హౌస్ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ వెల్లడి



నూతన కాన్సులేట్ వద్ద సిబ్బందితో కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్

సాక్షి, హైదరాబాద్: అమెరికా, భారత్‌ల మధ్య పటిష్ట వాణిజ్య బంధానికి హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ కీలక పాత్ర పోషిస్తోందని వాషింగ్టన్‌లో అమెరికన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ అధికార ప్రతినిధి వేదాంత్ పటేల్ వెల్లడించారు. హైదరాబాద్‌లో పెట్టుబడుల కోసం ఎన్నో అమెరికన్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయన్నారు. నానక్‌రాంగూడలో సుమారు రూ.2,800 కోట్ల భారీ వ్యయంతో నూతనంగా నిర్మించిన యూఎస్ కాన్సులేట్ భవనంలో ఈనెల 20 నుంచి ప్రారంభమైన కార్యకలాపాలను ఆయన బుధవారం మీడియాకు వెల్లడించారు. భారత్‌లో అమెరికా పెట్టుబడులే కాకుండా భారత్ నుంచి అమెరికాలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు గాను ఈ కొత్త కాన్సులేట్ బిల్డింగ్ ఎంతో దోహదపడుతుందని వివరించారు. అమెరికా ఫారెన్ పాలసీ బ్రీఫింగ్ లో అమెరికా ఫారెన్ పాలసీ బ్రీఫింగ్ లో హైదరాబాద్ లోని కొత్త కాన్సులేట్ గురించి ప్రస్తావించడం ప్రాధాన్యమైన విషయమన్నారు.

దక్షిణాసియాలోనే అతిపెద్ద కాన్సులేట్

హైదరాబాద్‌లో సౌత్ ఆసియాలోనే అతిపెద్ద విశాలమైన అమెరికన్ కాన్సులేట్ నిర్మించి భారతదేశంతోనే కాకుండా హైదరాబాద్‌తో కొనసాగుతున్న బలమైన బంధాన్ని అమెరికా మరోసారి గుర్తు చేసిందని వేదాంత్ పటేల్ వ్యాఖ్యానించారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన తెలుగు వారికి వీసా సౌకర్యాల కోసమే కాకుండా హైదరాబాద్‌లో అమెరికాకున్న వాణిజ్య అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఈ విశాలమైన కాన్సులేట్ భవనాన్ని 12 ఎకరాల్లో అధునాతన పరిజ్ఞానంతో నిర్మించినట్లు తెలిపారు. కాగా అమెరికాతో వాణిజ్యానికి సంబంధించి హైదరాబాద్‌లోని కాన్సులేట్ కార్యాలయం ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు తన లింక్డిన్ ప్రొఫైల్ ద్వారా మెసేజ్ చేశారు.

తెలుగు రాష్ట్రాల వీసా కేంద్రంగా హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల నుంచి స్టూడెంట్ వీసాతో పాటు వాణిజ్య, పర్యాటక, డిపెండెంట్ వీసాల అవసరాలకు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్‌కు రావడం తప్పనిసరి. దేశంలో వీసా, దౌత్య కార్యకలాపాల కోసం నాలుగు కాన్సులేట్‌లు ఉండగా, అందులో హైదరాబాద్‌లోని కాన్సులేట్ అతిపెద్దది కావడం గమనార్హం. వీసా ఇంటర్వ్యూ అవసరం ఉన్నవారు మొదట హైటెక్ మెట్రో స్టేషన్‌లోని వీసా అప్లికేషన్ సెంటర్‌లో డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయాలి. వీసా రెన్యువల్ కోసం ఇంటర్వ్యూ మినహాయింపు కలిగిన వారు వీసా అప్లికేషన్ సెంటర్ లో డాక్యుమెంట్స్ దాఖలు చేస్తే చాలు. ఇంటర్వ్యూ అవసరం ఉన్నవారు నానక్‌రాం గూడలోని కొత్త అమెరికన్ కాన్సులేట్ కార్యాలయంలో అటెండ్ అవ్వాల్సి ఉంటుంది.

ఇక రాష్ట్రపతి నిలయం చూడొచ్చు

- సందర్శనను వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- రాష్ట్ర ప్రజలకు తెలుగులో ఉగాది శుభాకాంక్షలు తెలిపిన ద్రౌపదీ ముర్ము



రాష్ట్రపతి నిలయంలో చిత్రాలను తిలకిస్తున్న గవర్నర్ తమిళిసై, కిషన్‌రెడ్డి తదితరులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం పర్యాటక కేంద్రంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఇకపై పదకొండు నెలల పాటు ప్రజలు సందర్శించుకునేందుకు గానూ వర్చువల్‌గా ఉగాది పర్వదినాన బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆ నిలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, సీఎస్ శాంతకుమారి పాల్గొన్నారు. రాష్ట్రపతి నిలయంలోని నాలెడ్జ్ గ్యాలరీ, కిచెన్ టన్నెల్, సందర్శకుల వసతుల కేంద్రం, మెట్ల బావి, 1948లో హైదరాబాద్ సంస్థానం విలీనం అయిన సందర్భంగా చారిత్రక పతాక స్తంభంలను రాష్ట్రపతి ప్రారంభించారు. ముందుగా ద్రౌపదీ ముర్ము తెలుగులో రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి నిలయం విశేషాలు ప్రజలు తెలుసుకోవాలనే సందర్శనకు అనుమతించామన్నారు. యువతరం స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకోవాలని, స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన విలువలను గౌరవించాలని పిలుపునిచ్చారు. గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ 162 సంవత్సరాల చరిత్ర గల రాష్ట్రపతి నిలయంను సందర్శించి విశేషాలను తెలుసుకోవాలని కోరారు. 97 ఎకరాల్లో ఉన్న రాష్ట్రపతి నిలయాన్ని అందరూ చూడొచ్చని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా ఉగాది వేడుక, పంచాంగ శ్రవణం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి నిలయాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ సిద్ధాంతి రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. మోదీ పాలన భేషుగ్గా ఉంటుందని, దేశం అభివృద్ధి చెందుతుందని, కశ్మీర్ లాగే ఇతర ప్రాంతాల వాళ్ళు కూడా మన దేశంలో కలుస్తారని రాజేశ్వర శర్మ పేర్కొన్నారు. దర్శార్ రాజ్‌కుమార్ బృందం ఆధ్వర్యంలో పేరిణి నృత్యం ద్వారా అర్ధ నారీశ్వర తత్వం ప్రదర్శించారు. జవహర్ నవోదయ విద్యార్థుల ఆధ్వర్యంలో బతుకమ్మ, డప్పు వాయిద్యాల సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కిషన్‌రెడ్డి, మహమూద్ అలీ కళాకారులను సన్మానించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.